మన సమగ్ర
ప్రజావాణి
తెలుగు డైలీ

RNI NO:TGTEL/25/A5443

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రాజన్న సిరిసిల్ల	శుక్రవారం	04.09.2026	సంపుటి : 01	సంచిక : 246	పేజీలు : 12	వెల : 2/-
RAJANNA SIRICILLA	FRIDAY	04.09.2026	Volume : 01	Issue :246	Pages : 12	Cost : 2/-

Wanted Reporters

తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికీ ప్రాధాన్యత)

Ph: 9440032006

మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్..?

మంత్రివర్గం నుంచి ఉద్వాసన

- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్‌కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ
- సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

హైదరాబాద్,సెప్టెంబర్ 3 : తెలంగా ణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపా దించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో మిగతా2లో...

ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

● ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు ● ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం ● ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక! ● మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 : ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చు కోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకో వడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజేష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో మిగతా2లో...

ఉద్యమాల ఖిల్లా నుంచే..
గులాబీ గర్జన

హైదరాబాద్,సెప్టెంబర్ 3 : సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు నీటి విడుదల షెడ్యూల్‌ను ఈ నెల 14లోపు ప్రకటించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిగతా2లో...

మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

● కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి
● బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్,సెప్టెంబర్ 3 : తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు.

మిగతా2లో...

కేబినేట్‌లో బీసీ వర్గానికి
ప్రాధాన్యత..

● సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్ ● ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా గద్వాల విజయ లక్ష్మి ● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ● కుడా చైర్ పర్సన్‌గా గుండు సుధారాణికి చాన్స్ ● బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

- మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు
- చెన్నై నగరం వేదికగా ఒలింపిక్స్
- సీఎం విజయ్ సంచలన ప్రకటన

9 రోజుల్లోనే రూ.9వేల కోట్ల
రైతుభరోసా చెల్లించాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్,సెప్టెంబర్ 3 : తమ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.36 వేల కోట్ల నిధులను రైతుభరోసా కింద రైతులకు అందించినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ చార్జ్ షీట్ కాదని, పదేళ్ల రైతు వ్యతిరేక పాలనపై ప్రజల చార్జ్‌షీట్‌కు ఆ పార్టీ సమాధానం మిగతా2లో...

ఎస్ఐఆర్‌లో ఆ భాధ్యత మాత్రమే
బిఎల్ఎలది: హైకోర్టు

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 3 : దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా ఎన్యూ మరేషన్ ఫారాల్లో ధ్రువీకరించలేని తప్పుడు వివరాలకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల(బిఎల్ఏ)ను బాధ్యులుగా చేయలేమని ఢిల్లీ హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. బూత్ స్థాయి మిగతా2లో...

నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్
చేశారు: కొండా సురేఖ

హైదరాబాద్,సెప్టెంబర్ 3 : తానింకా రాజీ నామా చేయలేదని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఎఐసిసి మల్లిఖార్జున ఖర్గేకు వివరణ ఇచ్చినా..తనను బలి చేయడం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ..అధిష్టానానికి రాసిన లేఖను విడుదల చేస్తున్నానని, తన వివరణ అడగకుండానే తనను

ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్..?

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూదిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

హైదరాబాద్,సెప్టెంబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు.

కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టారు.

చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు.

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

పరకాల నుంచి సిఎం పోటీ చేయాలి

రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా
నా తల్లికి అన్యాయం జరిగింది
బర్తరఫ్ నన్ను తీవ్రంగా బాధించింది
మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు
సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఫైర్

హైదరాబాద్,సెప్టెంబర్ 3 : తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు. తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానిం చారు. అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

చెన్నై,సెప్టెంబర్ 3 : తమిళనాడు రాజధాని చెన్నైను ప్రపంచ స్పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. తమిళనాడు స్పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఒలింపిక్ సిటీని అభివృద్ధి చేస్తామని సిఎం ప్రకటించారు. దీని కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అధునాతన సౌకర్యాలతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి చెన్నైని ప్రపంచ ఒలింపిక్ నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతేగాక ఫార్ములా వన్ రేసుల కోసం చెన్నై నగరాన్ని సిద్ధం చేస్తామన్నారు. ప్రపంచ స్థాయి మోటార్ స్పోర్ట్ పోటీలు జరిగేలా ట్రాక్‌లను నిర్మిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో చెన్నైని ప్రపంచ క్రీడా నగరంగా మార్చడమే లక్షంగా ముందుకు సాగుతామని సిఎం ప్రకటించారు.

ఉద్యమాల ఖిల్లా నుంచే.. గులాబీ గర్జన

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిత గడువులోగా షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలో బిఆర్ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కెటిఆర్ విమర్శించారు. ఎన్ని తడులు నీరు విడుదల చేస్తారు.. ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారు. వారబందీ విధానం అమలు చేస్తారా అనే అంశాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. 2003లో సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల కోసం కెసిఆర్ పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను కూడా పాదయాత్ర చేస్తానన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

ఏ రోజుల్లోనే రూ.లివేల కోట్లు రైతుభరోసా చెల్లించాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతు వినాశనం జరిగితే కాంగ్రెస్ రెండున్నరేళ్లలో రైతు వికాసం జరిగిందని ఆ ప్రకటనలో గుర్తు చేశారు.రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. 20142018 వరకు రైతుబంధు అనే పథకమే లేదని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేసుకోవాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతుబంధు ప్రారంభించిన తర్వాత కూడా ప్రతి విడత నిధుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని తెలిపారు. రూ.6 వేల కోట్లతో మొక్కజొన్న, రూ.2 వేల కోట్లతో జొన్నలు కొనుగోలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుకు పెట్టుబడి సాయంతో పాటు 42.16 లక్షల మంది రైతులకు రైతుబీమా ద్వారా రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. రైతు బీమాతో పాటు పంటల బీమాను కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

ఎస్ఐఆర్‌లో ఆ భాధ్యత మాత్రమే బిఎల్ఎలది: హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఏజెంట్లు ఓటరు ఫోటో వంటి ధ్రువీకరించగల సమాచారానికి మాత్రమే బాధ్యత వహిస్తారని జస్టిస్ అమిత్ బన్సాల్ పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల్లోని అన్ని వివరాలను తాము వ్యక్తిగతంగా ధ్రువీకరించాలని హామీ ఇస్తూ బిఎల్ఎలు వ్యక్తిగత అంటర్‌టేకింగ్ ఇవ్వాలన్న నిబంధనను పిటిషనర్లు హైకోర్టులో సవాలు చేశారు. ఈ మేరకు ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, డిపిసిసి బూత్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పిటిషన్లు వేశారు. ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేసే సమాచారం మొత్తం సంబంధిత ఓటరుకే ప్రత్యేకంగా తెలిసినదని, బిఎల్ఎ పాత్ర కేవలం ఓటరుకు సహాయం చేయడానికే పరిమితమని పిటిషనర్లు వాదించారు. అందువల్ల ఆ వివరాలన్నింటినీ బిఎల్ఎ వ్యక్తిగతంగా ధ్రువీకరించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.దీనిపై హైకోర్టు విచారణ జరిపి, ఎన్యూమరేషన్ ఫారంలోని మొత్తం సమాచారానికి బిఎల్ఎను బాధ్యుడిగా చేయలేమని, ఆ సమాచారాన్ని బిఎల్ఏ ధ్రువీకరించే పరిస్థితి ఉండదని పేర్కొంది. 2002 ఓటర్ల జాబితా, తుది 2025 ఓటర్ల జాబితా ఈసిఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, లేదంటే ఈసిఐ నుంచి భౌతిక ప్రతులను పొందవచ్చని కూడా హైకోర్టు తెలిపింది. ఎస్ఐఆర్ నిర్వహణకు ఆధారంగా ఉపయోగిస్తున్న ఓటర్ల జాబితాల భౌతిక ప్రతులను పిటిషనర్లు 2026 మే వరకూ నిర్దీత రుసుము చెల్లించి కోరవచ్చని కోర్టు పేర్కొంది.

నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్ చేశారు: కొండా సురేఖ

(మొదటి పేజీ తరువాయి)

బర్తఫ్ చేశారని, ఎఐసిసి ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ కు కూడా నా బాధంతా చెప్పుకున్నారని తెలియజేశారు. తనకూతురు ఇండిపెండెంట్.. తనతో తనకు సంబంధం లేదని.. తన ఫ్యామిలీ తనది అని కొండా సురేఖ పేర్కొన్నారు.

తన బిడ్డ మాట్లాడితే తనను బాధ్యురాలిని చేస్తున్నారని.. తానేం చేయాలి? అని ప్రశ్నించారు. రాజీనామా చేయమని తనను అడగలేదని, తాను చేయలేదని చెప్పారు. రాజకీయాల్లోకి రావాలని తనకు కోరిక ఉందని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు.

సంక్షేమ హాస్టల్ లో మెనూ వారీగా భోజనం అందించాలి.

- జిల్లా వ్యాప్తంగా హాస్టళ్ల మౌలిక సదుపాయాలు వెంటనే పరిష్కరించాలి..
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జాల సుమంత్.

కడప : సెప్టెంబర్ 3 (ప్రజావాణి)కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో రోజువారీ మెనూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (SFI) గా గురువారం మధ్యాహ్నం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జాల సుమంత్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలోని పలు హాస్టళ్లలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు,పరిశుభ్రమైన తాగునీరు,మరుగుదొడ్లు, విద్యుత్, తదితర సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని తెలిపారు. అలాగే హాస్టళ్లలో మెస్ బోర్డులు ఏర్పాటు చేసి, ప్రతిరోజు అందించే మెనూను స్పష్టంగా ప్రదర్శించాలని అన్నారు.విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందించాలని, ఆహారం నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ఉన్న సమస్యలు అధికారులు పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని హాస్టళ్లను తనిఖీ చేసి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.విద్యార్థులకు నాణ్యమైన వసతి, పౌష్టికాహారం,మౌలి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అందోళన సిద్దమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హరి బాబు కడప నగర అధ్యక్షులు నవీన్ నగర నాయకులు కార్తిక్. తదితరులు పాల్గొన్నారు.

ఆర్డిటి సంస్థ చైర్మన్ ఫెర్రర్ ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంత పురం సెప్టెంబర్ 03 ప్రజా వాణిరూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దివంగత కీర్తిశేషులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సతీమణి అన్నే ఫెర్రర్ ను వారి కుమారుడు రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ మాంచో ఫెర్రర్ ని అనంతపురం నగరంలోని ఆర్డిటి కార్యాలయం లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ డి టి సంస్థ నిర్వహిస్తున్న విద్య, వైద్యం వెనుకబడిన వర్గాల కోసం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం గురించి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఫెర్రర్ తో మాట్లాడారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలోనే కాకుండా కడప, కర్నూలు, చిత్తూరు పాటు తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్నగర్, కరీంనగర్, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డిటి చైర్మన్ మంచో ఫెర్రర్ , రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఆయన వివరించారు. ఆర్డిటి చైర్మన్ ను కలిసినవారిలో పరిటాల సునీత సోదరుడు బాలాజీ, పరంధామ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఉద్దానముం లోని అక్కల గెడ్డకు వంశధార సాగునీరు నీరు వచ్చింది

- రానున్న రోజుల్లో ఉద్ధానానికి సాగునీరు అందించే ప్రయత్నాలు ..

పలాస ప్రజావాణి ప్రతినిధి కూటమి సర్కార్ రైతులు కోసము కృషి చేస్తుంది.శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలోని అక్కలగడ్డ (వజ్రపుకొత్తూరు మండలం)ఇప్పుడు పలాస మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ భూములకు వంశధార ఎడమ కాలువ ద్వారా సాగునీరు వివిధ బ్రాంచ్ కాలువలు మరియు లోకల్ డిస్ట్రిబ్యూటరీ (పంపిణీ) కాలువల నెట్‌వర్క్ ద్వారా అందించే కార్యక్రమం జరుగుతుంది. ఇందులో భాగంగా నీటి లభ్యత మరియు ప్రధాన వనరు హిరమండలంలోని గొట్టా బ్యారేజీ నుంచి వంశధార ఎడమ ప్రధాన కాలువ (ఎల్ ఎం సి)ప్రారంభమవుతుంది. ఈ ప్రధాన కాలువ శ్రీకాకుళం జిల్లాలోని పలు మండలాల మీదుగా ప్రవహిస్తూ పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు మండలం వరకు విస్తరించి ఉంది. బ్రాంచ్ కాలువల ద్వారా ప్రవాహం వంశధార ఎడమ ప్రధాన కాలువ నుంచి పలాస, వజ్రపుకొత్తూరు పరిసర ప్రాంతాలకు నీటిని చేరవేయడానికి ప్రధానంగా 25 ఆర్ డిస్ట్రిబ్యూటరీ (మేఘవరం బ్రాంచ్ కెనాల్) కీలకపాత్ర పోషిస్తుంది. ఈ బ్రాంచ్ కాలువల ద్వారా నీరు ప్రవహించి, పలాస నియోజకవర్గ పరిధిలోని చివరి ఆయకట్టు భూములకు చేరుకుంటుంది. అక్కలగడ్డకు నీరు చేరే విధానం మేఘవరం బ్రాంచ్ కాలువ మరియు దాని ఉప-కాలువల (సబ్-మైనర్ కెనాల్స్) ద్వారా నీరు వజ్రపుకొత్తూరు మండలానికి వస్తుంది. అక్కడి నుండి స్థానికంగా ఉండే ఫీడర్ ఛానల్స్ (బోదె కాలువలు) మరియు పొలాల గుండా ప్రవహించే చిన్న కాలువల ద్వారా అక్కలగడ్డ రెవెన్యూ పరిధిలోని సాగుభూములకు నీరు సరఫరా అవుతుంది.ప్రస్తుత పరిస్థితి అండ సవాళు :అక్కలగడ్డ మరియు వజ్రపుకొత్తూరు ప్రాంతాలు వంశధార ఎడమ కాలువకు చివరి భూములకు సాగు నీరు అందించాలని అధికారులు ప్రయత్నాలు ఫలించాయి.

అలరించిన విద్యార్థుల ఆటపాటలు

- బాలికల కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ వేడుక

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 03, ప్రజావాణి:మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బాలోజీ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. ఇటీవలే విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం కూడా అందించడం జరుగుతుందన్నారు. తర్వాత మధ్యాహ్న భోజనం కూడా ఉంటుందని వెల్లడించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జాన్సీ, తిరుపతి, రావుల తిరుమల్, శశాంక్, శ్రీదేవి, నగేష్, ఎల్ ఆర్ కే రెడ్డి, మౌనిక, సబిత, అతిథి అధ్యాపకులు సురేష్, దీపారాణి, సిబ్బంది బియ్యబాని, రాజయ్య, అర్జయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

హోలీ రోసరి పాఠశాలలో ముందస్తుగా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పోరుమామిళ్ల, సెప్టెంబర్ 3 (ప్రజావాణి):వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండల కేంద్రంలోని ప్రముఖ విద్యాసంస్థ 'హోలీ రోసరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా అత్యంత వైభవంగా, కన్నులపండువగా నిర్వహించారు. నిజానికి మరుసటి రోజు పండుగ కావడంతో ఆ రోజు పాఠశాలకు ప్రభుత్వ హాలిడే (సెలవు) ఉన్నందున, విద్యార్థులందరూ కలిసి పండుగను ఆనందించేలా ఒక రోజు ముందే ఈ సంబరాలను ఏర్పాటు చేశారు.ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ సునీల్ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణలు:
ఈ సందర్భంగా పాఠశాల చిన్నారి విద్యార్థిని, విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అలరించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, తలపై నెమలి పించాలు, చేతిలో

పిల్లనగ్రోవులతో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారుల రూపాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సంస్కృతిని చాటిచెప్పేలా వేడుకలు:
కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ సునీల్ మాట్లాడుతూ.. చదువుతో పాటు విద్యార్థులలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలపై గౌరవాన్ని, భక్తిభావాన్ని పెంపొందించడానికే ఇలాంటి పండుగలను పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండుగ రోజు సెలవు ఉన్నప్పటికీ, విద్యార్థులలో పండుగ వాతావరణం మిస్ కాకూడదనే ఉద్దేశంతోనే ఈ ముందస్తు వేడుకలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. చిన్నారులందరికీ ఆయన ముందస్తు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, కృష్ణుడి భక్తి గీతాలకు చేసిన నృత్యాలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల మరియు సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలి..

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.
- జల్ జీవన్ మిషన్ పనులనం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్రాగునీరు అందించాలి.
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత..

అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 03 ప్రజా వాణి అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం రాప్తాడు నియోజక వర్గంలో త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులపై ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ, అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో చేపట్టిన పనుల పురోగతి, ఎంతవరకు పనులు పూర్తయ్యాయి, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలి, తదితర అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు.ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా గ్రామాలకు త్రాగునీరు అందించాలన్నారు. జల జీవన్ పథకం కింద అనంతపురము రూరల్ మండలంలో సాయి పావని కంపెనీ 40 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు రూ.18 కోట్ల పనులు చేశారని, అందులో ఇప్పటివరకు 15 కోట్ల 50 లక్షల రూపాయల బిల్స్ ఇచ్చారని, 2 కోట్ల 50 లక్షలు బిల్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో ఇంకా 22 కోట్ల రూపాయల పనులు చేయాలన్నారు. ఆత్మకూరు మండలంలో సరస్వతి కంపెనీ 50 కోట్ల 43 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించగా, రూ.38 కోట్ల పనులు చేశారని, వారికి 34 కోట్ల బిల్స్ ఇచ్చారని, ఇంకా 12 కోట్ల 43 లక్షల రూపాయల పనులు చేయాలన్నారు. వారు ఆత్మకూరులో 10 గ్రామాలు, అనంతపురము రూరల్ పరిధిలో 4 గ్రామాలు, రాప్తాడులో 6 గ్రామాలలో పనులు చేస్తున్నారని, 50 శాతం పనులు చేసి మిగిలిన పనులు కాంట్రాక్టర్ పూర్తి చేయలేదన్నారు. సాయి పావని కాంట్రాక్టర్ వారు 31 గ్రామాలలో (కక్కలపల్లి కాలనీ, పాపంపేట, సజ్జల కాలువ, చిన్నంపల్లి, ఆలమూరు, కాటిగానికాలువ, రాచానపల్లి, ఎస్ కె యూనివర్సిటీ చుట్టూ గ్రామాలు వీటితో పాటు 19 గ్రామాలు) పనులు చేస్తున్నారని, ఇందులో 50 శాతం పనులు చేశారని, మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి సమస్యలు లేకుండా చిన్న చిన్న రిపేర్ ఏమైనా ఉంటే

వెంటనే పరిష్కరించి గ్రామాలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర మెయిన్ పైప్ లైన్ 600 మీటర్లు పెండింగ్ లో ఉందన్నారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర ఫిల్టర్ బెడ్స్ పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని, డ్యాం దగ్గర క్లియర్ వాటర్ సంపు నుండి ఆత్మకూరుకు పంపింగ్ చేసే మోటర్లు ఇప్పటివరకు ఆర్డర్ పెట్టలేదని, పి.నారాయణపురం, పి.యాలేరు మధ్య హెచ్.ఎన్.ఎస్.ఎస్ కెనాల్ బ్రిడ్జి పనులు పూర్తికాలేదని, 50 శాతం పనులు జరిగాయని, ఆత్మకూరు గ్రామంలో ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంక్ పనులు సంపు పనులు ఇంకా పూర్తి కాలేదని, పంపురూము మరియు మోటర్లు పనులు కూడా పూర్తి కాలేదని, పంపనూరు , చిన్నంపల్లి దగ్గర కట్టాల్సిన మినీ ట్యాంకుల పనులు కూడా పూర్తి కాలేదని, సత్యసాయి కార్మికులు జీతాలు రావట్లేదని, జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటి సరఫరా పనులు వేగవంతంగా చేపట్టినందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో విపత్కర పరిస్థితుల్లో జల్ జీవన్ మిషన్ పనులను రెండు నెలలలోగా వేగవంతంగా పూర్తి చేసి 30 గ్రామాలకు త్రాగునీరు అందించాలని ఆదేశించారు. మౌలిక వసతుల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా పంపింగ్ హౌస్ వద్ద 60

లక్షల రూపాయల అంచనా వ్యయంతో పంపింగ్ హౌస్ వద్ద కొత్త సాండ్ ఫిల్టర్లను అమర్చేందుకు చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించిన ఆర్డర్లను వెంటనే పూర్తి చేసి, రాబోయే 2 నెలల్లో పనులను చేపట్టాలనే లక్ష్యంగా పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. సబ్‌కాంట్రాక్టర్ ద్వారా కిర్లోస్కర్ కంపెనీ పంప్ సెట్ల కోసం ఆర్డర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, రాబోయే 3-4 రోజుల్లో పేమెంట్లు పూర్తి చేసి, అధికారికంగా ఆర్డర్ ఖరారు చేయాలన్నారు. సాండ్ ఫిల్టర్లు, పైప్‌లైన్ల డయామీటర్ పెంపు మరియు ఇతర సాంకేతిక మార్పులకు సంబంధించిన రివైజ్డ్ వర్కింగ్ ఎస్టిమేట్లకు వారంలోగా ఎస్ఈ / సీఈ స్థాయి అధికారుల నుండి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కురుగుంట సిండికేట్ నగర్ పరిధిలోని మిగిలి ఉన్న 350 మీటర్ల చొప్పున పైప్‌లైన్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇబ్బందులు ఏవైనా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున, పిఏఆర్‌బి డ్యామ్ నుండే మనకు ప్రధాన నీటి సరఫరా ఆధారపడి ఉందన్నారు. ప్రతినెల ఈ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజలకు త్రాగునీటి ఎద్దడి కలగకుండా ఈ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడమే ప్రాథమిక లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి పీఏబీఆర్ దగ్గర 2.5 ఎకరాల భూమి కావలసి ఉండగా, అందులో 75 సెంట్లు ఇవ్వడం జరగగా, ఇంకా 1.75 ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా, వెంటనే త్వరగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దానితో పాటు ఒడ్డుపల్లి సబ్ స్టేషన్ వెనుకాల పిపిటి కట్టేందుకు 10 సెంట్లు కావలసి ఉండగా వెంటనే ఇవ్వాలని రెవెన్యూ అధికారులని ఆదేశించారు.ఈసమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, రాప్తాడు డిఈ శ్రీధర్, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...!

- రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, కూసుమంచి మండలం కేశవాపురం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండున్నర ఏళ్లలో కేశవాపురం గ్రామానికి రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇందులో రూ. 40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ. 3.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లు, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు.పేద మహిళలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో

ఉచిత ప్రయాణ సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. నిరుపేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. మూడో విడత, నాల్గో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి అన్నారు.రైతును రాజు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత రెండున్నర ఏళ్లలో రైతు రుణమాఫీ, రైతు భరోసాతో కలిపి మొత్తం రూ. 1,76,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు.నిరుద్యోగ యువతకు భరోసానిస్తూ ఇప్పటివరకు 72,000 ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 11,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద రూ. 67,000 కోట్లు విడుదల చేశామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అక్కడక్కడా ఉన్న యురియా కొరత సమస్యను ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసివో గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, కేశవాపురం గ్రామ సర్పంచ్ బానోతు మమత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

22 A నిషేధిత భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యంపై బీఆర్ఎస్ నిరసన
- 22 A భూముల విముక్తి కోసం పోరాటం కొనసాగిస్తాం
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, ముఖ్యంగా 22-A నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉప్పల్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై 22-A భూముల సమస్యపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి తమ భూములపై హక్కులు ఉన్నప్పటికీ 22A నిషేధిత జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు, లావాదేవీలు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.22A నిషేధిత భూముల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ప్రజల సమస్యగా చూడాలని, అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ప్రజలు, రైతులు, భూ బాధితుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు MRO కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో దీ=నా పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్10 న హైద్రాబాద్ ఎల్. బి స్టేడియంలో జరిగే "మహాధర్నా"విజయవంతం చేద్దాం

● రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ రవీందర్ రెడ్డి

చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 3 సెప్టెంబర్ 10 సాయంత్రం 3 గంటలకు హైద్రాబాద్ ఎల్. బి స్టేడియంలో జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగ,పెన్షనర్ల జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ అందరూ సమిష్టిగా పాల్గొని మహాధర్నా విజయవంతం చేద్దామని చిన్నంబావి మండల కొప్పునూరు ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి గురువారం చిన్నంబావి మండల కేంద్రంలో కలసిన పాత్రికేయ మిత్రులతో అన్నారు. పిఆర్సి వెంటనే అమలు చేయాలని, పెండింగ్ ఆరు డిఏ లు వెంటనే విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగ,ఉపాధ్యాయుల బకాయిలు తక్షణమే చెల్లించాలని,అతిముఖ్యమైన హెల్త్ కార్డులను వెంటనే అమలుపరచాలనే డిమాండ్స్ తో చేపట్టిన మహాకార్యం "మహాధర్నా"ను విజయవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇవేమీ కొత్తగా కోరుతున్న గొంతెమ్మ కోరికలు ఏమి కాదు. ఉద్యోగ, పెన్షనర్లకి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సకాలంలో ఇవ్వవలసిన కనీస అవసరాలు మాత్రమే. ఎప్పుడు, ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఒకవైపు మాతో చెప్పడం, మరోవైపు ఫుట్ బాల్ మ్యాచ్ లకు, అందాల పోటీలకు, ఉచిత పథకాలకు ఇంకా అనేక వాటికి కోట్లు ఖర్చు చేస్తున్నారు. రాజకీయ పార్టీ ఏది అయితే ఏమి గానీ,వెంకయ్య నాయుడు ఈ విషయంలో ఒక విలువైన మాట – ఉచితాలకు నేను వ్యతిరేకం అని ఘంటాపథంగా చెప్పడం ప్రశంసనీయం. మన రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు సకాలంలో అందక, డబ్బులు లేక సరిఅయిన వైద్యం చేయించుకోలేక ఇప్పటివరకు 102 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారు. వరకట్నం ఇచ్చుకోలేక, ఎందరో ఆడపిల్లల పెళ్లిళ్లు కూడా చేయలేని పరిస్థితి ఒకవైపు, సొంత ఇళ్లు కట్టుకుందామన్న బకాయిలు సకాలంలో రాక కట్టుకోలేని పరిస్థితి మరోవైపు మనం చూస్తూనే ఉన్నాము. మన కోరికలన్నీ సకాలంలో తీరుతాయని ఏరీ, కోరి తెచ్చుకున్న ప్రభుత్వంలో ఏవీ కూడా నెరవేరడం లేదు. పరిస్థితి చూస్తుంటే, పెనం పైనుంచి పొయ్యిలోకి పడ్డ చందంగా తయారైంది. అందరం ఐక్యంగా మహాధర్నా కార్యక్రమానికి హాజరై అందరి వాణి వినిపిద్దాం. ప్రభుత్వ కళ్లు తెరిపిద్దాం . ఆప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ బకాయిలు అన్నీ చెల్లించి, ఇకముందు కూడా ఎప్పుడు ఇవ్వవలసినవి బకాయిలు అప్పుడు సకాలంలో మంజూరు చెస్తే అంతే చాలు. అంతవరకు కొత్త కోరికలు ఏమి కోరుకోము.

ఉన్నవి తీరిస్తే అంతేచాలు అన్నారు.
10 రోజు హైద్రాబాద్ లో జరిగే మహాధర్నాలో అందరం పాల్గొని ధర్నా విజయవంతం చేద్దామన్నారు.

మహబూబాబాద్ డీఈఓ ఏకైక పుత్రుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం.

● కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం.

కేసముద్రం సెప్టెంబర్ 03, ప్రజావాణి.ఆ ఇంట ఉన్నది ఒకే ఒక్క దీపం.. ఆ తల్లిదండ్రులకు ఆయనే సర్వస్వం.. ఎన్నో ఆశలతో, మరెన్నో ఆశయాలతో ఉన్నత చదువుల కోసం నగరానికి పంపిన ఆ కన్నవారి గుండెల్లో విధి కోలుకోలేని దెబ్బ కొట్టింది. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సత్యనారాయణమూర్తి ఏకైక కుమారుడు వేద్ (21) హైదరాబాద్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త విన్న కన్నవారు, బంధువులు షాక్‌కు గురై కన్నీరుమున్నీరవుతున్నారు.
కనుపాప దూరమై.. కన్నీటి సముద్రమై..
బుధవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదం సత్యనారాయణమూర్తి కుటుంబంలో ఎప్పటికీ పూడ్చలేని చీకట్లను నింపింది. ముద్దుల కొడుకు భవిష్యత్తును ఎంతో అందంగా తీర్చిదిద్దాలని కలలు కన్న ఆ తల్లిదండ్రులకు, కుమారుడి మరణవార్త పిడుగుపాటులా తగిలింది. ఒక్కగానొక్క కొడుకు ఇక లేడనే నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. వారి రోదనలు చూసి అక్కడికి చేరిన ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి.
కదిలిపోయిన విద్యాశాఖ..
వేద్ అకాల మరణం పట్ల మహబూబాబాద్ జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఇస్లావత్ లచ్చిరాం నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు.విద్యాశాఖలో అందరికీ మార్గదర్శిగా ఉండే సత్యనారాయణమూర్తి కి ఇంతటి పెద్ద కష్టం రావడం అత్యంత బాధాకరం. ఆ దేవుడు కూడా ఇంత కఠినంగా ఎలా ప్రవర్తించాడో అర్థం కావడం లేదుఅంటూ కన్నీటిపర్యంతమయ్యారు. జిల్లాలోని ఉపాధ్యాయ లోకం, విద్యాశాఖ అధికారులు సత్యనారాయణమూర్తి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పుట్టెడు దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ఆ కన్నవారికి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నారు.

రేబర్తిలో "అందే శ్రీ" విగ్రహ గద్దె నిర్మాణంలో వివాదం

● మద్దూరు పోలీసులు రంగ ప్రవేశం
● ఇరువర్గాలకు నచ్చజెప్పినా పోలీసులు

మద్దూరు సెప్టెంబర్3, ప్రజా వాణి.దివంగత పద్మశ్రీ అవార్డు గ్రహీత అందే శ్రీ విగ్రహ గద్దె నిర్మాణంలో వివాదం తలెత్తింది. మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన అందే శ్రీ కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా గ్రామానికి చెందిన కొందరు నాయకులు అందే శ్రీ చిరకాల జ్ఞాపకార్థం కోసం రేబర్తి గ్రామ బస్ స్టాండ్ ముందు గద్దె నిర్మాణం చేపట్టడంతో ఓ వర్గానికి చెందిన కొంత మంది అనుమతి లేకుండా ఇక్కడ గద్దె నిర్మాణం చేపట్టవద్దని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో సమాచారం తెలుసుకున్న మద్దూరు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పి అధికారుల అనుమతి తీసుకున్న తర్వాతనే ఎటువంటి ఘర్షణలు లేకుండా శాంతి యుతంగా గద్దె నిర్మాణం చేపట్టాలని ఇరువర్గాలకు సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ ద్వార అనుమతి తీసుకొని గద్దె నిర్మాణం చేపడతామనడంతో వివాదం సద్దుమణిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిరాటి

శ్రీనివాస్,ఉప సర్పంచ్ రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుల్లూరి రాజు,ఎస్సై మహమ్మద్ ఆసీఫ్, ఏ ఎస్సైలు కనకయ్య, తిరుమల బాబు, గ్రామ పెద్దలు, యూత్ నాయకులు,గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శ్రీ రామా నగర్ కాలనీలో షెడ్ ప్రారంభించిన

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ఉప్పల్ నియోజకవర్గం లోని కాప్రా శ్రీ రామా నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన షెడ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు.కాలనీ వాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన ఈ షెడ్‌ను కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ఎ+ఖ మూర్తి, లక్ష్మి నారాయణ, సతీష్ రెడ్డి శ్రీ రామా నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి. పెంటారెడ్డి, జనరల్ సెక్రటరీ టి. జగ్గా రెడ్డి, ఉపాధ్యక్షులు జి. నవీన్ గౌడ్, ఎన్. బాలునాయక్, జాయింట్ సెక్రటరీలు వి. విష్ణువర్ధన్ రావు, కె. కృష్ణ మోహన్, ట్రెజరర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.షెడ్ నిర్మాణానికి సహకరించిన దాతలు పొలేపల్లి భారతి, కొండల రావులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత శిక్షణను ప్రారంభించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి స్థానిక రామకృష్ణ ఫంక్షన్ హాల్లో మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన యువత ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశయంతో పీఎస్ఆర్ ట్రస్ట్, రైట్ చాయిస్ అకాడమీ ల ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కుటుంబాల్లో కనిపించే ఆనందం, వారు చూపే కృతజ్ఞత వర్ణించలేనిదని పేర్కొన్నారు. గతంలో సెలెక్ట్ అయిన అభ్యర్థులతో కలిసి భోజనం చేసిన క్షణాలు తన జీవితంలో అత్యంత మధురమైన జ్ఞాపకాలని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు సాధించిన తర్వాత, మీ వద్దకు సహాయం కోసం వచ్చే పేదలను, బాధితులను మనుషుల్లా గౌరవించి, ప్రేమ ఆప్యాయతలతో న్యాయం చేయాలన్నారు.కష్టపడకుండా ఏదీ రాదని, ఒకవేళ అయాచితంగా లభించినా అది శాశ్వతంగా నిలవదని మంత్రి అన్నారు. మన సొంత కష్టంతో సాధించిన విజయమే మనకు నిజమైన తృప్తిని, శాశ్వత స్థానాన్ని ఇస్తుందని తెలిపారు. అధికారాలు, పదవులు శాశ్వతం కావని, జీవితంలో పదవులు, డబ్బు ఎప్పుడూ ఒకేలా ఉండవని, జీవితం ఒడుదుడుకులతో కూడుకున్నదన్నారు. ఉచిత శిక్షణకు సుమారు 2,200 నుండి 2,300 మంది నమోదు చేసుకున్నారని, అందులో 1,500 మంది రోజూ క్రమం తప్పకుండా వచ్చే వారుంటారని, అభ్యర్థులందరికీ మంచి ఫ్యాకల్టీతో పాఠాలు, నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన వసతి కూడా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు.రాబోయే 60 రోజుల కాలాన్ని అభ్యర్థులు క్రమశిక్షణతో ఉపయోగించుకుని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని ఆకాంక్షిస్తూ, అందరికీ ఆల్ ది బెస్ట్" అని మంత్రి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితంలో అనుకున్న లక్ష్యాలను, పోటీ పరీక్షల్లో విజయం సాధించడంలో సబ్జెక్ట్ పరిజ్ఞానంతో పాటు సరైన మానసిక దృక్పథం అత్యంత కీలకమైనదని అన్నారు. విద్యార్థుల విజయంలో 90% పాత్ర వారి మైండ్‌సెట్‌పైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. సబ్జెక్టు నేర్పించడానికి నిపుణులు,

పుస్తకాలు, టెస్ట్ సిరీస్‌లు అందుబాటులో ఉంటాయని, కానీ మనసులో గెలుపుపై నమ్మకం పెంచుకోవడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. మనం అనుకున్న కల ను సాధించి గమ్యాన్ని చేరుకోవడానికి రెండు కీలక గుణాలు అవసరం.
ఆత్మవిశ్వాసం, పట్టుదల అవసరమని అన్నారు. నాకు ఇంగ్లీష్ రాదు, తెలుగు మీడియంలో చదివాను, పేదరికంలో పుట్టాను వంటి ఆలోచనలను పక్కన పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు డీసీపీ రామానుజం, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పొకబతిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్ బిగుల్లమోహన్

బెజ్జంకి, సెప్టెంబర్ (ప్రజావాణి)సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ బిగుల్ల మోహన్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, పాఠశాలలోని వసతులు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చూడటం అందరి బాధ్యత అని సర్పంచ్ మోహన్ అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినీత్ గౌడ్, వార్డు సభ్యులు మంకాళి మోహన్, కోరుకొప్పుల రంజిత్, వేదిరే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు 420 హామీల తో ప్రజలు ను మోసం చేసిన రేవంత్ రెడ్డి

● మాజీ మంత్రి మేడ్చెల్ ఎం ఎల్ ఏ సి ఎచ్ మల్లా రెడ్డి

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపణ కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నిరసన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు చేశారు.మల్లారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్లి ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 77 సార్లు ఢిల్లీకి వెళ్లారని మల్లారెడ్డి పేర్కొన్నారు. 22ఏ అంశంతో రాష్ట్రంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రస్తుత ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అందుకే మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఛైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, brs పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,సాయినాథ్, ప్రభాకర్ రెడ్డి,brs పార్టీ మండలం మున్సిపాలిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, శ్రీధర్, తిరుపతి రెడ్డి,మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్లు మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి.. డీ-9 కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలి

● బెజ్జంకిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా

బెజ్జంకి, సెప్టెంబర్ 3(ప్రజావాణి)రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం బెజ్జంకి మండల కేంద్రంలో రైతు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని నాయకులు ఆరోపించారు.డీ-9 కాలువకు తక్షణమే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని, యూరియా కొరతను నివారించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతు బీమా అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సాగునీటి సమస్యను పరిష్కరించి రైతు బీమాను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్ గుప్తా, ముక్కిస తిరుపతిరెడ్డి, కచ్చు రాజయ్య, ఎల శేఖర్ బాబు, ఉప సర్పంచులు దుమాల మహేష్, యాలాల పరుశురాం, చింతలపల్లి సంజీవరెడ్డి, చెరుకూరి నరసయ్య, కొరివి తిరుపతి ముదిరాజ్, శేఖర్, తిరుపతి, మహేష్, పరశురాములు, అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు లేనిదే రాజ్యం లేదు

- రైతు సంక్షేమమే బి.ఆర్.ఎస్ పార్టీ ధ్యేయం.
- రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ సవితి తల్లి ప్రేమ చూపుతుంది.
- రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పతనం కాయం.
- బి ఆర్.ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు.
- ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి .

ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):- రైతు లేనిదే రాజ్యం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందని బి.ఆర్.ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం గోవిందరావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీ పాల్గొన్నారు. గోవిందరావుపేటలోని తహసిల్దార్ కార్యాలయం నుంచి ఎద్దుల బండ్ల తో మొదలైన ర్యాలీ గోవిందరావుపేట శివారులోని ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో లక్ష్మీ నరసింహారావు, నాగజ్యోతి మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ రైతుల సంక్షేమ ధ్యేయంగా రెండు గోపాలుగా పాలన అందించిందని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయమని అన్నారు. ముఖ్యంగా ములుగు నియోజకవర్గంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, స్థానిక మంత్రి తక్షణమే స్పందించాలని డిమాండ్ వారు డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలకు పరిష్కారం చూపకుండా సభలు, సమావేశాలు, ఉపన్యాసాల పేరుతో కాలయాపన చేస్తూ, ప్రతి సమస్యకూ గత ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని వారు ఆరోపించారు.

లక్నవరం సమస్యపై హామీ ఏమైంది?

ములుగు ప్రాంత రైతాంగానికి లక్నవరం జలాశయం అత్యంత కీలకమైన సాగునీటి వనరని,దాని కింద ఉన్న పంట పొలాలకు అవసరమైన సమయంలో నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో లక్నవరం సమస్యను పదే పదే ప్రస్తావించిన మంత్రి సీతక్క నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత దాని పరిష్కారానికై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు.మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్నవరం నీటిని జంపన్నవాగుతో అనుసంధానం చేసేందుకు రూ.36 కోట్లతో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని,ఆ హామీ అమలుపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తోందని అన్నారు.రైతుకు ప్రాజెక్టుల పేర్లు, హామీలు కాకుండా పంట కాలంలో పొలానికి చేరే నీరే ముఖ్యమని ,అందువల్ల లక్నవరం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

పంట నష్టపరిహారంపై లెక్కలు చెప్పాలి

2024లో కురిసిన వడగండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించారని, ములుగు ప్రాంతానికి సంబంధించి రూ.5.75 కోట్ల నిధులు విడుదలయ్యాయని వారు తెలిపారు.అయితే ఆ నిధులు రైతులకు చేరకుండా ఏక్కడికి చేరాయనే విషయాలను ప్రభుత్వం, మంత్రి సీతక్క ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

రైతు పేరుతో విడుదలైన నిధుల విషయంలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు భరోసా విషయంలో స్పష్టత ఎక్కడ..?

ఎన్నికల సమయంలో రైతు పెట్టుబడి సాయాన్ని పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని వారు గుర్తుచేశారు. హామీకి అనుగుణంగా రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదని వారు విమర్శించారు.

వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడి సాయం రైతుకు ఎంతో కీలకమని అన్నారు.విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం ఆలస్యం కావడం చిన్న, సన్నకారు రైతులపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతుందని వారు పేర్కొన్నారు.అందువల్ల రైతు భరోసా అమలుపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించి, అర్హులైన రైతులందరికీ సమయానికి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర ఎక్కడ..?

రైతు పంట పండించడం మాత్రమే కాకుండా దానిని సరైన ధరకు విక్రయించగలిగినప్పుడే వ్యవసాయం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని వారు పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు సమయంలో గిట్టుబాటు ధర లభించకపోవడం, ప్రకటించిన బోనస్ కూడా సమయానికి అందకపోవడం రైతులకు నష్టాన్ని కలిగిస్తోందని వారు విమర్శించారు.

ప్రకటనలకే పరిమితం కాకుండా బోనస్ ఎప్పుడు చెల్లిస్తారని,అర్హులైన రైతులు ఎంతమంది, ఎంత మొత్తం విడుదల చేశారనే వివరాలను సైతం ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.

సమ్మక్క బ్యారేజ్, దేవాదుల నీటిని వినియోగించాలి

ములుగు జిల్లాలో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గతంలో చేపట్టిన దేవాదుల, సమ్మక్క బ్యారేజ్ వంటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వారు సూచించారు. సమ్మక్క బ్యారేజ్ ద్వారా నీటిని నిల్వ చేసి ములుగు జిల్లాలోని వివిధ మండలాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ఆ వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు.

ఇక్కడ రాజకీయ విమర్శల కంటే.. ముఖ్యమైనది ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ఎంతవరకు వినియోగిస్తున్నారన్నదే ముఖ్యమని అన్నారు.ఎంత ఆయకట్టుకు నీరు అందుతోంది, ఇంకా ఎంత భూమికి నీరు అందించాల్సి ఉంది, అందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి అనే వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

పోడు భూముల సమస్యకు పరిష్కారం కావాలి

ములుగు జిల్లాలో పోడు భూముల సమస్య ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. భూమిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు హక్కుల విషయంలో స్పష్టత కల్పించడం అత్యవసరమని అన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.పట్టాల సమస్య పరిష్కారమైతే రైతులకు భూమిపై చట్టబద్ధమైన హక్కుతో పాటు వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సాయం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం మెరుగుపడుతుందని అన్నారు . ఈ అంశాన్ని రాజకీయ ప్రకటనలకు పరిమితం చేయకుండా స్పష్టమైన విధానంతో పరిష్కరించాలని వారు కోరారు.

గత ప్రభుత్వాన్ని విమర్శించడం పాలనకు ప్రత్యామ్నాయం కాదు

ప్రస్తుత ప్రభుత్వం ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్ని బాధ్యుడిగా చూపడం వల్ల సమస్యలు పరిష్కారం కావని వారు విమర్శించారు.గత ప్రభుత్వంలో తప్పులు జరిగి ఉంటే వాటిపై విచారణ జరిపించడం ప్రభుత్వ హక్కు. అయితే అదే సమయంలో ప్రస్తుత పాలనపై ప్రజలకు జవాబుదారీతనం గా ఉండాలని వారు అన్నారు.గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం ఒక రాజకీయ వాదన కావచ్చని,కానీ ప్రస్తుత సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలో ఇప్పటికీ గత పాలననే ప్రధాన రాజకీయ అంశంగా చేసుకోవడం కంటే, తమ ప్రభుత్వం సాధించిన ఫలితాలపై ప్రజలకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు.

ములుగు రైతాంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు పరస్పరం అనుసంధానమైనవేనని, సాగునీరు లేకపోతే పంట నష్టపోతారని అన్నారు . పంట పండినా సరైన ధర లేకపోతే ఆదాయం తగ్గుతుందని,ప్రకృతి వైపరీత్యం వస్తే పరిహారం ఆలస్యం అయితే అప్పులు పెరుగుతాయని ఆరోపించారు. భూమిపై హక్కు లేకపోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం కష్టమవుతుందని అన్నారు.కాబట్టి రైతు సమస్యలను విడివిడిగా కాకుండా నీరు--పెట్టుబడి--పంట ధర--పరిహారం--భూ హక్కులు అనే సమగ్ర వ్యవసాయ విధానంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను గల్లి గల్లికి ఎండబెడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గోవింద నాయక్, మల్క రమేష్,భూక్యా జంపన్న,లకవత్ నరసింహ,సుడి శ్రీనివాస్ రెడ్డి,లకావత్ చందులాల్,తాటికొండ శ్రీనివాసాచార్యులు,గజ్జి ఎలేందర్,పెన్నిటి మధుసూదన్ రెడ్డి, అక్కనపల్లి రమేష్, మెర్దుల వెంకన్న, వర్ధన్ చందర్, చర్ల పాండు, ప్రవీణ్ గౌడ్,బి శీను,శ్యామ వెంకట్ రెడ్డి,ఎడవెల్లి వెంకటరెడ్డి, నామ పూర్ణచందర్, అజ్మీర సురేష్, మాలోత్ గాంధీ,పోరిక కిరణ్, కుమార్ లావుడియా ,రామచందర్ సరూప,లకావత్ మమత, చందులాల్,సమ్మక్క,ధరావత్ రాకేష్,చిలుకూరి రాజ్ కుమార్, కత్తుల సారయ్య, నామాల మురళి, వాసం శివాజీ ,ఏకుల ధనుంజయ, సూడి సతీష్,బొజ్జ నరేందర్, సొరపాక లక్ష్మీనారాయణ, జల్లెల కొమురయ్య, చల్లూరి రామకృష్ణ, గుమ్మడి ప్రసాద్,బత్తుల రాణి, రుద్రాపు రాజశేఖర్, సమ్మయ్య, పూలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా వంటా వార్పు

- ఎం ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా వంటా వార్పు మహిళలకు నెలకు 2,500, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ రేపు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించాలి ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేయాలి.హామీలు అమలు చేయాలి ప్రజలకు న్యాయం చేయాలి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముత్యాలమ్మ తల్లి నూతన విగ్రహాలకు జలాభిషేకం

చిలుకూరు సెప్టెంబర్ 03 (ప్రజావాణి): నారాయణపురం, పాలేఅన్నారం గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లి నూతన విగ్రహాల వద్ద భక్తిశ్రద్ధలతో జలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ప్రతి ఇంటి నుంచి జలబిందెలతో నీటిని తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిళలు జలబిందెలతో పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బీజేపీ గిరిజన మోర్చా పాలసీ అండ్ రీసెర్చ్ కన్వీనర్‌గా బట్టు ఠాకూర్ నాయక్

చిలుకూరు సెప్టెంబర్3(ప్రజావాణి):: భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు సంక్రు నాయక్ ఆధ్వర్యంలో చిలుకూరు మండలం జానకీనగర్ గ్రామానికి చెందిన బట్టు ఠాకూర్ నాయక్‌ను బీజేపీ సూర్యాపేట జిల్లా గిరిజన మోర్చా పాలసీ అండ్ రీసెర్చ్ కన్వీనర్‌గా నియమించారు.ఈ సందర్భంగా బట్టు ఠాకూర్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తన శ్రమను గుర్తించి అప్పగించిన బాధ్యతను పార్టీ పిలుపు మేరకు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.బట్టు ఠాకూర్ నాయక్‌కు పదవి లభించడంపై భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, జానకీనగర్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

మంథని సబ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు వీరే

- ప్రకటించిన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్ రాజ్ ఠాకూర్

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 3, ప్రజావాణి:టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ అనుమతితో గురువారం పెద్దపల్లి జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన మండల అధ్యక్షుల పేర్లను పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ ప్రకటించారు.పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నూతన కమిటీ ముందుండాలని ఆశించారు. ఈ నియామకం తక్షణం అమల్లోకి వస్తుంది. మండల అధ్యక్షుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.మంథని నియోజకవర్గం మంథని ఐలి ప్రసాద్,మంథని ముత్తారం దొడ్ల బాలాజి, రామగిరి తుమ్మసారం గౌడ్,కమాన్‌పూర్ సయ్యద్ అన్వర్‌ల నియామకం జరిగినట్టు ప్రకటించారు.

వెయ్యి రోజుల పాలనలో అద్భుతాలు సృష్టించాం

- ప్రజా సంక్షేమం--అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు-కత్తి రమేష్

బెజ్జంకి, సెప్టెంబర్ (ప్రజావాణి) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలన చారిత్రక మైలురాయిగా నిలిచిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎడ్లబండి చౌరస్తా వరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కత్తి రమేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు బీమా, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని నాయకులు తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, వెయ్యి రోజుల్లో 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, అలాగే ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై గ్రామాలకు వెళ్లి చర్చించేందుకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులు సవాల్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రావుల సందీప్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోరుతూ బీఆర్ఎస్ భారీ ర్యాలీ

- 22ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలని డిమాండ్

ముదిగొండ, సెప్టెంబర్ 3 ప్రజావాణి ప్రతినిధి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముదిగొండ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. వెంకటాపురం గ్రామం నుంచి ప్రారంభమైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. 22ఏ నిషేధిత జాబితాలో రైతుల భూములు ఉండటంతో రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు తదితర అంశాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. రైతుల భూములకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అర్హత ఉన్న భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదేవిధంగా వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతో పాటు రైతు బీమా తదితర పథకాలను అర్హులైన రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని డిమాండ్ చేశారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో నాయకులు రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న రైతుల భూముల సమస్యలను పరిశీలించి, అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి వారికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో లిమాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మండల రైతు కన్వీనర్ పోట్ల వెంకటప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు వాచ్చేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ మండల కార్యదర్శి గడ్డ వెంకటగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బంక మల్లయ్య, బత్తుల వెంకట్రావు, మందారపు ఎర్రంకన్నా, కొమ్మూరి రమేష్ స్వాతి మాజీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తోట ధర్మ, కోడె బాబు ఏలూరి రమేష్ పచ్చ సీతారామయ్య గుంటూరు పద్మనాభం ఊటుకూరి వీరయ్య వడ్డెల్లి కిరణ్ కోటి అనంత రాములు పాము సిలవరాజు ఎస్.కె ఖాజా,సామినేని నాగేశ్వరరావు చెరుకుపల్లి బిక్షం మల్లెల శంకర్ మేడ ఎల్లారావు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నూతన సీఐ శ్రీనివాస్‌ను కలిసిన రైతు రక్షణ సమితి ప్రతినిధులు

- రైతు రక్షణ సమితి హనుమకొండ,ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్

ఎల్కతుర్తి ప్రజావాణి న్యూస్:-హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సర్కిల్‌కు నూతనంగా వచ్చిన సీఐ శ్రీనివాస్‌ను రైతు రక్షణ సమితి హనుమకొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సీఐ శ్రీనివాస్ స్పందిస్తూ రైతులకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి కలిసి వివరించాలని, చట్టపరంగా సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారు సుకినే సుధాకర్ రావు, మండల అధ్యక్షుడు కొక్కు తిరుపతి,ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ కె పరిమితమైన కే సి ఆర్ రాజీనామా చేయాలి

● కాంగ్రెస్ నాయకులు డిమాండ్

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ కే పరిమితమైన ప్రతిపక్ష నేత కేసిఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సైనిక్పురి జ్యోతిరావు పూలే జంక్షన్ నుండి ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్ దా బి ఆర్ అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన కాప్రా, ఏఎస్ రావు నగర్, వంపుగూడ డివిజన్ల కాంగ్రెస్ నాయకులు.బాధ్యతను విస్మరించిన కేసీఆర్ రాజీనామా చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపు మేరకు ఈరోజు మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ పర్యవేక్షణలో కాప్రా, ఏఎస్ రావు నగర్, వంపుగూడ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు శ్రీహరి కేశెట్టి ప్రసాద్ ల ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ– సుభిక్షంగా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, అవినీతి, స్వార్థ రాజకీయనేతగా ప్రజల చేత తిరస్కరించబడిన కేసీఆర్, వెయ్యి రోజులు గడుస్తున్నా అసెంబ్లీకి రాకుండా సిగ్గుగా ఎమ్మెల్యే ప్రతిపక్ష నేతగా ప్రభుత్వ జీతభత్యాలు పొందుతూ ఫామ్ హౌస్ కే పరిమితం కావడం సిగ్గుచేటు అన్నారు. నియంతృత్వ వైఖరి దొర పెత్తనానికి కాలం చెల్లిందని, చేతనైతే అసెంబ్లీకి రావాలన్నారు లేదా రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగి ఆరు నెలలు సమాచారం లేకుండా ఉద్యోగానికి రాకుంటే అతని ఉద్యోగం పోతుంది మరి రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ వేతనం పొందుతూ అసెంబ్లీకి రాని కేసీఆర్ ను అనర్హుడిగా ఎమ్మెల్యే పదవి నుండి తొలగించాలన్నారు.కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు శ్రీహరి మాట్లాడుతూ భా రా స అధినేత–ప్రతిపక్ష నేత కేసీఆర్ ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రభుత్వ సేవలు పొందుతూ అసెంబ్లీకి రాకపోవడం రాజ్యాంగాన్ని–ప్రజా స్వామ్యాన్ని అగౌరవపరచడమేనన్నారు.తెలంగాణ ఉద్యమకారులు,

విద్యార్థులు, యువకుల బలిదానాలతో సాధించిన తెలంగాణ రాష్ట్రానికి దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా, ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తా, ప్రతి దళితకుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తా అని అబద్ధపు వాగ్దానాలతో రెండుసార్లు ముఖ్యమంత్రి పదవి అనుభవించి, నీచ స్వార్థ అవినీతి రాజకీయాలతో అధికారం కోల్పోయి, అధికారం ఇస్తేనే ప్రజల మధ్య ఉంటా లేకుంటే ఫామ్ హౌస్ లో పంటా అన్న రీతిలో రాష్ట్ర ప్రజలకు ముఖం చాటేసిన కెసిఆర్ తక్షణమే రాజీనామా చేయాలని యావత్ తెలంగాణ ప్రజానీకం కోరుకుంటున్నారన్నారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ– ప్రతిపక్షనేత హోదా అనుభవిస్తూ అసెంబ్లీకి రాని కేసీఆర్, ప్రతిపక్ష నాయకుని పదవికి అనర్హుడు అని, ఒక్కరోజు కూడా ప్రజల కోసం అసెంబ్లీకి వచ్చి ఒక్క గంట సమయం ఇవ్వలేని వ్యక్తి నాయకుడు ఎలాఅవుతాడని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలన్నారు. తెలంగాణ ప్రజలకు చేసిన అన్యాయానికి ముఖం చూపించ లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకోవాలన్నారు. కేసీఆర్ రాజీనామా చేయాలనీరాష్ట్ర ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలనిబి, కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేస్తూ, ఫ్లెకార్డులతో మోటార్ సైకిల్ ర్యాలీ చేశారు ఈ కార్యక్రమం లో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ సెక్రటరీలు దండ్ల మురళీ పాకాల రాజు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూర్ణయాదవ్ మాజీ డైరెక్టర్ శ్రీ కొబ్బనూరి నాగరాజు ఉమ్మడి కాప్రా డివిజన్ మాజీ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు ఏ ఎస్ రావ్ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు కొత్త అంజిరెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి పవన్ కుమార్, శ్రీధర్ రెడ్డి, నరేందర్ గౌడ్, జి సత్యనారాయణ, రాకేష్ యాదవ్, డి సతీష్ యాదవ్, తోటకూర శ్రీకాంత్, కే రాజు, సి సత్యనారాయణ, రిజ్వాన్ ఖాన్, అబ్దుల్ అహ్మద్, ప్రదీప్,నాగరాజు యాదవ్,అభిరాజ్,సతీష్ యాదవ్,రాజశేలన్, జీవవజ్రుఅ, శివ కుమార్, సిద్దిక్, నర్సింగ్ రావ్, నర్సింహా, ఉమేష్, చోటు భాయ్, అల్లురయ్య, సాహెబ్, శ్రీనివాస్, మాహిళా నాయకురాలు స్వర్ణలత, లలిత గార్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు బెవర మనోజ్ కుమార్, ఆకుల సంతోష్, పవన్ కళ్యాణ్, వేణు, విజయ్, యస్వంత్, దయాకర్, బాలుగౌడ్, ఇమ్రాన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి

● స్టైల్స్ ది స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
● విద్యతో పాటు విలువలను నేర్పడమే లక్ష్యం: షబానా గోహర్
● పిల్లల సమగ్ర అభివృద్ధికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం: రఫీ గోహర్

ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్ 03(మన సమగ్ర ప్రజావాణి):ఆర్మూర్ పట్టణంలోని స్టైల్స్ ది స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం కృష్ణుడు, రాధ, రుక్మిణి వేషధారణలో వచ్చిన చిన్నారులతో సందడిగా మారింది. విద్యార్థులు వివిధ వేషధారణలతో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడి జీవిత విశేషాలు, బోధనలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.పాఠశాల కరస్పాండెంట్, సెక్రటరీ, ప్రిన్సిపాల్ షబానా గోహర్ మాట్లాడుతూ, జన్మాష్టమి వంటి పండుగలను పాఠశాలలో నిర్వహించడం ద్వారా చిన్నారులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను చిన్ననాటి నుంచే పరిచయం చేయవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.పాఠశాల డైరెక్టర్ రఫీ గోహర్ మాట్లాడుతూ, విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను విద్యార్థులకు అందించడం పాఠశాల ప్రధాన లక్ష్యమన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారుల వేషధారణలు, వారి ఉత్సాహం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం సెప్టెంబర్ 10న దీక్ష

● ఆర్జీ వన్ జీఎం కార్యాలయం ఎదుట నిరసన..
● తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ పిలుపు.

గోదావరిఖని, మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 3కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10న ఆర్జీ వన్ జీఎం కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆర్జీ వన్,ఆర్జీ టు లోని వివిధ విభాగాలు,ఓసీపీ త్రి ఫేస్ టూ వి 9 ఓబీ కంపెనీ తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి దీక్షకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ....
హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు వేతనాలు,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.2013లో జరిగిన ఒప్పందం ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు

అమలు చేయాల్సి ఉన్నప్పటికీ సింగరేణిలో మాత్రం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న వేతన విధానం సింగరేణిలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.కాంట్రాక్టు కార్మికులకు సరిపడా వేతనాలు అందక పోవడంతో పిల్లల చదువులు,కుటుంబ పోషణ భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు.పండుగలు, సెలవులు లేకుండా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను సింగరేణి యాజమాన్యం,ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం నిర్వహించనున్న దీక్షకు పార్టీలకు అతీతంగా అన్ని కార్మిక సంఘాల నాయకులు,కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మద్దెల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని ఆయన కోరారు.

కళ్లేపల్లి గ్రామ అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం

బెజ్జంకి, సెప్టెంబర్ 3 (ప్రజావాణి) సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని కళ్లేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రోటీన్ గుడ్లను పంపిణీ చేశారు.విద్యాభివృద్ధితో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇలాంటి కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిగుల్ల మోహన్, ఉపసర్పంచ్ వినిత్ గౌడ్, వార్డు సభ్యులు మంకాల మోహన్, వేదిరే సతీష్, అంగన్‌వాడీ టీచర్ భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూకట్పల్లి కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారిని గోపికలా ముస్తాబు చేయడం తల్లిదండ్రులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది.

కూకట్పల్లి విలేజ్ (ప్రజావాణి) సెప్టెంబర్ 3 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారిని గోపికలా ముస్తాబు చేయడం ఎంతో ఆనందాన్ని, ప్రత్యేకతను ఇస్తుంది.శాస్త్రాల ప్రకారం చిన్నపిల్లలు నిష్కల్మషమైన మనస్కులు, వారిలో సాక్షాత్తు పరమాత్మ నివసిస్తాడు.అందువల్లే కృష్ణాష్టమి రోజున చిన్నారులను గోపికలు లేదా కృష్ణ వేషధారణలో అలంకరిస్తారు.

యూత్ ప్రెసిడెంట్ ఉంగరాల క్రాంతి కుమార్ (చింటు) పుట్టినరోజు శుభాకాంక్షలు

కూకట్పల్లి విలేజ్ : (ప్రజావాణి) సెప్టెంబర్ 3 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.కూకట్పల్లి: యూత్ ప్రెసిడెంట్ మరియు అయ్యప్ప మొబైల్స్ అండ్ ప్రింటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చింటు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు అందజేయడం జరిగింది.చింటు వ్యక్తిగత మరియు వృత్తిగత రంగాల్లో విశేష ప్రతిభ చూపిస్తూ, యువతలో మంచి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, మరియు సంఘటనలో పాల్గొన్నవారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

1000 రోజుల పాలనపై కాంగ్రెస్ సంబరాలు

ప్రజావాణి,ఇనుగుర్తి:సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000రోజులు పూర్తి కావడంతో ఆ పార్టీ శ్రేణులు మండల కేంద్రం ఇనుగుర్తిలో గురువారం బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నాయి.
పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ డిసిసి ఉమా మురళి నాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో సంబంధిత సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ కు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగతి భవన్ ఇనుప గేట్లను బద్దలు కొట్టి ప్రజా పాలనకు నాంది పలికారు అన్నారు. ఇక వెను తిరగకుండా సంక్షేమ పథకాలు అభివృద్ధికి శ్రీకారం చుట్టారని చెప్పారు. సమర్థవంతమైన పాలనను చూసి బిఆర్ఎస్,బిజెపి ఓర్వలేక దుష్ప్రచారానికి దిగుతున్నాయని విమర్శించారు.
ఫ్రీ బస్సు,సన్న బియ్యం ఘనత కాంగ్రెస్ దే..

అంతకుమునుపు సర్పంచులు,నేతలు తమ్మడపల్లి కుమార్, దిశ సభ్యులు గుజ్జునూరి బాబురావు,సీనియర్ నేతలు రావుల మల్లేశం,ముదిరెడ్డి కళావతి శ్రీనివాస్ రెడ్డి,కొట్టం మహేందర్ ప్రభృతులు మాట్లాడుతూ మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం,రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ,గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరి, ఆరోగ్యశ్రీ 10 లక్షల కు పెంపు వంటి పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులకు 5 లక్షలు మంజూరు చేసి కొత్త చరిత్ర సృష్టిస్తున్నదన్నారు. రైతుల ఇబ్బందులను తొలగించేందుకు భూభారతి తీసుకు వస్తున్నదన్నారు. ఇటీవల నారాయణపురంలో రైతులకు పట్టాలు ఇచ్చి ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించిందని గుర్తు చేశారు.కార్యక్రమంలో సర్పంచులు మీటు నాయక్, చెడుపాక సుజాత యాకయ్య, భూక్య చిన్ని వెంకన్న, భూక్య లక్ష్మీ వెంకన్న,కాంగ్రెస్ పార్టీ జిల్లా,బ్లాక్,మండల,గ్రామ నాయకులు గంజి రాజేందర్ రెడ్డి,కాలేరు శివాజీ, మలిశెట్టి శ్యామ్,బ్లాక్, ఇస్లావత్ చందు నాయక్,దేవులపల్లి వెంకన్న, మామిడి జనార్థన్, నారాయణ,కొట్టం మహేందర్ రెడ్డి,బానోతు వీరన్న నాయక్,బాలు నాయక్, మంగ్య వెంకన్న,బాలు,సూర్య నాయక్,సారయ్య పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మెషిన్ పథకం

● బీసీ నిరుద్యోగ మహిళలకు అవకాశం
● దరఖాస్తులకు సెప్టెంబర్ 15 చివరి తేదీ

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 3, ప్రజావాణి: బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మెషిన్ పథకం'కు సంబంధించి మంథని ఎంపీడీవో కార్యాలయం అర్హత ప్రమాణాలను వెల్లడించింది. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళ బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగి అయి ఉండాలి. అత్యంత పేదలు, నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు తప్పనిసరి. అవి లేని వారు ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు మించకూడదు. దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. ఆధార్ లేదా ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరి కాగా, నివాస ధ్రువీకరణకు ఆధార్ కార్డు సమర్పించాలి.ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారు. కుట్టు వృత్తిలో నైపుణ్యం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కనీసం ప్రాథమిక అక్షరాస్యత ఉండటం ఉత్తమమని, దరఖాస్తులు అధికంగా వచ్చిన సందర్భంలో 5వ తరగతి ఉత్తీర్ణులకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని అధికారులు తెలిపారు. అలాగే మేరా/మేరు కమ్యూనిటీకి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.దరఖాస్తు విధానం అర్హులైన మహిళలు tgobmms వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, అవసరమైన పత్రాలను మంథనిలోని ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలి.దరఖాస్తుల చివరి తేదీ: 15-09-2026.అర్హత ఉన్న మహిళలు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

గాయత్రి కళాశాల విద్యార్థులకు ఐపిపిబి ఇంటర్నిషప్ సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 3: స్థానిక గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) ఆధ్వర్యంలో ఇంటర్నిషప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ ఐపిపిబి మేనేజర్ రాజేష్, కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ఐపిపిబి మేనేజర్ శ్రీనివాస్, పోస్టుమెన్ అనూష తదితరులు హాజరై విద్యార్థులకు ఇంటర్నిషప్ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇంటర్నిషప్ ద్వారా విద్యార్థులు పొందిన జ్ఞానం, అనుభవాన్ని భవిష్యత్తులో తమ కెరీర్ అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం అందించడంలో ఇలాంటి ఇంటర్నిషప్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.
విద్యార్థులకు విలువైన అనుభవాన్ని అందించిన ఐపిపిబి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టా భూమిలో డ్రైనేజీ పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

● ముందస్తు నోటీసులు లేకుండానే పనులు చేపట్టారని బాధితుల ఆరోపణ

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 3: తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు జారీ చేయకుండానే తమ పట్టా వ్యవసాయ భూమిలో మున్సిపల్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారని ఆరోపిస్తూ బాధితులు నీలారపు సతీష్, నీలారపు మురళి గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 1110/1, 1110/2లో తమకు పట్టా వ్యవసాయ భూమి ఉందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూమి పట్టా భూమి అయినప్పటికీ మున్సిపల్ శాఖ అధికారులు ఎలాంటి చట్టబద్ధమైన నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండానే డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారని ఆరోపించారు. వ్యవసాయ భూమిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం వల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన చట్టపరమైన ప్రక్రియను చేపట్టకుండా, నష్టపరిహారం కూడా చెల్లించకుండానే పనులు నిర్వహించడం సరికాదని తెలిపారు. తమ కుటుంబానికి చెందిన పట్టా భూమిలో అక్రమంగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, తమ భూమి హక్కులను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. డ్రైనేజీ నిర్మాణ పనులపై విచారణ జరిపి, న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని నీలారపు సతీష్, నీలారపు మురళి విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యకు న్యాయమైన పరిష్కారం చూపాలని వారు కోరారు.

ప్రజల సమస్యలను విస్మరించిన కే సి ఆర్ కు ప్రతిపక్ష నేతగా కొనసాగే నైతిక హక్కు లేదు

● ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ప్రజల సమస్యలను విస్మరించిన కేసీఆర్‌కు ప్రతిపక్ష నేతగా కొనసాగే నైతిక హక్కు లేదు మందుముల పరమేశ్వర్ రెడ్డి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నాచారం సర్కిల్‌లో బైక్ ర్యాలీలు, నిరసనలు ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలి నెమలి అనిల్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నాచారం సర్కిల్ పరిధిలోని నాచారం, HMT కాలనీ, మల్లాపూర్, మీర్పేట్ HB కాలనీ, శక్తిసాయి నగర్ డివిజన్లలో బైక్ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.ప్రధాన ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాల్సిన కేసీఆర్ సభకు హాజరుకాకుండా తన బాధ్యతలను విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రజల పక్షాన నిలబడలేని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాచారం సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అలాగే ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేపాల్ వరద బాధితులకు లయన్స్ ఫౌండేషన్ రూ.1.89 కోట్ల విరాళం

● సేవా కార్యక్రమాల్లో భాగస్వాములుగా ఉండటం గర్వకారణం.

● లయన్ డా.శరణ్య మారుతి యాదవ్.

రామగిరి,మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 03నేపాల్‌లో ఇటీవల సంభవించిన వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రూ.1.89 కోట్ల 2 లక్షల అమెరికన్ డాలర్లు విరాళం అందజేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ అధ్యక్షురాలు లయన్ డా. శరణ్య మారుతి యాదవ్ అన్నారు.వరదల కారణంగా నేపాల్‌లో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అత్యవసర సహాయం, పునరావాస చర్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఉపయోగ పడతాయని ఆమె తెలిపారు.ప్రపంచంలో ఎక్కడ విపత్తు సంభవించినా మానవతా దృక్పథంతో స్పందిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్న లయన్స్ సంస్థలో సభ్యులుగా కొనసాగుతూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములుగా ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు.సేవ, సహాయం,మానవత్వమే లయన్స్ సంస్థ ప్రధాన లక్ష్యాలని తెలిపారు.విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి మానవతా బాధ్యత అని ఆమె అన్నారు.లయన్స్ సంస్థ మార్గదర్శకత్వంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ కూడా సభ్యుల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి తన వంతు సహకారం అందిస్తుందని డా.శరణ్య మారుతి యాదవ్ తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి గట్టుప్పల్ కలురామ్ ఘుర్కా విద్యాదాయని విద్యాలయం పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా తదితర వేషధారణలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు ఉట్లు కొట్టడంతో పాటు చక్కటి నృత్యాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినం విశిష్టత, శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన విలువలను విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రమేష్ వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో, వివిధ వేషధారణలతో పాల్గొనడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎం. రమేష్ పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై భగ్గుమన్న ప్రజాగ్రహం

● పొట్ట నరేందర్ యాదవ్ నాయకత్వంలో భారీ నిరసన ర్యాలీ -- రచ్చబండకు పోటెత్తిన ప్రజలు

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 03(మన సమగ్ర ప్రజావాణి):-తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయం,నెరవేరని హామీలు,ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. శేరిలింగంపల్లి గ్రామం కేంద్రంగా నిర్వహించిన ర్యాలీ,రచ్చబండ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.శేరిలింగంపల్లి గ్రామం నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ తారానగర్, హుడా ట్రేడ్ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా కొనసాగింది.బీఆర్ఎస్ జెండాలు, నినాదాలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి.ప్రజలు,యువత, మహిళలు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పొట్ట నరేందర్ యాదవ్ మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు.ప్రజల సమస్యలకు సమాధానం చెప్పకుండా 1000 రోజుల విజయోత్సవాల పేరుతో ప్రచారం చేసుకోవడం కాదు ప్రజల మధ్యకు వచ్చి వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి"అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,మహిళలు,యువత,స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజల భారీ స్పందనతో ర్యాలీ,రచ్చబండ కార్యక్రమం విజయవంతమైందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

వెయ్యి రోజుల ప్రజాపాలన పేదింట విరిసింది సంక్షేమ దీపారాధన

మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 03(ప్రజా వాణి) ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించి, సంక్షేమాన్ని విస్తరించి,సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ, రైతులు,మహిళలు, యువతకు భరోసా కల్పించి భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు నిర్మించడంలో వెయ్యి రోజుల పాలన చరిత్రలో కొత్త అధ్యాయాన్ని నమోదు చేసిందని గార్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్,మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతీ హతీరామ్ నాయక్ అన్నారు.అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య ఆదేశానుసారం గురువారం మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ విగ్రహ కూడలిలో 1000 రోజుల ప్రజాపాలన సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలు,ఆశయాలు, ఆత్మగౌరవాన్ని పాలనకు కేంద్ర బిందువుగా చేసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేస్తుందని తెలిపారు.వెయ్యి రోజుల ప్రజాపాలనలో వెయ్యి రోజులు కేవలం క్యాలెండర్లో గడిచిన రోజులు కావు రాష్ట్ర భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసిన కాలం అన్నారు. రు.25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రెండు లక్షల రుణమాఫీ చేసి రుణ విముక్తి కల్పించారని తెలిపారు. రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్,ఉచిత విద్యుత్,రైతు బీమా పథకాలను ప్రజలకు చేర వేసిందన్నారు. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కిందన్నారు.ప్రజా ప్రభుత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ ఉచిత సన్నబియ్యం,రేషన్ కార్డులు,స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాలపై ఆలోచన చేస్తూ చర్చ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు,సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు గంగావత్ రాంసింగ్ నాయక్,సర్పంచ్ లు భూక్య రామ్ సింగ్,మోతిలాల్, సిద్దబోయిన వెంకట్రావు, వీర్య నాయక్,వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంషాద్ బేగం,కట్టా శ్రీనివాస్, యాకుబ్ పాషా,కత్తుల ప్రశాంత్,కోలా కుమార్ గౌడ్,అజ్మీర బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుంది : ఎమ్మెల్యే జీఎస్సార్..

ప్రజావాణి శాయంపేట ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలను కేంద్రబిందువుగా చేసుకుని సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు సూత్రాలతో ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి కొత్త దిశను నిర్దేశించిందన్నారు. గత వెయ్యి రోజుల కాలంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేసి లక్షలాది మంది రైతులను రుణభారం నుంచి విముక్తులను చేసిందన్నారు. రైతు భరోసా, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతు బీమా వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అండగా నిలిచిందని, వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానానికి చేరుకోవడం ప్రభుత్వ విజయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మి, మహిళా సంఘాలకు భారీ స్థాయిలో బ్యాంకు లింకేజీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే కొత్త రేషన్ కార్డులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం పంపిణీ ద్వారా ఆహార భద్రతను బలోపేతం చేసిందన్నారు.విద్యారంగంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం, ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు వంటి చర్యలు ప్రభుత్వ విద్యకు కొత్త ఊపునిచ్చాయని తెలిపారు. ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి అన్నారు ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే జీఎస్సార్ తీవ్ర విమర్శలు చేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని, రైతులు మరియు ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో రాష్ట్ర సంపదను దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు. మొత్తంగా వెయ్యి రోజుల ప్రజాపాలన తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు తీసుకెళ్తోందని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలి

● వ్యవసాయ విధ్వంసంపై బీఆర్ఎస్ రైతు సదస్సును విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపు

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 3 వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా రైతు సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో వ్యవసాయ విధ్వంసంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, ధాన్యం కొనుగోళ్లను సకాలంలో చేపట్టాలని, రైతు బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రైతులకు బోనస్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై మనోహర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రకటించిన గ్యారంటీలు మాటలకే పరిమితమయ్యాయని, వాటి అమలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రానున్న రెండున్నర సంవత్సరాలు ప్రజల్లోనే ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. గ్రామగ్రామాన పర్యటిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు.వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సమావేశానికి పెద్దపల్లి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రైతు సదస్సు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని మనోహర్‌రెడ్డి కోరారు.ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు మార్క లక్ష్మణ్, రాజ్‌కుమార్, మాజీ ఎం పి పి ముత్యాల రాజయ్య సతీష్, అంజన్న, కసిపాక వాసు బొంకురి నిఖిల్ పల్లె మధు వెన్నం రవీందర్, శ్రీధర్, సదయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుల కోవెలలో.. మురిసిన నల్లనయ్య!

- ఎస్.వి.వి. స్కూల్‌లో కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు.
- మూడు దశాబ్దాల విద్యా వారసత్వంలో మరో మైలురాయి.
- చిన్నారుల ప్రతిభను వెలికితీసిన ఉపాధ్యాయులకు అభినందనల జల్లు.
- వేషధారణతో మంత్రముగ్ధులను చేసిన బుడిబుడి అడుగుల రాధాకృష్ణులు.

కేసముద్రం, సెప్టెంబర్ 3, ప్రజావాణి.

ఆ చిన్నారుల బుడిబుడి అడుగులు నడకల నల్లనయ్యను తలపించాయి. వారి ముద్దుముద్దు మాటలు మురళీకృష్ణుడి గానాన్ని వినిపించాయి.కేసముద్రం మండల కేంద్రంలో విద్యా ప్రమాణాలకు మారుపేరుగా నిలిచిన ప్రముఖ విద్యాసంస్థ శ్రీ వివేకానంద స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణం ఎంతో సంతోషంగా మారిపోయింది. చిన్నారులు వేసిన కృష్ణుడు, రాధల వేషధారణలు, వారి ప్రదర్శనలు తల్లిదండ్రులను, స్కూల్ యాజమాన్యాన్ని ఎంతో సంతోషపరిచాయి.

అక్షర సేద్యంలో అగ్రగామి.. ఎస్.వి.వి. చరిత్ర.!

కేసముద్రం ప్రాంతంలో ఎస్.వి.వి. స్కూల్‌కు ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉంది. దశాబ్దాలుగా ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ఈ సంస్థ సొంతం. కేవలం పుస్తకాల్లోని చదువుకే పరిమితం కాకుండా, విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికితీయడం ఈ స్కూల్ ప్రత్యేకత. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పిల్లలకు నేర్పిస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎస్.వి.వి. స్కూల్ తన మూడు దశాబ్దాల విద్యా వారసత్వాన్ని ఘనంగా చాటుకుంటోంది.

గురువుల కృషి.. శిష్యుల ప్రతిభ!

ఈ వేడుకల్లో చిన్నారుల ప్రదర్శన వెనుక ఉపాధ్యాయుల శ్రమ స్పష్టంగా కనిపించింది. ప్రతి చిన్నారిలోని ప్రతిభను గుర్తించి, వారి శైలికి తగ్గట్టుగా వేషధారణలను అమర్చి, కృష్ణలీలల ఘట్టాలను వేదికపై అద్భుతంగా ప్రదర్శించేలా చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రతి ఒక్కరూ మెచ్చుకున్నారు. గురువుల శిక్షణతో చిన్నారులు వేదికపై చేసిన నృత్యాలు, ప్రదర్శించిన హావభావాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తమ పిల్లలలోని ఇంతటి ప్రతిభను బయటకు తీసినందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంస్కృతి, సాంప్రదాయాలే విద్యకు పునాది.. ప్రిన్సిపాల్ ఉమాకర్.

ఎస్.వి.వి. స్కూల్ ఎల్లప్పుడూ విద్యతో పాటు సంస్కారానికి, సాంప్రదాయాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుంది. నేటి ఆధునిక కాలంలో పిల్లలకు మన పండుగల విశిష్టతను తెలియజేయడమే ఈ వేడుక ముఖ్య ఉద్దేశం. చిన్నారులు కృష్ణుడు, రాధల వేషధారణలో అద్భుతంగా రాణించారు. పిల్లలను ఇంత చక్కగా తీర్చిదిద్దిన మా ఉపాధ్యాయ బృందం కృషి నిజంగా అభినందనీయం.ప్రతి విద్యార్థిలోని సృజనాత్మకతను వెలికితీయడమే మా లక్ష్యం. మాపై నమ్మకంతో పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు,తెలిపారు.చేతిలో పిల్లనగ్రోవి,తలపై నెమలి పింఛం,పట్టువస్త్రాల అలంకరణతో సాక్షాత్తు ఆ శ్రీకృష్ణ పరమాత్ముడే భువికి దిగివచ్చినట్లుగా ఉన్న తమ పిల్లలను చూసుకుని తల్లిదండ్రులు మురిసిపోయారు. కార్పొరేట్ స్థాయి వసతులతో పాటు, నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం వల్లే ఈ ప్రాంతంలో ఎస్.వి.వి. స్కూల్ అగ్రగామిగా నిలిచిందని స్థానికులు కొనియాడారు.సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే ఘట్టంతో వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్

- డి.ఎస్ లోకేశ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (03 సెప్టెంబర్ 26): ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శిగా డి.ఎస్. లోకేశ్ కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు) రాజీవ్ గాంధీ హనుమంతు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ లోని ఐడిఓసికి గురువారం చేరుకున్నారు. వీరిని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సాదరంగా ఆహ్వానించి, మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. అనంతరం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో జరుగుతున్న భూ – సర్వే,సాదా బైనామా, రెవిన్యూ సదస్సులు, తదితర అంశాలపై అధికారులతో ఐడిఓసిలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రివ్యూ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ రీ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు సలహాలు, సూచనలు అందించారు.ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ దివాకర్, భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలి:

- 15వ వార్డు కౌన్సిలర్ పెంజర్ల రాకేష్

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దపల్లి పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ పెంజర్ల రాకేష్ పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 15వ వార్డులో ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్ పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ చెట్లు మనకు స్వచ్ఛమైన గాలిని అందించడమే కాకుండా వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.“ఒక్కొక్కరు ఒక మొక్క నాటి, దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చు. చెట్లు నాటడం మాత్రమే కాదు, వాటిని పెంచి సంరక్షించడం కూడా మనందరి బాధ్యత” అని పేర్కొన్నారు.ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు సురేష్, అరవింద్, ఆర్‌పీ రజిత, నర్సరీ సిబ్బంది సునీత, యశోదతో పాటు వార్డు ప్రజలు రాజు, సురేందర్, మణిదీప్, మహేష్, మనోజ్, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

షాపూర్ నగర్ లో పాలి క్లినిక్ ఏర్పాట్లను పరిశీలించిన

- మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా వైద్యాధికారి డా ఆనంద్

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) పాలిక్లినిక్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ ,శాపూర్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి వైద్య సేవలపై సమీక్ష.పట్టణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను వారి సమీపంలోనే అందించాలనే ఉద్దేశంతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను దశలవారీగా పాలిక్లినిక్‌లుగా అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ శాపూర్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాలిక్లినిక్ ఏర్పాట్ల పురోగతిని, అందుబాటులోకి రానున్న ప్రత్యేక వైద్య సేవలను, ప్రజలకు సేవలు అందించే విధానాన్ని పరిశీలించారు.పాలిక్లినిక్‌లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను వారంలో నిర్ణీత రోజుల్లో ఔట్‌పేషెంట్ సేవల రూపంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని డా. ఆనంద్ తెలిపారు.ఆయా ప్రాంతాల జనాభా, భౌగోళిక పరిస్థితులు, వైద్య సేవల అవసరాలను పరిగణనలోకి తీసుకుని పాలిక్లినిక్‌లను గుర్తించడం, ప్రత్యేక వైద్య సేవల రకాలు, సేవల సమయాలు, వారానికి ఎన్ని రోజులు సేవలు అందించాలి, అవసరమైన సందర్భాల్లో ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫరల్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు.

అలాగే శాపూర్‌నగర్ UPHCలో పెండింగ్‌లో ఉన్న సివిల్ రిపేర్స్, రీనోవేషన్ చిన్నపాటి మరమ్మతు పనుల స్థితిని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, అన్ని విభాగాలు సక్రమంగా పనిచేసేలా, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాలిక్లినిక్‌ను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర కార్యాలయం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పాలిక్లినిక్‌కు సంబంధించిన యూనిఫామ్ బ్రాండింగ్, కలర్ కోడింగ్ పూర్తిగా అమలు చేయాలని సూచించారు.అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్‌ను సమకూర్చడంతో పాటు వాటి సరఫరా, ఏర్పాటు, వినియోగానికి సిద్ధంగా ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించాలని తెలిపారు.

అనంతరం UPHCలో టీబీ కార్యక్రమం అమలును కూడా డా. ఆనంద్ సమీక్షించారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు అందించాల్సిన నిక్షయ్ పోషన్ యోజన , డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం అర్హులైన టీబీ రోగుల చెల్లుబాటయ్యే బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ వివరాల సేకరణ, ధృవీకరణ జిల్లా కార్యాలయానికి సమర్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వివరాల లోపాల కారణంగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం ఆలస్యం కాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అదేవిధంగా ఎచ్ఇవి కేసుల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించి, సంబంధిత రోగులకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందేలా చూడాలని తెలిపారు.

ఆసుపత్రిలో అడ్మిట్ అయిన గర్భిణీ కేసును స్వయంగా పరిశీలించి, అందుతున్న వైద్య సేవలు, రోగి పరిస్థితి మరియు అవసరమైన వైద్య సహాయంపై సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసి, అవసరమైన ప్రత్యేక వైద్య సేవలను కూడా సమీపంలోనే అందించేందుకు పాలిక్లినిక్‌ల అభివృద్ధి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డా. కె. ఆనంద్ అధికారులకు సూచించారు.

విప్లవ జ్వాల ఎప్పటికీ ఆరిపోదు

- ఎల్లంకి వీరన్న మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు
- జంపాల వెంకన్న సిపిఐ మండల కార్యదర్శి

మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 03(ప్రజా వాణి) సీపీఐ సీనియర్ నాయకులు, ఉద్యమ సహచరులు అమరుడు ఎల్లంకి వీరన్న మరణం సిపిఐ పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి, వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని సీపీఐ గార్ల మండల కార్యదర్శి జంపాల వెంకన్న అన్నారు.ఎల్లంకి వీరన్న సంస్మరణ సభ ముల్కనూర్ గ్రామంలో శాఖ కార్యదర్శి శివ అధ్యక్షతన గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముల్కనూర్ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమంలో ఎల్లంకి వీరన్న పాత్ర మరువలేనిదని అన్నారు.సీపీఐ పార్టీని బలోపేతం చేయడంలో ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఒకవైపు తన వృత్తి బాధ్యతలను కొనసాగిస్తూనే, మరోవైపు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు.గ్రామీణ పేదలు,కూలీలు,రైతులు, కార్మికుల సమస్యలపై ఆయన ఎల్లప్పుడూ స్పందించేవారని అన్నారు.ములకనూరు గ్రామంలో ఆ రోజుల్లో ఉన్న పెత్తందారీ వ్యవస్థను,సామాజిక అసమానతలను ఎదురిస్తూ ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యవంతులను చేయడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ప్రజల్లో హక్కుల పట్ల అవగాహన కల్పిస్తూ,అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడే ధైర్యాన్ని కల్పించారని అన్నారు.కష్టకాలంలో కూడా పార్టీ జెండాను వీడకుండా, ప్రజలతో, ప్రజల మధ్య, ప్రజల పక్షాన నిలబడి పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడు ఎల్లంకి వీరన్న అని కొనియాడారు.పార్టీ కార్యకర్తలకు ఆయన చూపిన మార్గం, ఉద్యమ పట్ల ఆయనకున్న నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.వీరన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఆయన కుటుంబ సభ్యులకు సీపీఐ గార్ల మండల సమితి తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుంది భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జంపాల విశ్వ, ముల్కనూరు సర్పంచ్ సిద్ధ బోయిన వెంకట్రావ్, బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు,తెలంగాణ జనసమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు, సిపిఐ మండల నాయకులు మాగం లోకేష్, బండి శంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు అందనాల రాజీవ్, మద్దివంచ మాజీ ఉపసర్పంచ్ లావుడ్య భీముడు,ధారావత్ వీరన్న, సోమయ్య,జంపన్న,తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహాలలో తప్పనిసరి ఇంకుడు గుంతల నిర్మాణం

- సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు.

రామగిరి,మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 03 ఇందిరమ్మ గృహ నిర్మాణ చేసుకునే ప్రతి లబ్ధిదారుల ఇంటిలో ఇంకుడు గుంత తప్పనిసరని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో గురువారం ఇందిరమ్మ గృహాలలో ఇంకుడు గుంతల నిర్మాణంకు ఆమె శ్రీకారం చుట్టారు.గ్రామంలో సుమారు 112 ఇందిరమ్మ గృహాల నిర్మాణం జరుగుతున్నాయని ఆమె తెలిపారు.ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ.6,500 చెల్లిస్తారని ఆమె తెలిపారు. ఇంకుడు గుంత నిర్మాణం ద్వారా ఇంటిలోని వృధా నీరంతా ఇంకుడు గుంతలకి చేరుతుందని తెలిపారు. దీని ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.మన గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు మనము కృషి చేసినవారమవుతామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్,కార్యదర్శి గంగుల సంతోష్,ఫీల్డ్ అసిస్టెంట్ సందెవేన జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి పండుగ రోజున మీ ఇంటి చిన్నారిని ముద్దుల గోపిక (రాధమ్మ) లా అలంకరించడం ఒక అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది.

కూకట్పల్లి విలేజ్ :(ప్రజావాణి) సెప్టెంబర్ 3 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులను శ్రీకృష్ణుడు మరియు గోపికల వేషధారణలో అలంకరించి మురిసిపోవడం మన సంప్రదాయంలో ఒక ప్రత్యేకత.కృష్ణాష్టమి వేడుకలు – గోపిక వేషధారణ విశేషాలుఅలంకరణ: కృష్ణాష్టమి పండుగ సందర్భంగా తల్లిదండ్రులు తమ చిన్నారి పాపలను గోపికలా ముద్దుగా అలంకరిస్తారు.కావలసిన వస్తువులు: లంగా వోణి లేదా ప్రత్యేక గోపిక డ్రెస్సులు, జడ, జడ కోప్పు, గాజులు, ముత్యాల దండలు మరియు కాలి గజ్జెలు ఉపయోగిస్తారు.పాఠశాలలు, వేడుకలు: ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేశారు. వారి ఆకట్టుకునే వేషధారణలు పలువురిని ఆకర్షించాయి. సాంస్కృతిక ప్రాధాన్యత: కృష్ణాష్టమి రోజున ఇంట్లోని చిన్నపిల్లలకు శ్రీకృష్ణుడి లేదా గోపికల వేషధారణ వేసి పూజలో కూర్చోబెట్టడం ఆనవాయితీ. శాస్త్రాల ప్రకారం చిన్నపిల్లలు నిష్కల్మషమైన మనస్కులు, వారిలో సాక్షాత్తు పరమాత్మ నివసిస్తాడు. గోపికల వేషధారణ: ఆడపిల్లలను శ్రీకృష్ణుడిని అమితంగా ప్రేమించిన గోపికలు మరియు రాధికలా అలంకరిస్తారు. ఇది భక్తి భావానికి, పవిత్రతకు ప్రతీక.ఇంట్లో సాక్షాత్కారం: చిన్నారులను అలా అలంకరించడం వల్ల ఆ శ్రీకృష్ణ పరమాత్మే స్వయంగా తమ ఇంటికి బాలగోపాలుడిగా వచ్చాడనే ఆనందాన్ని భక్తులు అనుభవిస్తారు.అనన్య భక్తికి ప్రతీక:ద్వాపర యుగంలో గోపికల భక్తి సాధారణమైనది కాదు. అది “మధుర భక్తి”. భగవంతుడిని తమ సర్వస్వంగా భావించి, నిష్కల్మషమైన ప్రేమను కురిపించారు. చిన్నారి గోపిక వేషధారణ ఆ పవిత్రమైన, నిస్వార్థమైన భక్తి భావనను స్మరింపజేస్తుంది.లక్ష్మీ స్వరూపం:హిందూ సంప్రదాయంలో ఆడపిల్లలను సాక్షాత్తు లక్ష్మీదేవి రూపంగా భావిస్తారు. కృష్ణాష్టమి నాడు ఆ లక్ష్మీ స్వరూపాన్ని గోపికగా అలంకరించి పూజించడం వల్ల ఆ ఇల్లు అష్టైశ్వర్యాలతో, సంతోషాలతో విరాజిల్లుతుందని నమ్ముతారు.రాధా–కృష్ణ తత్వం:గోపికలలో అగ్రగణ్యురాలు రాధాదేవి. రాధా–కృష్ణుల బంధం జీవాత్మ–పరమాత్మల అనుసంధానానికి ప్రతీక. చిన్నారిని గోపికగా అలంకరించినప్పుడు,ఆ ఇంట రాధాకృష్ణుల కొలువై ఉన్నారనే అనుభూతి కలుగుతుంది.గృహంలో మంగళప్రదం:చిన్నారి గోపిక తన చిరునవ్వులు, ముప్పాల సవ్వడితో ఇల్లంతా తిరుగుతుంటే, ఆ ఇల్లు బృందావనంగా మారుతుంది. ఇది ఇంట్లోని ప్రతికూల శక్తులను దూరం చేసి, సానుకూల శక్తిని నింపుతుంది.సంస్కృతిని నేర్పడం:పిల్లలకు చిన్నతనం నుంచే మన పురాణాలు, సాంప్రదాయాల పట్ల గౌరవం పెంచడానికి ఈ వేడుకలు తోడ్పడతాయి. లంగా–ఓణి లేదా ఘాగ్రా చోళీ ధరించి, చేతికి గాజులు, తలలో పూలు పెట్టుకుని ముస్తాబైన చిన్నారి భరతీయ సంస్కృతికి జీవన రూపంలా కనిపిస్తుంది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా అన్వర్.

కమాన్ పూర్,మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 03కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సయ్యద్ సయీద్ అన్వర్ ను నియమించినట్లు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వెల్లడించారు. అన్వర్ మండల అధ్యక్షునిగా రెండోసారి పగ్గాలను చేపట్టారు.కాగా అన్వర్ గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.ప్రస్తుతం పార్టీ బలోపేతం కి కృషి చేస్తూ మంత్రి శ్రీధర్ బాబు కు అండగా ఉంటున్నాడు. తనకు పదవి మళ్ళీ రావడానికి కారకులైన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు,పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శీను బాబుకు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.అన్వర్ నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్,అంబిరి శ్రీనివాస్,ఏం సి డైరెక్టర్ రఫీక్,మల్యాల మహేష్, కిషన్ రెడ్డి,పంజా సాయిరాం గౌడ్,సయ్యద్ ఇక్బాల్, ఇనగంటి చిన్నారావు,పిల్లి శేఖర్,చాట్ల రాయమల్లు, బూస శ్రీనివాస్,మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు మేహరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో గోపిక వేషధారణలో ఉన్న చిన్నారి (బాల గోపిక) విశిష్టత ఎంతో పవిత్రమైనది. కృష్ణాష్టమి నాడు మగపిల్లలను శ్రీకృష్ణుడిలా, ఆడపిల్లలను గోపికల్లా అలంకరించడం మన సాంప్రదాయం.

కూకట్పల్లి విలేజ్: (ప్రజావాణి) సెప్టెంబర్ 3 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.శ్రీకృష్ణాష్టమి పర్వదినాన ఇళ్లలో చిన్నారి ఆడపిల్లలను గోపికలుగా అలంకరించడం వెనుక ఎంతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది.ఆడపిల్లలైతే కృష్ణుని ఆరాధించే గోపికల్లాగా, కృష్ణుడికి ప్రియమైన రాధికలాగా చక్కని వేషధారణతో కనువిందు చేస్తారు. గోపికల వలె చిన్నారులను ముద్దుగా అలంకరించడం ద్వారా ఆ బృందావన వాతావరణాన్ని ఇళ్లలో పునఃసృష్టిస్తారు.భక్తి భావన: ఇంట్లో బుడిబుడి నడకలతో తిరిగే చిన్నారులను కృష్ణుడు, గోపికలుగా చూడటం ద్వారా ఆ శ్రీకృష్ణ పరమాత్మే స్వయంగా తమ ఇంట అడుగుపెట్టాడనే దివ్యమైన అనుభూతి కలుగుతుంది.

మహా ధర్నాకు తరలిన జాలపల్లి బి ఆర్ ఎస్ నాయకులు

- విజయవంతం చేసిన నాయకులకు కృతజ్ఞతలు
- ధూళిమిట్ట బి ఆర్ ఎస్ మండల నాయకులు చొప్పరి సాగర్

మద్దూరు సెప్టెంబర్3, ప్రజా వాణి.చేర్యాల మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ 1000ఏండ్ల పాలనను ఎండగట్టేందుకు చేపట్టిన మహా ధర్నాకు బి ఆర్ ఎస్ మండల నాయకులు చొప్పరి సాగర్ ఆధ్వర్యంలో మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహా ధర్నాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్‌లో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణుడు ధర్మరక్షకుడు.. గీతా సందేశం నేటికీ మానవాళికి మార్గదర్శకం: డాక్టర్ వి. నరేందర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, భైంసా, సెప్టెంబర్ 3:భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థుల వేషధారణలు, ఉట్టి వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దశావతారాల్లో శ్రీకృష్ణుడు ధర్మరక్షకుడిగా నిలిచారని తెలిపారు. శ్రీకృష్ణుని జీవితం ప్రేమ, ఆప్యాయత, ధర్మానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీమద్భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన సందేశాలు నేటికీ సమాజానికి, యువతకు మార్గదర్శకంగా ఉన్నాయని అన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన కార్యక్రమం విద్యార్థుల్లో భక్తిభావంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేశారు.

మహిళా రైతు కూలీలతో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా.మెతుకు ఆనంద్ "మాటా- ముచ్చట

ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా, సెప్టెంబర్03 :పొలంలో పని చేస్తున్న మోమిన్పేట్ మండలం,కేసారం గ్రామ మహిళా రైతు కూలీలతో మాజీ ఎమ్మెల్యే డా.మెతుకు ఆనంద్ మాటా-ముచ్చట కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇబ్బందులు పడుతున్నామని తమ గోడు వెళ్లబోసుకున్న మహిళా రైతులు,కూలీలు.రైతులకు రైతు బంధు లేదు,రుణమాఫీ లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేసిన రైతులు.కేసీఆర్ దేవుని లాంటి మనిషి కేసీఆర్ ఉన్నప్పుడు అందర్నీ మంచిగ చూసుకున్నాడు అని వెల్లడించిన రైతు కూలీలు.ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే(స్పీకర్)మాకు ఎవరో తెలియదు అన్న రైతులు కాంగ్రెస్ వాళ్ళు ఎలెక్షన్ సమయంలో మాత్రమే వస్తారన్న రైతులు.కాంగ్రెస్ వాళ్ళు మళ్ళీ ఓటు ఆడిగేందుకు ఎం మొఖం పెట్టుకొని వస్తారో మేం చూస్తాం అంటు ఆగ్రహం వ్యక్తం చేసిన రైతు కూలీలు..

ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తమ భవిష్యత్తుపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు.
గురువారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలను ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి, అల్పాహారానికి ముందు నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని, వారితో కలిసి అల్పాహారం చేశారు.
ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, వసతిగృహ జీవితం విద్యార్థుల్లో ఐక్యత, పరస్పర సహకారం, కలిసిమెలిసి ఉండే తత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. భయం, బిడియాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు దోహదపడుతుందన్నారు. తోటి విద్యార్థినులు అనారోగ్యానికి గురైనా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా పరస్పరం ధైర్యం చెప్పుకుంటూ అండగా నిలవాలని సూచించారు. మారుమూల అటవీ గ్రామాలు, గూడాలు, తండాల నుంచి వచ్చిన విద్యార్థినులు తాము నేర్చుకున్న విజ్ఞానాన్ని కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలియజేయాలన్నారు. సెలవుల్లో గ్రామాలకు వెళ్లినప్పుడు పాఠ్యాంశాల్లో నేర్చుకున్న విషయాలను స్థానిక పరిస్థితులతో అన్వయించుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తూ

మూఢనమ్మకాలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. తమ చదువు గ్రామానికి ఉపయోగపడేలా విద్యార్థినులు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు.చరవాణిని చదువుకు ఉపయోగపడే విషయాలను తెలుసుకోవడానికి, సాధారణ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వినియోగించుకోవాలన్నారు. పుస్తకాన్ని మంచి మిత్రునిగా భావించి, ఎక్కడికి వెళ్లినా వెంట ఉంచుకోవాలని, ప్రయాణంలోనూ తీరిక సమయాల్లోనూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలనే ఆశతో వసతిగృహాల్లో చేర్పిస్తున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చేలా చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. తాను కూడా నాలుగో తరగతి నుంచి ములుగులోని బాలికల వసతిగృహంలోనే చదువుకున్నానని గుర్తుచేశారు. విద్యార్థి దశలో ఎదురయ్యే ఆకర్షణలకు లోనుకాకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌కు తెలియజేయాలని సూచించారు.వసతిగృహంలో ఎవరికైనా జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ప్రిన్సిపాల్, వార్డెన్ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులను నేరుగా ఇళ్లకు పంపించకుండా, తల్లిదండ్రులకు సమాచారం అందించి, వారి సమన్వయంతో ఆసుపత్రిలో అవసరమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే తల్లిదండ్రులకు వైద్య సేవలు ఎక్కడ పొందాలో మార్గనిర్దేశం చేయాలని, విద్యార్థినులు పూర్తిగా కోలుకునే వరకు వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.అనంతరం హెచ్ఎంటిసి స్థలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించనున్న ఐటిడిఏ భవనానికి కేటాయించిన స్థలాన్ని మంత్రి అనసూయ సీతక్క, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, గిరిజన సంక్షేమ శాఖ డిడి జనార్దన్, కళాశాల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు స్వనిధి పథకంతో ఆర్థిక చేయూత

- సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ప్రత్యేక స్వనిధి ప్రచారం.. లోక్ కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, సెప్టెంబర్ 3:--వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసి, వారి వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి స్వనిధి పథకంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ తెలిపారు. లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమంలో భాగంగా గురువారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ హాజరై వీధి వ్యాపారులకు అందుతున్న రుణ సదుపాయాలు, పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఈ సందర్భంగా రామ్ గోపాల్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1 నుంచి 30, 2026 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక స్వనిధి ప్రచారం, లోక్ కళ్యాణ్ మేళా మహోత్సవాన్ని

నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా పరిధిలోని అన్ని పురపాలక సంఘాల్లో, వివిధ బ్యాంకు శాఖల్లో అర్హులైన వీధి వ్యాపారులకు బ్యాంకు రుణాలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకోవడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న స్వనిధి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి వీధి వ్యాపారి ఈ అవకాశాన్ని

సద్వినియోగం చేసుకుని బ్యాంకు రుణాలను పొందాలని సూచించారు. వీధి వ్యాపారులకు ఆర్థిక భద్రత కల్పించడం, వారి జీవనోపాధిని మెరుగుపరచడం, చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడం స్వనిధి పథకం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి రుణ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.
ఈ సమావేశంలో అధికారులు కుమార్, నరేష్ బాబు, ప్రియమ్ జీత్ సింగ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచిగా మారిన జన్మదిన వేడుకలు.!

- ఆడంబరాలు వద్దు.. ఆత్మీయతే ముద్దు... పిల్లల చెంత 'అమ్మ'లా మారిన లయన్ శైలజ!
- కేసముద్రం విలేజ్ పాఠశాలలో భావోద్వేగాల మధ్య జన్మదిన సేవోత్సవం.

కేసముద్రం సెప్టెంబర్ 03,ప్రజావాణి.నేటి ఆధునిక కాలంలో పుట్టినరోజు వేడుకలంటే వేల రూపాయల ఖర్చు, కేకులు, విందు వినోదాలు, రంగుల హంగులే గుర్తొస్తాయి. కానీ, వీటన్నింటికీ భిన్నంగా, సమాజం పట్ల తనకున్న బాధ్యతను చాటుకున్నారు లయన్స్ క్లబ్ కేసముద్రం జోన్ చైర్‌పర్సన్ లయన్ వజినపల్లి శైలజ. తన జన్మదినాన్ని ఆడంబరాలకు దూరంగా, పితృవియోగం కలిగి, సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్న నిరుపేద విద్యార్థుల మధ్య జరుపుకొని మానవత్వాన్ని చాటుకున్నారు.
చిన్నారుల కళ్లలో వెలిగిన ఆనందం.
కేసముద్రం విలేజ్ మండల్ పరిషత్ ప్రైమరీ స్కూల్ పాఠశాల వేదికగా జరిగిన ఈ వేడుకలో, విద్యార్థులకు అవసరమైన నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లను ఆమె స్వహస్తాలతో

పంపిణీ చేశారు. తండ్రి లేని లోటుతో బాధపడుతున్న పలువురు విద్యార్థులను ఆమె దగ్గరకు తీసుకొని, ఓ తల్లిలా ప్రేమను కురిపిస్తూ విద్యా సామగ్రిని అందిస్తున్నప్పుడు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి హృదయాలు భావోద్వేగంతో నిండిపోయాయి.సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ యర్నం శ్రీరాములు గారు మాట్లాడుతూ.. సమాజంలో ఉన్నత పదవుల్లో ఉన్నవారు తమ ప్రత్యేక రోజులను ఇలాంటి నిరుపేద పిల్లల మధ్య జరుపుకోవడం గొప్ప అదృష్టం. శైలజ గారు చూపించిన ఈ ప్రేమ, రాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని కలిగిస్తాయి. వివాహ వార్షికోత్సవాలు,

పుట్టినరోజులను ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకుంటే సమాజంలో ఎంతోమంది పేద పిల్లల భవిష్యత్తు మారుతుంది అని పిలుపునిచ్చారు.విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తూ, వారిలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపిన లయన్ వజినపల్లి శైలజ గారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాథ్ గారితో పాటు స్థానిక ప్రముఖులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ లయన్ మడిపెద్ది వెంకటేష్, లక్కకుల సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు హరినాథ్ కుర్ణ, సురేందర్, నర్సయ్య, భాస్కర్, అప్పల నాగరాజు తదితరులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

శాయంపేట మండల కేంద్రంలో బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజావాణి శాయంపేట గురువారం శాయంపేట మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి అల్పాహారాన్ని పరిశీలించి,వారికి అందుతున్న ఆహారం నాణ్యతపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టి, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, విద్యార్థుల సంక్షేమాన్ని తల్లిదండ్రుల బాధ్యతగా భావించి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించిందని,దేశంలోనే ఆదర్శవంతమైన విధంగా బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకాలను అమలు

చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని తెలిపారు. శాయంపేట మండలంలోని 27 పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో మొత్తం 922 మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నూతన భవనాల నిర్మాణం, డిజిటల్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు,పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు వంటి కార్యక్రమాల ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాల భవనాల మరమ్మతులు చేపట్టడంతో పాటు ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేస్తూ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు.
,బీసీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి సైదులు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉన్నతాధికారిగా ఎదిగారని గుర్తుచేశారు.కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వారి విద్యా పురోగతి, అవసరాల గురించి తెలుసుకుని ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధు లు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, విద్యార్థినులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

భద్రాద్రికి రైలుబాట.. అభివృద్ధికి తొలి అడుగు...

- పాండురంగాపురం--మల్కన్‌గిరి రైల్వే లైన్‌లో సాకేతపురి వరకు పనులకు గ్రీన్‌సిగ్నల్
- సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- మంత్రి విజ్ఞప్తిపై తక్షణమే సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- పాండురంగాపురం--సాకేతపురి మధ్య భూసేకరణ చేపట్టి రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్రం సిద్ధం
- రైల్వే కనెక్టివిటీతో భద్రాచలానికి ఆధ్యాత్మిక పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు

తెలంగాణ స్టేట్ బ్యూరో/మన ప్రజావాణి (03 సెప్టెంబర్ 26): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం--మల్కన్‌గిరి రైల్వే లైన్‌కు మరోసారి కదలిక వచ్చింది. వివిధ కారణాలతో పూర్తి ప్రాజెక్టు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రస్తుత దశలో పాండురంగాపురం నుంచి మధ్యలోని సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి, ఈ మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పూర్తి ప్రాజెక్టుకు పలు అవరోధాలు..

రైల్వే మంత్రితో జరిగిన చర్చలో పాండురంగాపురం--మల్కన్‌గిరి రైల్వే లైన్ ప్రస్తుత పరిస్థితిని మంత్రి తుమ్మల వివరించారు. గతంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్ హయాంలోనూ ఈ రైల్వే లైన్ ప్రతిపాదనకు అనుకూలత లభించినప్పటికీ వివిధ కారణాలతో పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని తెలిపారు. భూసేకరణ, అటవీశాఖ అనుమతులు, గోదావరి వంతెనతో పాటు ఇతర రైల్వే వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలు పూర్తి ప్రాజెక్టుకు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించి పాండురంగాపురం--మల్కన్‌గిరి పూర్తి రైల్వే లైన్‌ను నిర్మించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

సాకేతపురి వరకు ముందుగా పనులు..

అయితే పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి పెద్దగా అవరోధాలు లేనందున.. ఈ దశలో ఆ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల కోరారు. పాండురంగాపురం--సాకేతపురి మధ్య రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి, అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి తెలిపారు.

తుమ్మల విజ్ఞప్తికి తక్షణ స్పందన..

మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. పాండురంగాపురం--సాకేతపురి మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భద్రాద్రి ప్రాంత రైల్వే కనెక్టివిటీకి తొలి అడుగు పడినట్లయింది.

భక్తులకు మరింత చేరువలో భద్రాచలం..

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఈ రైల్వే మార్గం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలం ప్రాంతానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

రైల్వే కనెక్టివిటీతో భద్రాచలంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. భద్రాచలం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యాటక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు, భక్తులు, పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగుపడనున్నాయి.

పారిశ్రామిక రంగానికి రవాణా బలం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక రంగానికి కూడా రైల్వే కనెక్టివిటీ కీలకంగా మారనుంది. సింగరేణి, బీపీఎల్, వాటర్ ప్లాంట్లు, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. రైల్వే సౌకర్యం అందుబాటులోకి రావడంతో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

భూసేకరణకు రాష్ట్రం సిద్ధం..

కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించిన నేపథ్యంలో పాండురంగాపురం-సాకేతపురి మధ్య భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి,అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. పాండురంగాపురం--మల్కన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగుతున్న క్రమంలో ఈ దశలో సాకేతపురి వరకు రైల్వే లైన్ అందుబాటులోకి రావడం భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది. ఆధ్యాత్మిక పర్యాటకం, పారిశ్రామిక ప్రగతి, స్థానిక ఉపాధి, వ్యాపార అవకాశాలకు ఈ రైల్వే కనెక్టివిటీ మరింత బలాన్నివ్వనుంది.

భవజ్ఞ తొలి పుట్టినరోజు వేడుకల్లో పోచారం సందడి.

- భవజ్ఞతో కేక్ కట్ చేయించి ఆశీర్వదించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి.

కోటగిరి/ప్రజావాణి:-నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని మిర్జాపూర్ రామాలయం ఫంక్షన్ హాల్‌లలో వేములపల్లి ఆనంద్ శ్రీజయ దంపతుల కుమార్తె భవజ్ఞ మొదటి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు,బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి చిన్నారి భవజ్ఞతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం చిన్నారికి ఆశీస్సులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ బర్ల మధుకర్,బాన్సువాడ నియోజకవర్గ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు బీర్కూర్ గంగాధర్,కోటగిరి పీఏసీఎస్ చైర్మన్ కూచి సిద్దు,మాజీ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ పత్తి లక్ష్మణ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హమీద్, నాయకులు జుబేర్,బాబు ఖాన్,శంకర్, విజయ్,సోపాన,జగన్నాథ రావు, గోవింద్,కుటుంబ సభ్యులు ఉదయ భాస్కర్,వేములపల్లి రాజు కుమార్ దంపతులు,టింకు,తదితరులు పాల్గొన్నారు.

ఎండీఆర్ హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

హుజూర్‌నగర్ సెప్టెంబర్ 3 (ప్రజావాణి) సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ స్థానిక ఎండీఆర్ హై స్కూల్ లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణం లో జరిగాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు తెలియజేయడానికే ఇలాంటి పండుగలను పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణుడి జీవన విధానం, ఆయన చూపిన ధర్మ మార్గం నేటి తరానికి ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. నర్సిరెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రైతు కంట కన్నీరు.. కాంగ్రెస్‌కు కనిపించదా?

- హామీలు అమలు చేయకుండా అన్నదాతను మోసం చేశారు:
- మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు
- మాజీ ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి

మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3 మన ప్రజావాణి

యూరియా కోసం రైతుల పడిగాపులు

యాప్‌లో స్టాక్.. దుకాణాల్లో నో స్టాక్

రూ.15 వేల రైతుబంధు హామీ ఏమైంది?

రైతుబీమాపైనా నిర్లక్ష్యమే

కేసీఆర్ పాలన కోసం రైతుల ఎదురుచూపులు

మెదక్: రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ, సాగునీటి రంగాలపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 33 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీల్లో అనేకం అమలు చేయలేదని మండిపడ్డారు.

మెదక్ పట్టణంలోని పోస్టాఫీసు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు, రైతు సదస్సులో ఆమె మాట్లాడారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. యాప్‌లో యూరియా అందుబాటులో ఉన్నట్లు చూపుతున్నా.. వాస్తవంగా దుకాణాలకు వెళ్తే ఎరువు దొరకడం లేదని విమర్శించారు.

"ప్రతి రైతు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి స్మార్ట్‌ఫోన్ కొనుక్కొని యాప్‌లో యూరియా వెతకడం సాధ్యమా?" అని పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు.యూరియా పంపిణీలో ఉన్న యాప్ నిబంధనలను తొలగించి, రైతులకు నేరుగా ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఎరువులు అందకపోతే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుబంధుపై నిలదీత

రైతుబంధు కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని విస్మరించిందని పద్మా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. రైతుబీమా విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రైతుల కళ్లల్లో కన్నీళ్లు తెప్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు.

కేసీఆర్ హయాంలో రైతు సంక్షేమం

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని ఆమె అన్నారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, 24 గంటల విద్యుత్ సరఫరా, సాగునీటి వసతుల కల్పన వంటి చర్యలను ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతులను విస్తరించామని తెలిపారు.కేసీఆర్ పాలనలో రైతులకు జరిగిన మేలు, ప్రస్తుత ప్రభుత్వంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకునే పరిస్థితి ఏర్పడిందని పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు.

హామీలన్నీ ఎక్కడ?

పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందిస్తామని, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఉచిత బస్సు పేరుతో ప్రచారం చేసుకుంటూ మరోవైపు టికెట్ ధరలు పెంచారని, బస్సుల సంఖ్య తగ్గించారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే బీఆర్ఎస్ రైతు సదస్సులు, ప్రజా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై రైతు వేదిక వద్ద నిరసన...

- డప్పు కోడుతూ నిరసన తెలిపిన బిఆర్ఎస్ నాయకులు.

సెప్టెంబర్ 03 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని ఆరోపిస్తూ , భువనగిరి మండలం చీమలకొండూర్ గ్రామ రైతువేదిక వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కూనూరు, ముస్త్యాలపల్లి , కేసారం , బాలంపల్లి గ్రామాలకు చెందిన రైతులు , మహి ళలు , యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రైతులకు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని , రైతుల సమస్యలను పరిష్క రించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్య క్రమంలో చందుపట్ల పిఎసిఎస్ మాజీ చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి , భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్ గౌడ్ , కేసారం సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పలు గ్రామల రైతులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని , రైతుల పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని , రైతుల సమస్యలను పరిష్క రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం , రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని నాయ కులు స్పష్టం చేశారు.

వెయ్యి రోజుల ప్రజా పాలన...

- బోడుప్పల్‌లో ఘనంగా కాంగ్రెస్ వెయ్యి రోజుల వేడుకలు
- వజ్రేష్ యాదవ్ నేతృత్వంలో బైక్ ర్యాలీ..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

మేడిపల్లి సెప్టెంబర్ 03(మన ప్రజావాణి)కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా బోడుప్పల్‌లో పార్టీ శ్రేణులు గురువారం సందడి చేశాయి.బోడుప్పల్,చెంగిచర్ల డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రభుత్వ పాలనపై తమ మద్దతును చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్‌పై ర్యాలీలో పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి,బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్ కుమార్,చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్‌రెడ్డి,మాజీ కార్పొరేటర్లు,మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చందనపూర్‌లో సర్ పై గ్రామసభ కార్యక్రమం

రామగిరి,మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 3 రామగిరి మండలం చందనపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భం గా సర్ ప్రక్రియకు సంబంధించి గ్రామస్థులకు అధికారులు అవగాహన కల్పించారు.గ్రామసభలో రామగిరి తహసిల్దార్ సుమన్,డి.టి మానస, జిపిఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ కొండ మంజుల, ఉపసర్పంచ్ రజిత రామ్‌చందర్,మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇబ్రహీం,వార్డు సభ్యులు సౌందర్య కుమార్,బాగే రాజు,కుమారస్వామి, బిఎల్ఎ షాహిద్,ఎరవెల్లి సాయికిరణ్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.సర్ నోటీసులు వచ్చిన వారికి గ్రామసభలోనే నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సుమన్ మాట్లాడుతూ... ఇప్పటికే సర్ నోటీసులు అందినప్పటికీ గ్రామసభలో ఇవ్వని వారు వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి బిఎల్ఓ శ్రీలతకు అందజేయాలని సూచించారు.సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి,అవసరమైన వివరాలు సకాలంలో సమర్పించాలని కోరారు.గ్రామసభలో సర్ కు సంబంధించిన అంశాలపై ప్రజలు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

సరైన ఆధారాలు చూపించి మీ ఓటును కాపాడుకోండి: బి.ఎల్.ఓ అధికారి రాజు

కూకట్ పల్లి న్యూస్ (3 సెప్టెంబర్ 2026) మునిపల్లి నరేష్ యాదవ్ (ప్రజావాణి) దినపత్రిక ప్రతినిధి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి తుది దశ ప్రక్రియ మేడ్చల్ జిల్లాలో వేగవం తమైంది. కూకట్ పల్లి వార్డ్ కార్యాలయంలో మ్యాపింగ్ కాని వారితో పాటు అనా మలిస్ (స్పష్టమైన గుర్తింపు లేని ఓటర్లు) జాబితాలో చేరిన ఓటర్లకు బీఎల్వోల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారి రాజు మాట్లాడుతు నిర్దీత గడువు లోగా తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని ఓటర్లకు చెబుతున్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ

- 13 వార్డుల్లో 17 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు నోటీసులు

మన ప్రజావాణి. మంథని ప్రతినిధి మంథని పురపాలక సంఘం పరిధిలో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంథని మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డుల్లో ఉన్న 17 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితాలో సవరణలు అవసరమైన ఓటర్లకు బూత్ లెవెల్ అధికారులు (దీూలు) నోటీసులు అందజేశారని మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో తయారు చేసిన ఓటర్ల జాబితాలో కొన్ని వివరాలు పొంతన లేకపోవడం లేదా తప్పుగా నమోదై ఉండే అవకాశం ఉన్నందున, తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను కొనసాగించేందుకు సంబంధిత ఓటర్లు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని అధికారులు సూచించారు.భారత ఎన్నికల సంఘం సూచించిన మేరకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ తదితర అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో వారికి నిర్దేశించిన తేదీలలో హాజరు కావాలని కోరారు.నిర్దేశించిన తేదీన హాజరు కాలేని వారు సెప్టెంబర్ 20వ తేదీ లోపు తమకు సంబంధించిన బూత్ లెవెల్ అధికారిని (BLO) సంప్రదించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని అధికారులు తెలిపారు.ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలు సక్రమంగా ఉండేలా సంబంధిత ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వాటర్ ట్యాంక్ ను పరిశీలించిన అధికారులు.

మన ప్రజావాణి. మంథని ప్రతినిధి. మంథని మండలం మల్లేపల్లి గ్రామ సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో గ్రామంలో గల వాటర్ ట్యాంకును మంథనిఎంపీడీవో శ్రీజ రెడ్డి మిషన్ భగీరథ ఏఈ కీర్తన కార్యదర్శి రవి పరిశీలించడం జరిగింది ట్యాంక్ నిర్మాణ నాణ్యత నీటి నిల్వ సామర్థ్యత పరిసరాల పరిస్థితులను పరిశీలించారు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు

విధులకు ఆటంకం.. వ్యక్తికి జైలు శిక్ష

- ప్రభుత్వ అధికారిపై దురుసు ప్రవర్తన.. రూ.1,550 జరిమాన

పటాన్‌చెరు, సెప్టెంబర్ 3 (ప్రజావాణి): విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారిపై దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించడంతో పాటు న్యూసెన్స్‌కు పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో బడావత్ సూర్య (తండ్రి కిషన్), పోచమ్మరాల్ తండా, జక్కన్నపేట గ్రామం, మెదక్ జిల్లా వాసిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.విచారణ అనంతరం నిందితుడిని సంగారెడ్డి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, కేసును విచారించిన న్యాయమూర్తి వి. లక్ష్మికళ నిందితుడికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,550 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు లేదా ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించడం, వారి విధులకు ఆటంకం కలిగించడం, న్యూసెన్స్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని పోలీసులు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ముకుందా.! ముకుందా..

- విజ్ఞాన్ పాఠశాలలో అలరించిన కృష్ణాష్టమి..

ప్రజావాణి,ఇనుగుర్తి: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని మండల కేంద్రం ఇనుగుర్తి లోని విజ్ఞాన్ పాఠశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు కృష్ణా రాధలతో పాటు యశోద గోపికలు వేషధారణలు అలరించారు.విద్యార్థులు శ్రీకృష్ణుడి లీలలలో భాగంగా వెన్నదొంగిలించిన సన్నివేశం, ఉట్లు కొట్టడం తో పాటు, పాటలు,నృత్యాల తో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి.ప్రిన్సిపల్ గంజి అర్చన రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి పై వివరిస్తూ హిందువులు గొప్పగా జరుపుకునే పండుగ కృష్ణాష్టమి అన్నారు.లోక రక్షణ,ధర్మస్థాపనకై శిష్ట రక్షణ దుష్ట శిక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారంగా అర్ధరాత్రి ఉద్భవించిన పవిత్ర రోజును శ్రీ కృష్ణాష్టమి, గోకులాష్టమి,జన్మాష్టమి గా పిలుస్తామన్నారు. సర్వమానవాళిని ఉద్ధరించడానికి లోకానికి భగవద్గీతను ప్రసాదించిన జగద్గురు శ్రీకృష్ణ భగవానుడని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు వెసగండ్ల చంద్రమోహన్,తోట అనిత, కదిరే రమ్య, బోళ్ల సుజాత,గండి రమ్య ,విద్యార్థులు,పేరెంట్స్ పాల్గొన్నారు.

ముద్దులొలికే కృష్ణలీలలు.. మురిసిన కేసముద్రం!

- వివేకవర్ధిని స్కూల్‌లో అంగరంగ వైభవంగా గోకులాష్టమి వేడుకలు.
- అక్షర క్రమ-శిక్షణతో పాటు సంస్కృతిని నేర్పుతున్న అగ్రగామి విద్యాసంస్థ.
- చిన్నారుల వేషధారణలు అద్భుతం.. ఉట్టి సంబరంలో విద్యార్థుల కోలాహలం.

కేసముద్రం, సెప్టెంబర్ 3, ప్రజావాణి.ఆధునిక కార్పొరేట్ చదువుల హోరులో అస్తిత్వాన్ని కోల్పోతున్న భారతీయ సంస్కృతిని, సంప్రదాయ వైభవాన్ని చిన్నారుల గుండెల్లో నారుగా పోసి, నైతిక విలువల మహావృక్షాలుగా పెంచుతోంది కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్. పాఠశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి (గోకులాష్టమి) సంబరాలు కన్నులపండువగా సాగాయి. చిన్నారుల నవ్వులు, కృష్ణ లీలల అభినయాలతో పాఠశాల ఆవరణం సాక్షాత్ ఆ నందగోకుల నందనవనాన్ని తలపించింది.

అడుగడుగునా ముగ్ధమనోహరం.. చిన్నారుల ప్రదర్శన అమోఘం!

సాధారణంగా పండుగలు అందరూ జరుపుకుంటారు, కానీ వివేకవర్ధిని స్కూల్ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. బుడిబుడి అడుగులతో, చేతిలో మురళి పట్టి, తలపై నెమలి పించం ధరించిన బాలకృష్ణులు.. లలిత కళల రూపాలుగా నిలిచిన రాధమ్మలు, గోపికల వేషధారణలతో చిన్నారులు చేసిన ప్రదర్శనలు అద్భుతః అనిపించాయి. కేవలం దుస్తులు ధరించడమే కాకుండా, ఆయా పాత్రల్లో లీనమై చిన్నారులు చూపిన హావభావాలు, సాంస్కృతిక నృత్యాలు, భక్తి గీతాల ఆలపన సభా ప్రాంగణాన్ని భక్తి రసార్ద్రం చేశాయి. ప్రతీ చిన్నారిని ఒక కళాఖండంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ఉత్సాహం ప్రతి ఒక్కరినీ అద్భుతపరిచింది.

సమష్టి స్ఫూర్తికి ప్రతీకగా 'ఉట్టి సంబరం'.

వేడుకల్లో భాగంగా నిర్వహించిన సంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమం ఈ పండుగకే హైలైట్‌గా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ స్వయంగా పర్యవేక్షించిన ఈ ఘట్టంలో.. విద్యార్థులు సమూహాలుగా ఏర్పడి ఉట్టిని కొట్టేందుకు చేసిన ప్రయత్నాలు, వారిలోని సమష్టి స్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను చాటిచెప్పాయి. డోలు సన్నాయి వాయిద్యాలు, విద్యార్థుల కేరింతల మధ్య ఉట్టి కొట్టిన దృశ్యం కేసముద్రం ప్రాంతంలోనే ఒక అద్భుత పండుగ వాతావరణాన్ని నింపింది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రముఖ విద్యావేత్త చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ...విద్య అంటే కేవలం మార్కులు, ర్యాంకులు సంపాదించడం కాదు,సమాజానికి పనికొచ్చే ఉత్తమ నడవడికను నేర్చుకోవడం.శ్రీకృష్ణుని జీవితం, ఆయన బోధించిన భగవద్గీత సందేశం నేటి విద్యార్థులకు దిక్సూచి. ధర్మం, నైతిక విలువలు, కర్తవ్య నిర్వహణను బాల్యం నుంచే అలవాటు చేయడమే మా వివేకవర్ధిని స్కూల్ ప్రథమ కర్తవ్యం అని సగర్వంగా ప్రకటించారు.పాఠశాల ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్ ప్రణాళికాబద్ధమైన నాయకత్వంలో, ఉపాధ్యాయ బృందం అంకితభావంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తీరు వారి యాజమాన్య ప్రతిభకు, క్రమశిక్షణకు అద్దం పట్టింది. ఈ అద్భుత వేడుకలను వీక్షించిన తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు.. విద్యాబోధనలోనే కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను కొనియాడారు.

ప్రజల పట్టా భూములను 22-Aలో చేర్చి హక్కులు హరిస్తారా?

- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

మేడిపల్లి సెప్టెంబర్ 03(మన ప్రజావాణి) ప్రజల కష్టార్జితంతో కొనుగోలు చేసిన పట్టా భూములు,ప్రైవేట్ ప్లాట్లను 22-A (రిజిస్ట్రేషన్ నిషేధిత) జాబితాలో చేర్చడంపై బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడింది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా పీర్జాదిగూడలోని మేడిపల్లి ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజల భూములను 22-ూ జాబితాలో చేర్చి వారి ఆస్తి హక్కులను హరించే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసిన రైతులు, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పుడు రిజిస్ట్రేషన్లు,భూ లావాదేవీలు,బ్యాంకు రుణాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రజల అభ్యంతరాలను,భూ యజమానుల పత్రాలను పరిశీలించకుండా అర్హతలేని భూములను 22-ూ జాబితాలో చేర్చడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రజల భూములను కాపాడాల్సిన ప్రభుత్వం,వాటినే వివాదాస్పదంగా మార్చడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల ఆస్తులపై కూడా అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు.22-A జాబితా పేరుతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం,వారి హక్కులను నిలిపివేయడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.అర్హతలేని భూములను తక్షణమే 22-ూ జాబితా నుంచి తొలగించి,భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించాలి.లేనివక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం అని జక్క వెంకట్ రెడ్డి హెచ్చరించారు.ప్రజల భూములు,ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొల్తూరి మహేష్,లేతాకుల మాధవి,రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి,కొడే పోచయ్య,మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, రమేష్,సతీష్ రెడ్డి, మురళి,రాజేష్ రెడ్డి, నర్సింహారెడ్డి,కోటగిరి శ్రీకాంత్,జగన్ రెడ్డి,శశిధర్ రెడ్డి,యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్,అశోక్, సతీష్,కిరణ్ నాయక్, పాశం నరేందర్ రెడ్డి, అక్షిత్,వెంకట్,అమర్ పటేల్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు,సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలు

- క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపిన విద్యాశాఖ అధికారులు

ఓదెల/పెద్దపల్లి సెప్టెంబర్ 3 ప్రజావాణి:గత మూడు రోజులుగా పొత్కపల్లి పాఠశాల ఆవరణలో ఉత్సాహభరితంగా కొనసాగిన మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య క్రీడా పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని వివిధ క్రీడాంశాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వై. రమేష్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన మండల విద్యార్థులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు రానున్న ప్రాంతీయ, జిల్లా స్థాయి పోటీల్లో మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి ఓదెల మండలానికి అగ్రస్థానం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రతిభావంతులైన విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించేలా ప్రత్యేక శిక్షణ శిబిరాల నిర్వహణపై సాధ్యసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. క్రీడాకారులలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణ, పట్టుదల, క్రీడా స్ఫూర్తితో సాధన చేయాలని సూచించారు. నిరంతర సాధనతో రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం అద్భుతమైన ప్రతిభ కనబరిచి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. మూడు రోజులపాటు జరిగిన క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన పొత్కపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి మండల విద్యాధికారి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల బృందాన్ని అభినందిస్తూ, విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో మండల విద్యాధికారి వై. రమేష్, సముదాయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. శ్రీనివాస్, మడక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి విద్యానికేతన్‌లో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి.. ఉట్టి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, బైంసా, సెప్టెంబర్ 3:--బైంసా మండలంలోని వనాల్‌పహాడ గ్రామంలో వైష్ణవి విద్యానికేతన్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, ఉట్టి వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్, కరస్పాండెంట్ సాయినాథ్, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు దశావతారాల్లో ధర్మరక్షకుడిగా నిలిచిన మహనీయుడని అన్నారు. శ్రీకృష్ణుడి జీవితం ప్రేమ, ఆప్యాయత, ధర్మం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీమద్భగవద్గీత ద్వారా మానవాళికి శ్రీకృష్ణుడు అందించిన సందేశాలు నేటికీ సమాజానికి, ముఖ్యంగా యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించగా, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు వారిని ఉత్సాహపరిచారు. అనంతరం నిర్వహించిన ఉట్టి వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణమంతా చిన్నారుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించింది.విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్, కరస్పాండెంట్ సాయినాథ్, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు కృషి ఫలితం

- మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు ఆధునిక బస్సులు మంజూరు
- త్వరలో క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభానికి సన్నాహాలు

మెదక్ జిల్లా బ్యూరో. మన ప్రజావాణి సెప్టెంబర్ 3

మెదక్.నియోజకవర్గంలో ఆరోగ్య రంగం, వైద్య విద్య అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది.ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవతో మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు ఆధునిక బస్సులు మంజూరయ్యాయి. నర్సింగ్ విద్యార్థులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు వారి విద్యా, ప్రాక్టికల్ శిక్షణ.కార్యకలాపాలకు ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర.సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో కలిసి మెదక్ నియోజకవర్గానికి సంబంధించిన పలు ఆరోగ్య శాఖ అంశాలపై విస్తృతంగా చర్చించారు.ముఖ్యంగా మెదక్ నర్సింగ్ కాలేజీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, వైద్య సేవల బలోపేతం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు.మెదక్ నియోజకవర్గంలో ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే రోహిత్ రావు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ.అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య.సదుపాయాలు. అందుబాటులోకి.తీసుకురావడంతో పాటు వైద్య విద్యా సంస్థలను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఈ కృషిలో భాగంగానే మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు ఆధునిక బస్సులు మంజూరు కావడం ముఖ్యమైన ఫలితంగా నిలిచింది. బస్సులు అందుబాటులోకి రావడంతో విద్యార్థుల రవాణా సమస్యలు తగ్గడంతో పాటు కాలేజీకి సంబంధించిన విద్యా, ప్రాక్టికల్ శిక్షణ.కార్యక్రమాలకు మరింత సౌకర్యం కలగనుంది.

నర్సింగ్ కాలేజీ అభివృద్ధికి మరిన్ని చర్యలు

మెదక్ నర్సింగ్ కాలేజీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలను కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన సౌకర్యాలను కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

త్వరలో క్రిటికల్ కేర్ సెంటర్ మెదక్ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభంపైనా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రాన్ని త్వరలో ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.క్రిటికల్ కేర్ సెంటర్ అందుబాటులోకి వస్తే అత్యవసర పరిస్థితుల్లో, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. అత్యవసర వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం కొంతవరకు తగ్గనుంది.మెదక్ నియోజకవర్గాన్ని ఆరోగ్య రంగంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తాం" అని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు ఆరోగ్య శాఖ.ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్- డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ...

- ప్రమాణం చేయించిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య.

సెప్టెంబర్ 03 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి.యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ మున్నూరు కాపు సత్రంలో ఆత్మ కమిటీ చైర్మన్ , డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య , బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆత్మ కమిటీ చైర్మన్ ఏనగండ్ల సుధాకర్ , డైరెక్టర్లను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఘనంగా సన్మానించి , ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభి వృద్ధి , రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు , నూతన సాంకేతిక పరిజ్ఞానం , శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించడం తో పాటు , రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఆత్మ కమిటీలు కీలకపాత్ర పోషించాలి. ఆలేరు నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు , వ్యవ సాయ శాఖ ద్వారా అందుతున్న సేవలు పూర్తి స్థాయిలో చేరేలా కమిటీ సభ్యులు కృషి చేయాలి. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలి. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎనగండ్ల సుధాకర్ తో పాటు నూతన డైరెక్టర్ లందరికీ అభినందనలు. తమపై ప్రభుత్వం , రైతులు ఉంచిన నమ్మ కాన్ని నిలబెట్టుకుంటూ అంకితభావంతో పని చేయాలి. ఆలేరు నియోజకవర్గాన్ని వ్యవ సాయ రంగంలో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరం సమన్వయంతో పనిచేద్దాం" అని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ప్రతి రైతుకు వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ నూతన చైర్మన్ , డైరెక్టర్లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు , ప్రజాప్రతి నిధులు , రైతు ప్రతి నిధులు , కార్యకర్తలు , అభిమానులు , వ్యవ సాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పని చేయాలి

- ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి.. బాధితులకు సత్వర న్యాయం
- పౌరహక్కుల దినోత్సవాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలి:
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మెదక్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 3ప్రజావాణి

ఎస్సీ ఎస్టీలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి

అట్రాసిటీ కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు బాధితులకు సత్వర న్యాయం చేయాలి

ఎస్సీ ఎస్టీల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి

మూడు నెలకొకసారి విజిలెన్స్ కమిటీ సమావేశం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ఎస్సీ ఎస్టీల సంక్షేమంలో నిర్లక్ష్యం వద్దు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి బక్కి వెంకటయ్య

ప్రతినెల సివిల్ రైట్స్ డే నిర్వహించాలి మానవయ్య కోణంలో ప్రజలకు సేవలు అందించాలి అధికారులకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్తి వెంకటయ్య సూచన

పారదర్శక దర్యాప్తు తప్పనిసరి బాధితులకు న్యాయం చేయడమే ప్రాధాన్యం

ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై నమోదయ్యే అట్రాసిటీ కేసులను వేగవంతంగా, పారదర్శకంగా దర్యాప్తు చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. మెదక్ జిల్లాను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు కే..లక్ష్మీనారాయణ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి చేరుకోగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అనంతరం ఐడీఓసీలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు, కమిషన్ సభ్యుడు కే.లక్ష్మీనారాయణతో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, ప్రభుత్వ పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో బక్కి వెంకటయ్య సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డుల ద్వారా కల్పిస్తున్న ఉపాధి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అట్రాసిటీ కేసుల్లో జాప్యం వద్దు

జిల్లాలో ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి దర్యాప్తు, ఛార్జ్‌షీట్ దాఖలు వివరాలను కమిషన్ చైర్మన్ సమీక్షించారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి నెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే తప్పనిసరిగా నిర్వహించాలని బక్కి వెంకటయ్య ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశాలకు హాజరై ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని అన్నారు.

మూడు నెలలకోసారి విజిలెన్స్ కమిటీ సమావేశం

జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలని బక్కి వెంకటయ్య సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలు తెరిపించాలని సూచించారు. బ్యాంకు ఖాతాల ద్వారా వారికి బీమా వంటి సౌకర్యాలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ సేవలకు వెంకటయ్య అభినందన

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సేవలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ అందరికీ సమాన న్యాయం చేస్తూ విద్యార్థులు, ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీసు, ఇతర శాఖల అధికారుల సేవలను కూడా అభినందించారు.

కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు క్షేత్రస్థాయిలో చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ ప్రతిరోజూ కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెప్పారు.

విద్యాలయాల్లో ప్రత్యేక అధికారులను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు.

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్‌కు వివరించారు. వివిధ దశల్లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేసుల దర్యాప్తును పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంబదాసు రాజేశ్వర్, డీఎఫ్ఓ జోజి జి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీఓలు రమాదేవి, బవయ్య, రామకృష్ణ, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు సింధు, విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం!

- బెదిరింపులు, దూషణలు, విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.
- కొండాపూర్ మండల జర్నలిస్టుల హెచ్చరిక.

కొండాపూర్, సెప్టెంబర్ 03 (ప్రజావాణి):ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, వాస్తవాలను ప్రజలకు తెలియజేసే జర్నలిస్టుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, బెదిరింపులకు పాల్పడినా, విధులకు ఆటంకం కలిగించినా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కొండాపూర్ మండల జర్నలిస్టులు స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో జర్నలిస్టులపై జరుగుతున్న దూషణలు, బెదిరింపులు, అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను వార్తల రూపంలో ప్రజల దృష్టికి తీసుకెళ్లడం జర్నలిస్టుల బాధ్యత అని పేర్కొన్నారు. సమస్యలపై వార్తలు ప్రచురించినంత మాత్రాన జర్నలిస్టులను వ్యక్తిగతంగా దూషించడం, అసభ్య పదజాలంతో మాట్లాడటం, బెదిరించడం సరికాదన్నారు.అధికారంలో ఉన్నా.. రాజకీయ నాయకుడైనా.. ప్రజాప్రతినిధైనా.. ఎవరైనా సరే జర్నలిస్టుల గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే జర్నలిస్టులను భయపెట్టే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచడమేనని అన్నారు.వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులపై ఒత్తిళ్లు, బెదిరింపులు తీసుకురావడం మానుకోవాలని సూచించారు. జర్నలిస్టుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.జర్నలిస్టుల డిమాండ్ జర్నలిస్టుల విధులకు ఆటంకం కలిగించే చర్యలను అరికట్టడంతో పాటు, బెదిరింపులు, అసభ్యకర వ్యాఖ్యలకు పాల్పడే వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కొండాపూర్ మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రమేష్, సూర్య రిపోర్టర్ రాజు, ప్రజావాణి రిపోర్టర్ అనంత్, సాక్షి రిపోర్టర్ నరసింహులు, నవతెలంగాణ రిపోర్టర్ అనిల్, జ్ఞాన తెలంగాణ రిపోర్టర్ శ్యామ్, నమస్తే తెలంగాణ రిపోర్టర్ శేఖర్, ప్రజాజ్యోతి రిపోర్టర్ శేఖర్, విజయక్రాంతి రిపోర్టర్ ప్రవీణ్ కుమార్, మన తెలంగాణ రిపోర్టర్ మహేష్, జనం సాక్షి రిపోర్టర్ బాలయ్య, ఆంధ్రప్రభ రిపోర్టర్ మానేయ, కే న్యూస్ రిపోర్టర్ మన్సూర్, మనం రిపోర్టర్ నర్సింలు, తెలుగు జ్యోతి రిపోర్టర్ ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

సీపీ నిర్వహించిన గణేష్ శాంతి కమిటీ సమావేశానికి హాజరైన కోటగిరి సర్పంచులు.

- సీపీ సాయి చైతన్యను శాలువాతో సన్మానించిన కోటగిరి సర్పంచులు.

కోటగిరి/ప్రజావాణి:-నిజామాబాద్ జిల్లా సీపీ పీ.సాయి చైతన్య ఆధ్వర్యంలో గురువారం బోధన్లోని రాకాసిపేట్ లయన్స్ క్లబ్లో నిర్వహించిన గణేష్ ఉత్సవ శాంతి కమిటీ సమావేశానికి కోటగిరి మండల సర్పంచులు హాజరయ్యారు.ఈ సమావేశానికి మండల సర్పంచ్ ఫోరం కన్వీనర్ బర్ల మధుకర్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు వెళ్లారు.ఈ సందర్భంగా బోధన్ డివిజన్ పరిధిలోని సర్పంచులు,గణేష్ ఉత్సవ కమిటీలతో సీపీ సాయి చైతన్య ప్రత్యేకంగా సమావేశమై ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.మత సామరస్యాన్ని కాపాడుతూ,పోలీసు నిబంధనలు పాటిస్తూ పండుగ జరుపుకోవాలని సూచించారు.అనంతరం కోటగిరి మండల సర్పంచులు సీపీ సాయి చైతన్యను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కోటగిరి మండల సర్పంచులు,ఆయా గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభివృద్ధిని చూసి బీజేపీ, బీఆర్ఎస్‌కు భయం.

- కొండాపూర్‌లో భారీ బైక్ ర్యాలీ.. టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.

కొండాపూర్, సెప్టెంబర్ 03 (ప్రజావాణి):కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు సీఎం ఆదేశాల మేరకు కొండాపూర్ మండలంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నేరుగా ప్రజల్లోకి వెళ్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజల సమస్యలను పట్టించుకోలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అందించిన నిధులు, సహకారంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.వెయ్యి రోజుల పాలనలో చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందుకు తీసుకెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కే ఉందని నిర్మల జగ్గారెడ్డి అన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, నర్సింలు, శ్రీకాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, అశోక్, సర్పంచులు రామచంద్రరెడ్డి, అనిల్, మల్కాపూర్ ఉపసర్పంచ్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ వెంకటేశం గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి

- సిడిపివో జయప్రద

రాయికల్, సెప్టెంబర్ 03 (ప్రజావాణి)జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రాజెక్టు సీడీపీవో జయప్రద తెలిపారు.రాయికల్ మండలంలో మొత్తం 175 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఆగస్టు 27 నుండి ప్రారంభమైన ధ్రువపత్రాల పరిశీలనలో బుధవారం వరకు 102 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులో రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో 77 దరఖాస్తులకు 34, రాయికల్ రూరల్ పరిధిలో 98 దరఖాస్తులకు 68 చొప్పున పరిశీలన పూర్తయిందని,ఇంకా 73 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉందని, సెప్టెంబర్ 5 చివరి తేదీ అని ఆమె పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఒరిజినల్,జిరాక్స్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని,ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశీలించబోమని స్పష్టం చేశారు.

1000 రోజుల కాంగ్రెస్ పాలన.. హామీలన్నీ బాకీ!

● కాంగ్రెస్ విఫల పాలనపై రామచంద్రపురం 268 డివిజన్‌లో బీఆర్ఎస్ నిరసన.. ప్రజలకు 'బాకీ కార్డుల' పంపిణీ

రామచంద్రపురం, సెప్టెంబర్ 3 (ప్రజావాణి): కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం రామచంద్రపురం 268 డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశారు. ఎన్నికల గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలన సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించిందని ధ్వజమెత్తారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు గద్దెనెక్కిన తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరచిపోయారని విమర్శించారు.సీనియర్ నాయకుడు పరమేశ్ యాదవ్ మాట్లాడుతూ, గత 1000 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన ప్రయోజనం శూన్యమని విమర్శించారు.ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, పెద్దరాజు, శ్రీకాంత్‌రెడ్డి, బల్ల నర్సింగ్‌రావు, తొంట నర్సింహ, కావలి శ్రీరాములు, రవి, నాగరాజు, జైపాల్, రాములు యాదవ్, బుల్ల అశోక్, దశరథ్, అక్బర్, లక్ష్మీనారాయణ, యశ్వంత్, గడ్డం మల్లేష్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దన్న గుప్పెట్లో అసైన్మెంట్ భూమి....?

- డోలమైట్ క్వారీ సమీపంలో దర్జాగా ఆక్రమణ...?
- సుమారు 10 కోట్ల భూమికి కన్నం...?
- తొలుత ఆక్రమణ తరువాత మట్టి వ్యాపారం..?
- ఓ ప్రతిపక్ష నేత కబంధ హస్తాలలో సుమారు 5 ఎకరాల అసైన్మెంట్ భూమి...?
- పట్టించుకోని రఘునాధపాలెం తహసిల్దార్...?
- ఓ అభివృద్ధి డొంకను రూటు మార్చేందుకు ప్రయత్నం....?
- సర్వే నిర్వహించి... సరిహద్దులు నిర్ణయించాలి అంటున్న రైతులు
- భూభారతి ద్వారానైనా అసైన్మెంట్ భూమిని స్వాధీనం చేసుకుంటారా...?
- రఘునాథపాలెం మండలం వైయస్సార్ కాలనీ సమీపంలో భూ దందా...?

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణినాటి ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలు భూ దందాలు విస్తృతంగా జరిగినట్లు ఆరోపణలు విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి అమలు చేసిన ధరణిని ప్రజా ప్రభుత్వం రద్దుచేసి భూభారతిగా మార్చి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భూముల వివరాలు సరిహద్దులు నిర్ణయించి అర్హులైన రైతాంగానికి అందించాలని ఎటువంటి సమస్యలు భవిష్యత్తులో కూడా భూ వివాదాలు లేకుండా సమగ్ర వ్యవస్థకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్న నేపథ్యం. కొందరు అధికారుల తీరు వలన కోట్లాది రూపాయల విలువచేసే భూములు అక్రమార్కుల గుప్పెట్లోకి చేరి ప్రభుత్వ భూములు బందీ అయిన నేపథ్యం వెలుగు చూసింది. మన ప్రజావాణి ఖమ్మం బ్యూరో ప్రతినిధి సేకరించిన సమాచారం మేరకు ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం వి వెంకటాయపాలెం రెవిన్యూ పరిధిలో ప్రధానంగా 279 278 280 276 281 282 సర్వే నెంబర్లలో సాగుదారులకు ఉండాల్సిన భూములు కంటే అదనంగా ఉన్నట్లు పలువురు స్థానికులు మండల ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రధానంగా 279 సర్వే నెంబర్లు ఓ ప్రతిపక్ష నేత గత ప్రభుత్వ హయాంలో జిల్లాస్థాయి లో పలుకుబడి ఉండటంతో వైయస్సార్ కాలనీ వెనుక ఉన్న ఓ డోలమైట్ క్వారీ ప్రాంతంలో సుమారు 5 ఎకరాల అసైన్మెంట్ భూమిని ఆక్రమించినట్లు పలువురు రైతులు స్థానికులు గుసగుసలాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఆ ప్రాంతంలో విచ్చలవిడిగా ఎటువంటి అనుమతులు లేకుండా లక్షలాది రూపాయల అక్రమ మట్టి వ్యాపారం నిర్వహించినట్లు సమాచారం. మట్టి వ్యాపారం అనంతరం అసైన్మెంట్ భూములను కొందరు దర్జాగా ఆక్రమించి తమ ఆధీనంలో ఉంచుకున్నట్లు నేటికీ సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఉన్న భూములకు అదనంగా భూములు ఉన్నప్పటికీ సంబంధిత రెవెన్యూ సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా ఆ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అసలు పట్టాదారులు కలిగిన రైతుల భూముల వైపు మళ్లించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా కోట్లాది రూపాయల భూమి ఆక్రమణ గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నప్పటికీ సంబంధిత జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారులు స్పందించకపోవడం వెనుక పలు విమర్శలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా అవసరాలకు ఉపయోగపడే అసైన్మెంట్ భూములను కొందరు అక్రమార్కులు గుప్పెట్లో బందీ చేసి అక్రమ మట్టి వ్యాపారంతో పాటు ఇతర భూ దందాలకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు చలనం లేకపోవడం సంచలనం కలిగిస్తుందని సమాచారం.నేటి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి సమగ్ర సర్వే ను 279 278 280 276 281 282లో నిర్వహించి భూములు అక్రమంగా ఆక్రమించి గుప్పెట్లో పెట్టుకున్న అక్రమార్కులపై కొరడా జుపించి విలువైన ప్రభుత్వ భూములను ఆ అసైన్మెంట్ భూములను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని పలువురు స్థానికులు మండల ప్రజలు రైతులు కోరుతున్నారు.

అధికారుల వివరణతో మరికొన్ని సమగ్ర ఆధారాలతో.. రేపటి కథనం.. లో వేచి చూడండి...!

చిలుకూరులో మహిళ అనుమానాస్పద మృతి.. కేసు నమోదు

చిలుకూరు, సెప్టెంబర్ 3 (ప్రజావాణి): చిలుకూరు గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామానికి చెందిన మంద భాగ్యలక్ష్మి (35) బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.గురువారం ఉదయం కుటుంబ సభ్యులు గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్సై మోహన్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితులను ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అప్పల రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహన్‌బాబు తెలిపారు.ద

తహసీల్దార్ కార్యాలయంలో అధికారి అందుబాటులో లేరంటూ ప్రజల ఆవేదన

మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 03 (జోగిపేట) సంగారెడ్డి జిల్లాప్రతినిధిఅందోల్--జోగిపేటతహసీల్దార్ కార్యాలయంలో కుల, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.కుల, నివాస ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన పనుల కోసం కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్ లో మేడం కొంతసేపు కార్యాలయంలో ఉన్నప్పటికీ, అనంతరం సుమారు మూడు గంటల పాటు తన సీటులో అందుబాటులో లేకపోయారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో వివిధ పనుల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కార్యాలయంలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు కార్యాలయంలో లేకపోవడంతో తమ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమయపాలన పాటించాలని, కార్యాలయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.అధికారి అందుబాటులో లేకపోవడానికి గల కారణాలపై అధికారుల వివరణ రావాల్సి ఉంది.

సీనియర్ సిటిజన్ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం -- విశేష స్పందన

చెన్నారావుపేట సెప్టెంబరు 03 ప్రజావాణి మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ల ప్రాతినిధ్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి,ఈగ సత్యనారాయణ,ములుక సాంబయ్య,మల్లయ్య, కొమ్మయ్య, నారాయణరెడ్డి, కట్టయ్య, సమ్మారెడ్డి, ట్రెజరర్ కుమారస్వామి, కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.?అనంతరం డాక్టర్ వినోద్ కుమార్, సురేందర్ ల ఆధ్వర్యంలో రోగులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. స్థానిక సీనియర్ సిటిజన్ల సమాజ సేవా దృక్పథంతో ఇలాంటి శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు.?ఈ కార్యక్రమంలో భద్రయ్య, పుష్పలత, విజయ, వసుమతి, శ్రీలత, అనిత, సుశీల, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలని మోసం చేయడం తప్ప చేసేది ఏమీ లేదు

● మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

ప్రజావాణి న్యూస్ లక్షేట్టిపేట, సెప్టెంబర్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు విమర్శించారు. గురువారం స్థానిక ఐబి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బీ ఆర్ ఎస్ నాయకులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె నెక్కడానికి అనేక రకాల హామీలిచ్చి, ఇప్పుడు ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతకాని ప్రభుత్వం అని విమర్శలు గుప్పించారు. మూడు నెలల్లో హామీలు అమలులోకి వస్తాయని చెప్పి, 33 నెలలు గడిచిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, మళ్ళీ కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు ఇలాంటి మోసపురిత స్కాములు జరగవని అన్నారు. మళ్ళీ మాజీ సీఎం కేసీఆర్ అధికారం చేపడితేనే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. ఈ ప్రభుత్వం రైతులను, నిరుద్యోగులను, కార్మికులను అందరినీ మోసం చేస్తుందని విమర్శించారు. దోచుకోవడం, దాచుకోవడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందన్నారు. మహిళలకు ప్రతి నెల రూ. 2500 లతో పాటు కల్యాణ లక్ష్మీలో తులం బంగారం ఇస్తామని ఆశ పెట్టి ఓట్లు వేయించుకున్నారని ఏద్దేవా చేశారు. ప్రజలు కాంగ్రెస్ పాలనలో అన్ని రకాలుగా నష్టపోయారని, ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయకుంటే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం వంటవార్పు నిర్వహించి ప్రభుత్వం విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డీసీ ఎమ్మెస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, నాయకులు అంకతి గంగాధర్, తిరుపతి, అంకతి రమేష్, రవిలతో పాటు లక్షేట్టిపేట, దండేపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

● మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఘనంగా నిర్వహించాలి, వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి అధికారులకు సూచించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి తో కలిసి డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై, 25న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గణేష్ శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడింగ్, విద్యుత్ దీపాలు , సి సి కెమెరాలు, మొబైల్ టాయిలెట్లు, తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువుల దగర శుభ్రంగా ఉంచుతూ, నిరంతర పారిశుద్యం ఉండేలా, ఎప్పటికప్పుడు చెరువులను శుభ్రం చేస్తూ తగినంత పార్కింగ్ స్థలం ఉండేలా చెర్యలు తీసుకోవాలి అని సంబంధిత శాఖల అధికారులను కోరారు.మునిసిపల్ అధికారులు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రతి వినాయక మండపాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, కనెక్షన్లు తదితర అంశాలను విద్యుత్ శాఖ నిపుణుల సహకారంతో తనిఖీ చేయాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటు ప్రదేశాలను సురక్షితంగా ఎంపిక చేసి, అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని, మండపాల నిర్మాణం పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఉత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల వద్ద పరిశుభ్రత, ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సూచించారు.విగ్రహాల ఊరేగింపు సమయంలో వాహనాల్లో యాంత్రిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని, నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు తదితర ప్రమాదకర అంశాలను తొలగించాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఆర్అండ్బీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎక్కడైనా ఎప్పుడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి ప్రమాదాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ కోరిన విదంగా క్షేత్ర స్థాయిలో తలెత్తే సమస్యల పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీఓలు వెంకట్ రెడ్డి, శ్యామ్ ప్రకాష్, డిప్యూటీ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హామీల జాడేది..? పాలన గాడి తప్పిందా..?

- చెన్నారావుపేటలో అశోక్ యాదవ్ నేతృత్వంలో హోరెత్తిన రాస్తారోకో
- రైతులు,మహిళలను మోసగించిన రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి!
- హామీలు నెరవేర్చే వరకు గ్రామ గ్రామాన ఉద్యమిస్తాం.. జక్కా అశోక్ హెచ్చరిక

చెన్నారావుపేట సెప్టెంబర్ 03 ప్రజావాణిఎన్నికల ముందు హామీల వర్షం.. అధికారంలోకి వచ్చాక అమలులో మాత్రం నిశ్శబ్దం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పై బిఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు.. గురువారం చెన్నారావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్కా అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నర్సంపేట నెక్కొండ ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

హామీలతో గద్దెనెక్కి.. అమలులో చేతులెత్తేశారా?

ఈ సందర్భంగా జక్క అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు కావస్తున్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అనేకం అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజలకు ఆశలు చూపించి అధికారంలోకి వచ్చారని, ప్రస్తుతం ప్రజల సమస్యలను గాలికి వదిలేసి పట్టించుకోవడంలేదని విమర్శిస్తూ మండిపడ్డారు. షాదీ ముబారక్ కు తులం బంగారం, రైతు భరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ, మహిళలకు స్కూటీలు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 2500, ఆసరా పింఛన్లు, భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి 12,000 అని ప్రకటించి 12 పైసలు కూడా జమ చేయలేదని, మహిళల స్కూటీలు ఇంకా రోడ్డు ఎక్కలేదా? అంటూ హామీలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం పంటలకు అవసరమైన యూరియాను కూడా సక్రమంగా అందించలేకపోతుందని అశోక్ విమర్శించారు. యూరియా కోసం ప్రత్యేక యాప్ తీసుకొచ్చినా రైతుల కష్టాలు తీరడం లేదన్నారు. యాప్ లో నిల్వలు కనిపించకపోయినా గోదాముల్లో నిల్వలు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు అందాల్సిన బోనస్ సొమ్ము కలగానే మిగిలిపోయేలా పెండింగ్ లోనే ఉందని అన్నారు. రైతు సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికి వదిలేసిందని, ఈ ప్రభుత్వానికి ముందుంది ముసళ్ళ పండుగ అని వ్యాఖ్యానించారు. రైతులు, మహిళలు, నిరుపేదల హక్కుల కోసం బీఆర్ఎస్ ఎప్పటికి వెనక్కి తగ్గదని జక్కా అశోక్ యాదవ్ స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ధర్నాతో నర్సంపేట నెక్కొండ ప్రధాన రహదారిపై కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేష్ రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి ధర్నాను విరమింపజేసి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ నాయకులు, యూత్ నాయకులు, రైతులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ క్రీడలు -- 2026--27

పెద్దవంగర సెప్టెంబర్ 03 ప్రజావాణి మహబూబాబాద్ డి ఈ ఓ ఆదేశానుసారం, పెద్దవంగర మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ క్రీడా పోటీలు నిర్వహణకు గాను జెడ్ పి హెచ్ ఎస్ పెద్ద వంగర పాఠశాలలో ఎం ఈ ఓ బుదారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కంచెర్ల ప్రభాకర్ మరియు ఆవుతాపురం వ్యాయామ ఉపాధ్యాయుడు బొజ్జ సురేందర్ సమావేశంలో పాల్గొని మండల స్థాయి స్కూల్ గేమ్స్ గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ మాట్లాడుతూ ఈ క్రీడలు 08-09-2026న జెడ్ పి హెచ్ ఎస్ పెద్ద వంగర పాఠశాల లో నిర్వహిస్తున్నాం అని తెలియజేయడం జరిగింది. ఈ పోటీలలో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడలలో 14 మరియు 17 సంవత్సరాల లోపు బాల బాలికలకు సెలక్షన్స్ జరుపబడును. కావున పెద్దవంగర మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల, కేజీబీవీ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు పి ఈ టి /పి డి /ఇంచార్జ్ ఉపాధ్యాయులు తమ పాఠశాలల నుండి ఎంపికైన విద్యార్థిని/విద్యార్థులను నిర్ణీత సమయానికి మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ క్రీడా పోటీలకు పంపించవలసిందిగా సూచించడమైనది. అలాగే పాఠశాల పీడీ ప్రభాకర్ మాట్లాడుతూవిద్యార్థులు క్రీడా దుస్తులు, అవసరమైన క్రీడా సామగ్రితో పాటు తగిన ఏర్పాట్లతో హాజరయ్యేలా చూడాలి. విద్యార్థుల యొక్క డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ కచ్చితంగా తీసుకురావాలీ అని తెలిపారు. ఇందులో క్రీడాకారులకు 01/01/2013 పైన ఉన్నవారు యు/14 Age 01/01/2010 పైన ఉన్నవారు యు/17 గా నిర్ణయించబడినది. దీని ప్రకారం విద్యార్థులను తీసుకుని రావాలని పీడీ తెలియజేశారు. కావున పీఈటి /పి డి /ఇంచార్జ్ ఉపాధ్యాయులు డేట్ ఆఫ్ బర్త్ చూసుకుని ఉదయం 9 గంటలకు జెడ్ పి హెచ్ ఎస్ పెద్దవంగర పాఠశాలకు తీసుకురావలసినదిగా తెలియజేశారు.

'దారి లేదు' అనడం చెల్లదు.. ప్రభుత్వ రికార్డులతో నక్షా తేల్చాలి!

- రైతుల బాట సమస్యపై ఎంపీడీవోకు వినతి
- గతంలో ప్రభుత్వ నిధులతో పనులు జరిగిన ఆధారాలున్నాయి: హక్కుల నాయకులు

చెన్నారావుపేట సెప్టెంబర్ 03 ప్రజావాణిచెన్నారావుపేట మండలంలోని ఎల్లయ్యగూడెం--మాధవ్‌నగర్--తిమ్మరాయినిపేట--శాంతినగర్ సరిహద్దుల్లోని వ్యవసాయ బాట సమస్యపై అధికారులు సాకులు చెప్పడం మాని, ప్రభుత్వ రికార్డులు పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని హక్కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చెన్నారావుపేట ఎంపీడీవోను కలిసి ఈ సమస్యపై పత్రాలు, పక్కా ఆధారాలను సమర్పించారు.?ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ--ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మెంబర్ పాలకుర్తి విజయ్ కుమార్, రాత్రికి రాత్రి దారులు మాయం కావని, ప్రభుత్వ రికార్డుల ఆధారంగానే వాస్తవాలు తేలాలని కోరారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెం వీరేందర్ రెడ్డి, అధ్యక్షుడు కాట కుమారస్వామి మాట్లాడుతూ..సదరు మార్గంలో గతంలో ఎంపీపీ నిధులు, ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి రోడ్డు పనులు చేపట్టిన దాఖలాలు ఉన్నాయి.జల్లి గ్రామ శివారులో 70కి పైగా, ఎల్లయ్యగూడెం పరిధిలో 52కి పైగా వ్యవసాయ కరెంట్ మోటార్ల డీడీల వివరాలు అందుబాటులో ఉన్నాయి. అసలు ఆ మార్గం ప్రభుత్వ రాకపోకల బాటనా? లేదా ఇతర హక్కుల పరిధిలోనిదా? అనేది గ్రామ నక్షా, సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డుల ద్వారా అధికారులు స్పష్టం చేయాలి.

ప్రజా బాహుళ్యంలో ఉంచాలి: గతంలో పనులు జరిగి ఉంటే---ఏ నక్షాతో మంజూరయ్యాయి, ఎంత మొత్తం ఖర్చయింది, ఎన్ని రోజులు పనులు చేశారనే వివరాలను పారదర్శకంగా ప్రజలకు వెల్లడించాలి. వినతిపత్రం తీసుకున్న ఎంపీడీవో తక్షణమే స్పందిస్తూ... ఎల్లయ్యగూడెం గ్రామ కార్యదర్శిని పిలిపించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి దారి సమస్యపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ వ్యవహారంపై వరంగల్ జిల్లా కలెక్టర్, జెడ్పీ అధికారులు దృష్టి సారించి రైతులకు శాశ్వత న్యాయం చేయాలని నాయకులు కోరారు.

ముందస్తుగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

రాయికల్, సెప్టెంబర్ 03 (ప్రజావాణి): రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని విద్యార్థులకు శ్రీకృష్ణుడి చిత్రపటం గీయడం, "కృష్ణుడి బోధనలు – విద్యార్థి జీవితంలో వాటి ప్రాముఖ్యత" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.శ్రీకృష్ణుడి బోధనల్లోని కర్తవ్యనిష్ఠ, ధైర్యం, ఏకాగ్రత,నిజాయితీ వంటి విలువలను విద్యార్థులు తమ జీవితంలో ఆచరించాలని ఉపాధ్యాయులు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జూపల్లి వేణుగోపాల్ రావు, జూపల్లి మాధవి రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

వశిష్ట పాఠశాలలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి..
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పెద్దపల్లి సెప్టెంబర్ 3 ప్రజావాణి :పోత్కపల్లి లో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పోత్కపల్లి గ్రామంలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రత్యేకంగా ముస్తాబై పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. చిన్నారుల అందమైన వేషధారణలు, చక్కటి అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వేడుకలకు వచ్చిన తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుని జన్మదిన విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించే విధంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం చిన్నారుల కృష్ణ, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థులను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. తమ పిల్లలు వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తల్లిదండ్రులు ఆసక్తిగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాలలో ఇటువంటి పండుగల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తల్లిదండ్రులు పేర్కొన్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను చిన్నారులకు తెలియజేయడంతో పాటు, మన సంస్కృతిపై వారికి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు సంస్కృతి, కళలు, సంప్రదాయాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగానే జన్మాష్టమి వేడుకలను పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించినట్లు తెలిపారు.వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పిల్లలను ప్రోత్సహించారు. విద్యార్థుల చక్కటి ప్రదర్శనలను చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని అభినందించారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. చిన్నారుల కృష్ణ, గోపికల వేషధారణలు,సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మ్యాదగోని కిషన్తో పాటు ఉపాధ్యాయులు దివ్య, రమాదేవి, రాజమల్లు, శివకుమార్, యాకూబ్, స్వరూప, స్వాతి, బి. సుజాత, పి. సుజాత, చంద్రకళ, కోమల పాల్గొన్నారు.విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేశారు.

పదేళ్లలో చేయలేనిది.. ప్రజా పాలనలో సాధ్యమైంది:

-పల్లె గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్

ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్ 03 (మన సమగ్ర ప్రజావాణి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూసిన పేద కుటుంబాల కలను ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని పల్లె గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసి, 61 లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చిందని తెలిపారు.ఆర్మూర్ మండలంలోని పల్లె (హరిపూర్) గ్రామంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 1.06 కోట్ల రేషన్ కార్డులను స్మార్ట్ రేషన్ కార్డులుగా మార్చి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు. పేదల ఇళ్లలో సన్నబియ్యంతో కడుపు నింపి, నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. పేదలు, నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుంకపక రవి, జీపీ ఓ జక్కా శ్రవణ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్క రంజిత్, పంచాయతీ కార్యదర్శి రాణా తరుణ్, విడీసీ అధ్యక్షుడు రాకేష్, కోశాధికారి సాయగౌడ్, రామాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు నర్సయ్య, రేషన్ డీలర్ గణేష్, కొంపల్లి సుధాకర్, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనకు ప్రజల బ్రహ్మరథం: 1000 రోజుల పాలనపై చర్చకు సిద్ధమా?

- ఘనంగా కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విజయోత్సవం
- రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి పెద్దపీట: నరాల కొండారెడ్డి
- 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనపై చర్చకు సిద్ధం: నందిరెడ్డి ఇంద్రారెడ్డి

చింతలపాలెం: సెప్టెంబర్ 3 (ప్రజావాణి)తెలంగాణలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చింతలపాలెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సమావేశం ఘనంగా జరిగింది.

?ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరాల కొండారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, విద్య మరియు వైద్య రంగాల పటిష్టతకు విశేష కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తూ పేదరికం లేని సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తోందని పేర్కొన్నారు.అనంతరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే, కాంగ్రెస్ ప్రజా పాలన సాధించిన సంక్షేమం, అభివృద్ధి ఎంతో గొప్పదని స్పష్టం చేశారు. మండల పరిధిలో జరిగిన అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకత్వానికి ఆయన బహిరంగ సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు చెన్నకేశ వెంకయ్య, లకావత్ సైదులు, కరణం హనుమయ్య, అమెరున్ బి దాదాబుడే, మాలావత్ శారద సామ్య నాయక్, ఉప సర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు చిలకల శ్రీనివాసరెడ్డి, కాకునూరి హనిమిరెడ్డి, మోర్తాల సీతారెడ్డి, వేములూరి రంగాచారి, షేక్ మతిన్, షేక్ జానీమియా,వాంకుడోత్ హుస్సేన్,పరిమి రాంబ్రహ్మం, చింతిరాల సురేందర్, షేక్ మునాఫ్, చింతిరాల రవీందర్, శ్రీను, కిరణ్, అంజితో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ జాతర మహోత్సవం

- రాజకీయాలకు అతీతంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

?చింతలపాలెం సెప్టెంబర్ 3 (ప్రజావాణి) మండల కేంద్రంలో ముత్యాలమ్మ జాతర గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. సీపీఎం, టీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సమన్వయంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.?ఈ జాతర మహోత్సవానికి గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనంతమ్మ పుల్లయ్య, మాజీ సర్పంచ్ సుందర మల్లేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ మహత్యం, 1వ వార్డు సభ్యుడు వై. రామిరెడ్డి, 6వ వార్డు సభ్యుడు షేక్ మస్తాన్ పాల్గొన్నారు.అలాగే టీడీపీ నాయకుడు పొదల కొండలుతో పాటు ప్రముఖ నాయకులు పల్లె రమేష్ రెడ్డి, ఎర్రం లక్ష్మారెడ్డి, తన్నీరు శీను, యరబోలు నరేందర్ రెడ్డి, పలువురు సీపీఎం, టీఆర్ఎస్ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సర్పంచ్ బోడ రవి నాయక్

చెన్నారావుపేట సెప్టెంబర్ 03 ప్రజావాణి అన్ని రకాల పోషక విలువలు సమతులంగా ఉండే ఆహారాన్ని తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ధర్మతండ గ్రామ సర్పంచ్ బోడ రవి నాయక్ తెలిపారు. మండలంలోని ధర్మతండ గ్రామపంచాయతీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బోడ రవి నాయక్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో ఆకుకూరలు, పాలు, పండ్లు, గుడ్లు వంటి పోషకాలు మెండుగా ఉండే ఆహారాన్ని భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం జరిపించారు.?ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చిత్తరంజన్, వార్డు సభ్యురాలు సాలమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి, అంగన్వాడీ టీచర్లు సుజాత, కవిత, సుగుణ, ఆశా వర్కర్లు సాలమ్మ, నిర్మల, శ్రీలత, లలిత తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా అంగరంగ వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- చిన్నారులు గోపిక శ్రీకృష్ణుని వేషధారణలో నృత్యాలు చేస్తూ అందరిని విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా
- కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు

జమ్మికుంట సెప్టెంబర్ 3 (ప్రజావాణి) జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక శ్రీకృష్ణుని వేషధారణలో కోలాటాలు పట్టుకొని పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ అందరిని విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు పోటీపడి ఉట్టిని కొట్టారు. పుట్టిన కొట్టిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ప్రతి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడంతోపాటు ఆ పండుగల యొక్క విశిష్టతలను విద్యార్థులకు తెలిసేలా చేయడం జరుగుతుందని విద్యార్థుల ను తయారు చేసేందుకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బలరాం కుమారిరేఖ ,శైలజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతీ విద్యామందిర్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు 03(మన సమగ్ర ప్రజావాణి): ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీ సరస్వతీ విద్యామందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, హావభావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థులు శ్రీకృష్ణుని జననం, బాల్య లీలలు, గోవర్ధనగిరి ఘట్టం తదితర అంశాలను నృత్య రూపకాలు, నాటికలు, భక్తిగీతాల ద్వారా ప్రదర్శించారు. అలాగే శ్రీకృష్ణుడి వేషధారణ పోటీలు, శ్లోకాల పఠనం, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు చిన్నతనం నుంచే తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకృష్ణుని జీవితం నుంచి ధర్మం, సత్యం, ధైర్యం, కర్తవ్యబద్ధత వంటి విలువలను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. అనంతరం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 'గోవిందా.. గోపాలా' నామస్మరణతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో మందకృష్ణ మాదిగ భారీ బహిరంగ సభ

- మాదిగ అభ్యున్నతికి కృషి చేస్తాం.. బెజ్జంకిలో త్వరలో సభ నిర్వహిస్తాం:
- మందకృష్ణ మాదిగ

బెజ్జంకి, సెప్టెంబర్ 3 (ప్రజావాణి) హైదరాబాద్‌లోని తన నివాసంలో మందకృష్ణ మాదిగను బెజ్జంకి మండలానికి చెందిన MRPS, MSPనాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ బెజ్జంకి మండల ఇన్‌చార్జి చింతకింది పర్శరాములు మాదిగ, నూతన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జేరుపోతుల మధు మాదిగ, ఎంఎస్పీ బెజ్జంకి మండల అధ్యక్షులు వడ్డూరి పర్శరాములు మాదిగ, సీనియర్ నాయకులు మంకాల ప్రవీణ్ మాదిగ తదితరులు మందకృష్ణ మాదిగను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగను బెజ్జంకి మండలాన్ని సందర్శించాలని నాయకులు కోరారు. స్పందించిన ఆయన, అమరావతిలో నూతన మండల అధ్యక్షులతో జరిగే జాతీయ సమావేశం అనంతరం బెజ్జంకి మండలంలో మాదిగల అభ్యున్నతి కోసం భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మందకృష్ణ మాదిగ సూచించినట్లు నాయకులు తెలిపారు.

ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై క్షేత్రస్థాయి పరిశీలన...

- అధికారులను ఆదేశించిన ఎస్ఐర్ అబ్జర్వర్ విజయేందిర బోయి.
- హాజరైన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.

సెప్టెంబర్ 03 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ 2026లో భాగంగా నోటీసుల జారీ , విచారణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభి వృద్ధి శాఖ కార్యదర్శి , జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి అధికారులను ఆదే శించారు. గురువారం రోజు సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తోకలసి ఎస్ఐర్ అబ్జర్వర్ విజయేందిర బోయి పరిశీలించారు. 2026లో భాగంగా నోటీసులు జారీ చేయడం , విచారణ (హీరింగ్) నిర్వహించే ప్రక్రియ 17.08.2026 నుండి 16.09.2026 వరకు కొనసాగనున్న నేపథ్యంలో జిల్లాలోని 94-భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి మండలం , అనంతారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 11 , 12 లను సందర్శించారు. ఈ సందర్భంగా అబ్సర్వర్ నోటీసులు అందుకున్న ఓటర్లతో నేరుగా మాట్లాడి , నోటీసులు జారీ చేయడానికి గల కార ణాలు , విచారణ సమయంలో సమర్పించాల్సిన పత్రాలు , తదితర అంశాలపై వారికి సరైన సమాచారం అందిందా లేదా అని ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ , సవరణ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం నోటీసుల పరిష్కారం , విచారణ ప్రక్రియలో నిమగ్నమైన బూత్ స్థాయి అధికారులు , బిఎల్ఓ సూపర్‌వైజర్లు , ఏఈఆర్ఓ లు నిర్వహిస్తున్న పని తీరును ఆమె సమీక్షించారు. ప్రతి నోటీసును నిబంధనల ప్రకారం పరిశీలించి , అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా లో కొనసాగించేలా , అనర్హత ఉన్నసందర్భాల్లో తగిన ఆధారాలతో నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా , నిష్పక్షపాతంగా, నిబంధన లకు అనుగుణంగా నిర్వ హించాలని ఆదేశించారు. ఈ సమావేశంలోరెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి , ఈఆర్ఓ , జగన్ మోహన్ ప్రసాద్ , ఏరోప్లేన్,ప్రణయ్ కుమార్, ఏఈఆర్ఓ/ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన సిగ్గుచేటు: సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్

చెన్నారావుపేట సెప్టెంబర్ 03 ప్రజావాణి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిరసనలు చేపట్టడం సిగ్గుచేటని చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ ధ్వజమెత్తారు. గురువారం చెన్నారావుపేట సొసైటీ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతుల నడ్డి విరిచారని, వరి వేస్తే ఉరే అని బెదిరించిన ఘనత కేసీఆర్‌దేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి అండగా నిలిచిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిట నాలుగేళ్లలో రూ.25 వేల చొప్పున విడతలవారీగా అరకొరగా ఇస్తే, అవి వడ్డీలకే సరిపోయాయని ఎద్దేవా చేశారు. ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు, ఇంటికో ఉద్యోగం, ప్రతి నిరుపేదకు డబుల్ బెడ్రూం ఇల్లు, ఎస్సీలకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి బీఆర్ఎస్ మోసం చేసిందని దుయ్యబట్టారు.?రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని గోపాల్ నాయక్ పేర్కొన్నారు.?15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 3.38 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించడమే కాకుండా, స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నామని చెప్పారు.?కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేసి, మొత్తం 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్నామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని, అలాగే విఓ భవనాలను మంజూరు చేశామని తెలిపారు.?ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఆవుల రాములు, వట్టే స్వరూప, తిరుపతి రెడ్డి, నర్సింహారావు, ననుమాస వీరస్వామి, ఉప సర్పంచ్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వ కు నీటిని విడుదల చేయాలి

- 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై 2వ రోజు బగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు రైతులు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే గద్దె దిగిపోండి.
- రైతులు గోస పడుతున్న పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం.
- పెద్దవంగర మండలం సబ్ కెనాల్ నుండి కిష్టు తండా వరకు రైతులతో కలిసి ఎండిపోయిన ఎస్ ఆర్ ఎస్ పి పేజ్ 2 కాలువ వెంబడి పాదయాత్ర కార్యక్రమం నిర్వహించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి.

పెద్దవంగర, సెప్టెంబర్ 03 ప్రజావాణి ఎస్సారెస్పీ కాలువ ద్వారా చెరువులకు సాగు నీరు అందించాలని, కండ్ల ముందే వందల ఎకరాలు సాగు చేయకుండా పొలాలను రైతులు పక్కన పెట్టిన, అలాగే వరి సాగు వేసిన వారికి సాగు నీరు అందక ఎండిపోతున్న కూడా ఈ ప్రభుత్వానికి సాగు నీరు విడుదల చేసి ఆదుకోవాలనే చిత్త శుద్ధి లేదని మండిపడ్డారు. కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలకు సాగు నీరు అందించాలని పెద్దవంగర మండలం సబ్ కెనాల్ నుండి కిష్టు తండా వరకు రైతులతో కలిసి ఎండిపోయిన ఎస్ ఆర్ ఎస్ పి పేజ్ 2 కాలువ వెంబడి పాద యాత్ర కార్యక్రమం చేపట్టిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.అనంతరం మాట్లాడుతూ మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. వర్షాకాలంలో కాలువ వస్తుందనే ఆశతో రైతులు వరి నాట్లు వేశారని ఇప్పుడు నీరు రాకుంటే రైతులకు ఎకరాకు 25 వేల రూపాయలు నష్టం వాటిల్లితుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వరి నాట్లు వేసిన రైతుల పంటలు ఎండి పోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న ప్రభుత్వం నీరు విడుదల చేయొద్దని తెలిపారు అని చెప్తున్నారు. రోజుకో సభ పేరు ప్రజల సొమ్ము గుల్ల చేసుడు తప్ప రైతులకు ఏమి చెయ్యాలో తెలియని వ్యక్తి సిఎం గా ఉండడం సిగ్గుచేటన్నారు. పంట కోసం పెట్టిన పెట్టుబడులు రైతులకు భారంగా మారాయని తెలిపారు. రైతుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని, సాగునీరు అందించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు.రైతు బంధు ఎగగొట్టి ఇప్పటికే ఈ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తుంది.యూరియా దొరకక, కరెంట్ కష్టాలతో ఇప్పటికే రైతులు ఆగం అతున్నారు.పంట రుణమాఫీ సరిగ్గా జరగక మోసపోయిన రైతులను మళ్ళీ రైతు భీమా ఎగగొట్టి మళ్ళీ రైతులను మోసం చేసే కుట్ర జరుగుతుంది పంటలకు నీళ్ళుస్తే పంటలు పండి కెసిఆర్ కి పేరు వస్తుంది అని పండిన పంటకు బోనస్ ఇయ్యాల్సివస్తుంది అని రైతుల పొట్ట కొట్టె ప్రయత్నం ఈ మోస పూరిత కాంగ్రెస్ చేస్తుంది.ఇప్పటికై ఈ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని రైతులను ఆదుకొక పోతే తగిన మూల్యం చెల్లించక తప్పదు.పేదింటి ఆడబిడ్డ పెళ్లి కుటుంబానికి భారం కాకూడదనే దృఢ సంకల్పంతో బాల్యవివాహాలు తగ్గాలని మేనిఫెస్టో లో పెట్టకున్న కుటుంబ పెద్దగా ఆలోచించి కల్యాణ లక్ష్మి పథకం పెట్టింది కెసిఆర్ అయితే ఎన్నికల వేల లక్ష తోపాటు తులం బంగారం అని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఈ పథకం మే నిలిపి వేయాలని కుట్ర పన్నుతుంది.అందులో భాగంగానే హై కోర్ట్ లో కల్యాణ లక్ష్మి పథకం పై స్టే విధిస్తే 4 వారలైన కనీసం కౌంటర్ కూడాశ్రీ వేయలేని స్థితి లో ఈ ప్రభుత్వం ఉంది కల్యాణ లక్ష్మి పథకం అమలు అయితే కెసిఆర్ కే పేరు వస్తుంది మళ్ళీ మహిళలు తులం బంగారం అడుగుతున్నారు అని ఈ పథకంమే లేకుంటే బాగుంటుంది అని ఈ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం పన్నిన కుట్ర ఇది.కెసిఆర్ కిట్టు,కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను కొనసాగిస్తూ తులం బంగారం ఇవ్వకపోతే మహిళలే తన్ని తరుముతారు తస్మాత్ జాగ్రత్త.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పెద్దవంగర మండల నాయకులు, ఆయా గ్రామాల రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ను నిర్ధారించే ప్రక్రియ ను వేగవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి సుదర్శన్ రెడ్డి

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 3 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్-2026 నోటీసుల హియరింగ్,పరిష్కారం ఖచ్చితమైన ఓటర్ను నిర్ధారించే ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి.ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ బద్రపరిచిన గోదామును వివిద రాజాకీయా ప్రతినిధులు , అదనపు ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి తనికి చేశారు.అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ నోటీసుల హియరింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం నర్సశీపల్లి, కీసర మండలం, మునీరాబాద్, మేడ్చల్ మండలం, దొమ్మర పోచంపల్లి, దుండిగల్ మండలం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరిణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైసర్లను, బిఎల్ఓలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. జిల్లాలో మ్యాప్పింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు మరియు ఓటర కార్డ్ లో ఉన్న వృత్ కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నోటిస్ అందిన ఓటర్లు హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలన లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డిఒ లు వెంకట రెడ్డి, శ్యామ్ సుందర్, ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సన్న వరి సాగు నమోదు10లోపు చేసుకోవాలి..

ప్రజావాణి,ఇనుగుర్తి: ప్రభుత్వం నిర్దేశించిన 7రకాల సన్న వరి వంగడాల సాగు వివరాలను ఈ నెల 10 లోపు రైతులు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ యాస్మిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్ వద్ద కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ ద్వారా పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల వద్ద ఉన్న స్వంత విత్తనాలను సాగు చేసినట్లయితే రైతు ధృవీకరణ పత్రం తీసుకువెళ్లి సంబంధిత ఏ ఈ వో ల వద్ద సాగు వివరాలను నమోదు చేసుకోవాలని ఎంఏవో తెలిపారు. మండలంలో 4560 మంది రైతులు ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాల వరి విత్తనాల సాగుకు పాల్పడగా ఇప్పటివరకు కేవలం 750 మంది రైతులే ఆన్లైన్ నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. సన్న రకాల వరి సాగు చేసే రైతులు ఆన్ లైన్ లో తమ పంటల వివరాలను నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం అందించే క్వింటాకు రూ. 500 బోనస్ అర్హులవుతారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో అనర్హులవుతారని పేర్కొన్నారు.

రుణమాఫీ ఏది రైతు బందు ఏది ప్రభుత్వాన్ని నిలదీసిన హరీష్ రావు

కొడిపల్లి.సెప్టెంబర్ 03 ప్రజావాణి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు, దాదాపు 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు.గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొడిపల్లి బస్టాండ్ సమీపంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు చేపట్టిన నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

420 అడుగుల ఫ్లెక్సీతో ప్రత్యేక ఆకర్షణ

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చి అమలు కాని 420 హామీలను ఏకంగా 420 అడుగుల పొడవైన భారీ ఫ్లెక్సీపై ముద్రించి బస్టాండ్ నుంచి ప్రధాన రహదారి వరకు ప్రదర్శించారు. “మోసపూరిత హామీలు – మోసపోయిన ప్రజలు” అంటూ నినాదాలు చేశారు. ఈ ఫ్లెక్సీని చూసేందుకు స్థానికులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

హరీష్ రావు మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 33 నెలలు అవుతోంది. ఇప్పటివరకు ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదు. రైతులకు

రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి కూడా చేయలేదు. రైతుబంధు ఎగ్గొట్టారు, రైతుభీమా లేకుండా చేశారు. నిన్నటి వరకు ఎరువు దుకాణం ముందు క్యూలో నిలబడ్డ రైతు, నేడు యూరియా కోసం ఆన్లైన్ బుకింగ్, యాప్ అంటూ తిప్పుకుంటున్నారు. బ్లాక్ మార్కెట్ లో రూ.400 బస్తాను రూ.600కు కొనే దుస్థితి తెచ్చారు. పొలాల్లో రైతుల కళ్ళల్లో కన్నీళ్ళు కనిపిస్తున్నా ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ఉద్యోగులను, రిటైర్డ్ ఉద్యోగులను కూడా జీతాలు, పెన్షన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని గతంలో ఆరోపణలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మాట మార్చిందని సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై

విమర్శలు చేయడమే సీఎం రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, రైతుబంధు సమితి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా రాయికల్ వాసి ఎంపిక

రాయికల్, సెప్టెంబర్ 03 (ప్రజావాణి):రాయికల్ పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, శాతవాహన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగ ప్రొఫెసర్ డాక్టర్ పడాల తిరుపతి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందించే ప్రతిష్టాత్మక పురస్కారానికి ఆయన ఎంపిక కావడం రాయికల్ ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈ నెల 5న రాష్ట్ర రాజధానిలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆయన పురస్కారం అందుకోనున్నారు. వృక్షశాస్త్రంలో ఆయన చేసిన పరిశోధనలు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు, విద్యా రంగంలో ఆయన నిబద్ధతను గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది.రాయికల్ పట్టణంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు యూనివర్సిటీ స్థాయిలో ప్రొఫెసర్‌గా ఎదిగిన డాక్టర్ తిరుపతి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. బోధనలో వినూత్న పద్ధతులు, విద్యార్థులతో మమేకమై వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఆయన ముందుంటారు.డాక్టర్ పడాల తిరుపతి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక కావడం పట్ల రాయికల్ మండల విద్యా శాఖ అధికారి శ్రీపతి రాఘవులు, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సేవా విభాగం కన్వీనర్ చెరుకు మహేశ్వర శర్మ, టీఆర్టీయూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ముక్కెర శేఖర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొల్లూరి రాజేందర్,ఎద్దండి రమేష్, పుర ప్రముఖులు, పాత విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రాయికల్ ప్రాంతం నుండి ఒక వ్యక్తి రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందడం ఎంతో గర్వకారణమని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల పార్టీ నాయకులు కార్యకర్తల విజయోత్సవాలు

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సెప్టెంబర్ 03 (ప్రజావాణి న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి1,000 రోజులు పూర్తైన సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కీలక అభివృద్ధి కార్యక్రమాలు ఊహించని స్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాల పట్ల పార్టీనాయకులు కార్యకర్తలు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకుపాలా భిషేకం చేసి ఉత్సవాలు జరిపారు. తుర్కయంజాల్ చెరువుకట్ట వద్ద మున్సిపల్ కార్యాలయం ముందు అంబేద్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ మల్ రెడ్డి,

అనురా ధారాంరెడ్డి, నేతృత్వంలో పార్టీ నేతలు వేడుకలు నిర్వహించారు. ఆదిభట్లలో సీఎం ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అటు మంచాల మండల కేంద్రంలో పార్టీనాయకులు కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు పదేళ్ల కుటుంబ నిర్బంధ బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ప్రజలుస్వేచ్ఛగా జీవించలేని గడీల పాలనకు విముక్తి లభించి వెయ్యి రోజులు గడిచిందని కాంగ్రెస్ నేతలు అన్నారు. పోలీసుల నిర్బంధాలు ఆంక్షలు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు ప్రియతమ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగా రెడ్డి సారథ్యంలో నియోజకవర్గానికి అగ్ర తాంబూలం మల్‌రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని కాంగ్రెస్ నేతలు తెలిపారు గత దశాబ్దానికి పైగా కాలంగా ఇక్కడి నుంచి గెలిచినవారు తమ స్వార్థ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేని విధంగా ఇబ్రహీంపట్నం ప్రాంతానికి నిధులు తెచ్చి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా మల్‌రెడ్డి రంగా రెడ్డి మార్చుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రె స్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్, సీనియర్ నేతలు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ పాండు రంగారెడ్డి, బి బ్లాక్ ప్రెసిడెంట్ భాస్కరాచారి, మహిళా నేతలు కొత్తకుర్మ మంగమ్మ, గుండమోని జయమ్మ ఇబ్రహీంపట్నం మంచాల మండలాల పార్టీ అధ్యక్షులు రవాణమోని లింగం ముదిరాజ్, ఎడ్మ నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం టౌన్ పార్టీ అధ్యక్షులు గౌస్‌పాష, డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్, ఐలయ్య, రజినీకాంత్, యూత్‌కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు సికిందర్‌రెడ్డి, అయన్‌పటేల్, కౌ న్సిలర్లు, వివిధ గ్రామాలు సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పా ల్గొన్నారు.

గజ్వేల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు....

- **అండర్--14, అండర్--17 విభాగాల్లో ఉత్సాహంగా టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్....**

రాయపోల్, /సిద్ధిపేట్ సెప్టెంబర్ 03(ప్రజావాణి) గజ్వేల్ మండల స్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ అండర్--14, అండర్--17 బాలురు, బాలికల క్రీడా పోటీలు గజ్వేల్ మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. గజ్వేల్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.కబడ్డీ, ఖోఖో తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు హోరాహోరీగా తలపడుతున్నారు. ముఖ్యంగా జీడీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నారు. ఆటగాళ్ల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో క్రీడా మైదానం సందడిగా మారింది.ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి, తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అధ్యాపకులు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడం, వారిలో పోటీతత్వం మరియు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా ఈ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల ఉపాధ్యాయులు, క్రీడా అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత ఉపాధ్యాయులు, క్రీడా సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

- **భారీ నిరసన కార్యక్రమం**
- **భారీ నిరసన రైతులు మహిళలు యువతకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్**

జమ్మికుంట సెప్టెంబర్ 3 (ప్రజావాణి)కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు రెండువేల మంది పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారుకాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు,420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారుకాంగ్రెస్ బాకీ కార్డును ప్రజలకు పంపిణీ చేస్తూ అమలు కాని హామీలపై విస్తృత అవగాహన కల్పించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు దేవాలయాల్లో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందజేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పి నేడు వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు100 రోజుల్లో అమలు అంటూ ప్రజలను నమ్మించి ఇప్పుడు మాట తప్పారనిఆరోపించార ురాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, యూరియా కొరత, రైతు సంక్షేమ పథకాల నిర్లక్ష్యం,

సాగునీటి విషయంలో ప్రభుత్వ వైఫల్యం రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచాయని అన్నారు. రైతు భరోసా రూ.2 లక్షల రుణమాఫీ వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి హామీలు అమలు కాక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారుఅలాగే మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం తులం బంగారం విద్యార్థినులకు ఉచిత స్కూటీలు వృద్ధులు వితంతువులు దివ్యాంగులకు పెంచిన పింఛన్లు నిరుద్యోగ భృతి విద్యా భరోసా కార్డులు రెండు లక్షల ఉద్యోగాలభర్తీ వంటి కీలక హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారురైతులు మహిళలు యువత విద్యార్థుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని పేర్కొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజక వర్గ వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారుఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు

బండ శ్రీనివాస్, వాల బాలకిషన్ రావు, ముసిపట్ల తిరుపతి రెడ్డి,మాడ సదావ రెడ్డి విజయభాస్కర్ రెడ్డి కామిడి శ్రీనివాస్ రెడ్డిసిద్ధిపల్లి మహిపాల్ రెడ్డి నీల కుమారస్వామి దాసరపు రాధాకృష్ణ కాసర్ల సుధాకర్ జక్కు నారాయణ ముత్యాల శంకర్ నాగిడి సంజీవ రెడ్డి కాంతారెడ్డి మధుసూదన్ రెడ్డి జనార్దన్ రెడ్డి అడిగి ప్పుల సత్యనారాయణ వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతి నిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

//వేములవాడ నియోజకవర్గం// సెప్టెంబర్ - 03 (ప్రజావాణి) వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ క్యాంపస్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరిగాయి.ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు, బలరాముని వేషధారణలో ముస్తాబై కనువిందు చేశారు. చిన్నికృష్ణుల హావభావాలు, వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుని బాల్య లీలలు, గీతోపదేశ సారాంశం, శ్రీకృష్ణుడు బోధించిన జీవన విలువలను తెలియజేస్తూ ఆహ్లాదకరమైన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, భజన గీతాలను ఆలపించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ... శ్రీకృష్ణుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. కృష్ణుడు చూపిన మార్గంలో ప్రేమ, ధర్మం, క్రమశిక్షణ, బాధ్యత, స్నేహం వంటి ఉన్నతమైన విలువలను నేటి విద్యార్థులు అలవరచుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటేష్ మాట్లాడుతూ... ఇలాంటి పండుగలను పాఠశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన, భక్తి భావం పెంపొందుతుందని, విద్యతో పాటు సంస్కారవంతమైన విలువలు నేర్పడమే తమ లక్ష్యమని తెలిపారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

సర్ 2 ప్రక్రియను పరిశీలించి బిఎల్ఏలకు తగు సూచనలు చేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

- **హుజురాబాద్ నియోజకవర్గ ఈఆర్వో కోఆర్డినేటర్ మొలుగూరి సదయ్య**

జమ్మికుంట సెప్టెంబర్03 (ప్రజావాణి) హుజురాబాద్ నియోజకవర్గం లో సర్ 2 ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందోతెలుసుకోవడానికి హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వీణవంక మండలం కొండపాక గ్రామంలో 197,198 బూతులలో నోటీసులు వచ్చిన వారి ఇండ్లకు బిఎల్ఏ ,బిఎల్ వో లతో కలిసి వెళ్లి వారితో మాట్లాడి సంబంధిత ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ శాతం నోటీసులు వచ్చినవారిలో 2002 లో ఓటు వేసిన దానికి వాళ్ళ వారసుల వయస్సు తేడా వచ్చినవారున్నారని తండ్రి పేరు ఇంటి పేరులో తేడా ఉన్నవాళ్ళు 2002 ఓటర్ లిస్టు మ్యాపింగ్ కు సంబంధించి సరియయిన సమాచారం ఇవ్వని వాళ్ళు ఉన్నారని అన్నింటికీ దగ్గరుండి ఆధారాలు సేకరించి తుది జాబితాలో వీరందరి ఓట్లు నమోదు అయ్యే విధంగా పని చేయాలని బిఎల్ఏ లకు నరేందర్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఈఆర్వో కోఆర్డినేటర్ మొలుగూరి సదయ్య, సయాబ్ హుస్సేన్,మహమ్మద్ సజ్జు,బిఎల్ఎ లు రామకృష్ణ, శ్రీనివాస్, కొండపాక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో శోభాయమానంగా కృష్ణాష్టమి వేడుకలు

రాయికల్, సెప్టెంబర్ 03 (ప్రజావాణి):రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామంలోని 1వ అంగన్వాడీ కేంద్రంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి.ఈ సందర్భంగా కేంద్రాన్ని రంగురంగుల పూలు, బెలూన్లతో అందంగా అలంకరించారు. చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణ వేసి ముస్తాబు చేశారు. బుడిబుడి అడుగులతో చిన్ని కృష్ణులు, రాధలు నడుస్తుంటే చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు.అనంతరం చిన్నారులచే ఉట్టి కొట్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టేందుకు ప్రయత్నించగా,అక్కడ ఉన్నవారు చప్పట్లు కొడుతూ వారిని ప్రోత్సహించారు.చివరగా చిన్నారులకు వెన్న, పండ్లు, స్వీట్లు పంచారు. సర్పంచ్ బండారి మానస ,అంగన్వాడీ టీచర్ గంగజల లు మాట్లాడుతూ.. పిల్లలలో చిన్నతనం నుండే భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకే ఇలాంటి పండుగలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండారి మానస,గ్రామ కార్యదర్శి సాయిలక్ష్మి,బండారి సాయిరాజ్,పాఠశాల ప్రధానో పాధ్యాయులు భానుశ్రీ, ఉపాధ్యాయులు రనీల, ప్రియాంక, వైష్ణవి, అంగన్వాడీ టీచర్ గంగజల, ఆయాలు, విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు

విశ్వశాంతి పాఠశాలలో అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

రాయికల్, సెప్టెంబర్ 03 (ప్రజావాణి) :రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.విద్యార్థినీ విద్యార్థులు గోపిక, కృష్ణ వేషధారణలో ముస్తాబై చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టే సమయంలో తోటి విద్యార్థులు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ.. "మనం కృష్ణాష్టమి పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నాం. హిందువులకు ఇది అత్యంత పవిత్రమైన పండుగ. ద్వాపర యుగంలో కంసుడి చెరసాలలో దేవకీ, వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించాడు. లోకంలో అధర్మాన్ని నశింపజేసి, ధర్మాన్ని రక్షించడానికి ఆయన అవతరించాడు.కృష్ణుడు చిన్నప్పుడు రేపల్లెలో నందుడు, యశోదల వద్ద పెరిగాడు. బాల్యంలో కృష్ణుడు చేసిన అల్లరి పనులు, లీలలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఆయనకు వెన్న అంటే ఎంతో ఇష్టం. అందుకే ఆయనను 'నవనీత చోరుడు' అని పిలుస్తారు. భగవద్గీత ద్వారా కృష్ణుడు మానవాళికి గొప్ప జీవన సందేశాన్ని ఇచ్చాడు. ఈ పండుగ మనకు సంతోషాన్ని, ఐక్యతను ఇస్తుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్ మరియు ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, రజిత, సంజన, ఇందుజ, మంజుల, స్రవంతి, కవిత, సాయి హర్ష, దీపిక, శివాని, సౌజన్య, కళ్యాణి, మాలతి, అహల్య, గాయత్రి, గీతారాణి, ప్రవళిక, కావ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర గణం... సమస్యలు కోకొల్లలు..?

- నేలకొండపల్లికి స్వాగతం పలుకుతున్న దుర్వాసన అపశుభ్రం
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి
- బీసీ కాలనీలో ఇలా... చెరువు కట్ట వద్ద అలా....?
- మండల జిల్లా స్థాయిలో ఫిర్యాదులు ఇచ్చిన చర్యలు శూన్యం....?



నేలకొండపల్లి ప్రతినిధి మన ప్రజావాణి సెప్టెంబర్ 2 గురువారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీలో అపరిశుభ్రత తాండవిస్తోందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిలో నేలకొండపల్లి ప్రవేశం వద్ద చెరువు కట్ట ప్రాంతంలో జంతు కళేబరాలు చెత్త కుప్పలతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు వాహనదారులకు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నేలకొండపల్లి మండల కేంద్రానికి చారిత్రిక నేపథ్యం ఉన్నప్పటికీ సమస్యలు పంచాయతీ పనితీరును స్పష్టం చేస్తుందని పలువురు పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై జంతు కళేబరాలు విచ్చలవిడిగా రోడ్ల పక్కన వేయడంతో కుక్కలు ఆ ప్రాంతానికి చేరి ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఆటంకాలు సృష్టిస్తున్నట్లు దీంతో ప్రాణభయంతో వాహనదారులు కాలం వెలదీస్తున్నట్లు ఆరోపణలు విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ ప్రవేశం వద్ద చెరువు కట్ట ప్రాంతంలో కొన్ని వందల మీటర్లలో దుర్వాసన పారిశుధ్యం లోపించటంతో ప్రయాణికులు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా 14వ వార్డు బీసీ కాలనీ ప్రాంతంలో పెంట దిబ్బలు పారిశుద్ధ్య సమస్యలపై మండల జిల్లా స్థాయిలో ఫిర్యాదులు అందినప్పటికీ నేటికీ పంచాయతీ కార్యదర్శి సమగ్రమైన చర్యలు తీసుకోలేదని పలువురు కాలనీవాసులు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత డి ఎల్ పి ఓ స్పందించి మేజర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య సమస్యపై దృష్టి కేంద్రీకరించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు మండల కేంద్రానికి చెందిన ప్రజలు కోరుతున్నారు.

అప్పుల్లోకి నెట్టిందే కల్వకుంట్ల కుటుంబం - రాష్ట్రానికి బాకీ పడ్డది బి. ఆర్. ఎస్. నే...!

- ఇది ఫామ్‌హౌస్ పాలన కాదు ప్రజా పాలన - బి ఆర్ ఎస్ బాకీ కార్డు దుష్ప్రచారమే.
- ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్ రాజీనామా చేయాలి: రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.
- వేములవాడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 500 మీటర్ల భారీ ప్లెక్సీ ప్రదర్శన.

//వేములవాడ నియోజకవర్గం// సెప్టెంబర్ - 03 (ప్రజావాణి)బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డు పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని, ఆ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. గత 1000 రోజులుగా ప్రతి పక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలం ఆయన నేపథ్యంలో గురువారం వేములవాడ పట్టణంలో కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం ఇచ్చి అమలు చేయని హామీలను, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సుమారు 500 మీటర్ల భారీ ప్లెక్సీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని నిరసన తెలిపారు..
ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న వైఫల్యాలను, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే ఈ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను రద్దు చేయకుండా, కొత్తగా 120కి పైగా కార్యక్రమాలు, పథకాలను ప్రజల కోసం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు..
తెలంగాణకు బాకీ పడ్డది బీఆర్ఎస్ కుటుంబమే.
తెలంగాణ సమాజానికి బాకీ పడ్డది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కల్వకుంట్లకుటుంబం,బీఆర్ఎస్ పార్టీయేనని విప్ విమర్శించారు..2014లో తెలంగాణ రాష్ట్ర అప్పు సుమారు రూ.75 వేల కోట్లు ఉండగా, బీఆర్ఎస్ పదేళ్ల పాలన అనంతరం రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ నినాదంతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. అనంతరం తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చడం ద్వారా తెలంగాణ ప్రజలతో ఉన్న అనుబంధాన్ని తెంచుకుందని అన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రజల తరపున నిర్మాణాత్మక సూచనలు చేయాలని అన్నారు. ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించలేని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నేత పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 1000 రోజుల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.
రైతులకు భారీ స్థాయిలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం చూరగొంటోందని తెలిపారు.
కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు, మున్సిపల్, సర్పంచ్, ఎంపీ ఎన్నికలు తదితర సందర్భాల్లో కాంగ్రెస్‌కు ప్రజల నుంచి లభించిన మద్దతే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సూచనలు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.
మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, ఫోర్త్ సిటీ అభివృద్ధి, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ వంటి కార్యక్రమాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు..
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని నాయకులు తెలిపారు. ప్రజలకు వాస్తవాలను వివరించేందుకే ఈ భారీ ప్లెక్సీ ప్రదర్శన చేపట్టామని అన్నారు.
ఇది ఫామ్‌హౌస్ పాలన కాదు.. ప్రజా పాలన అని రాబోయే రోజుల్లోనూ తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం, ప్రజా పాలనే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారంభారీ 150 బైక్ ర్యాలీ

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విజయవంతం
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులువీరమనేని పరశురామ్ రావుఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారంభారీ 150 బైక్ ర్యాలీ

జమ్మికుంట సెప్టెంబర్ 3 (ప్రజావాణి) జమ్మికుంట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు. అలాగే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం ఎమ్మెల్యే ఆదేశానుసారం హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రణవ్ బాబు పర్యవేక్షణలో కోరపల్లి గ్రామ పరిధి లోని అంబేద్కర్ విగ్రహం కూడలి నుండి జమ్మికుంట పట్టణంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వీరమనేని పరశురామ్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారంభారీ ర్యాలీ 150 బైక్ లతో నిర్వహించిదం జరిగిందిఇట్టి కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులుకార్యకర్తలు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులుఅభిమానులు పాల్గొన్నారు

యాదాద్రిలో 1000 రోజుల ప్రజా పాలన సంబరాలు...

- ప్రజా సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం.
- ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య.

సెప్టెంబర్ 03 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా యాదగిరి గుట్ట పట్టణంలో ప్రజా పాలన 1000 రోజుల సంబరాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యాదాద్రి డీసీసీ అధ్యక్షులు , ఆలేరు ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నాయకత్వం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్య కర్తలు , మండల అధ్య క్షులు , సర్పంచులు, ఎంపీటీసీలు , ప్రజాప్రతి నిధులు , అభిమానులు పెద్ద సంఖ్యలో హాజ రయ్యారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమం , రాష్ట్ర అభి వృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ లను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పేద , మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలిచేలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు , రైతు రుణమాఫీ , మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ , రూ.500 లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా రాష్ట్రం లోని లక్ష లాది కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం అందు తోందని అన్నారు.ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభి వృద్ధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని బీర్ల అయిలయ్య తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్ల నిధులను తీసుకువచ్చి రహదారులు , తాగునీరు, సాగునీరు , విద్య , వైద్యం తదితర రంగాల్లో అభి వృద్ధి పనులను చేపడు తున్నామని చెప్పారు.ఆలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని గుర్తించి , నిధులు సమ కూర్చి , పనులను వేగంగా పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్య కర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలే ప్రజా ప్రభుత్వానికి అసలైన బ్రాండ్ అంబా సిడర్లని , ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం , అభి వృద్ధి కార్యక్రమాలే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని మరింత పెంచు తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు , సర్పంచులు, ఎంపీటీసీలు , వివిధ అనుబంధ సంఘాల నాయకులు , కార్యకర్తలు, యువత , మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శిలాఫలకంపై 'కక్షల' గొడ్డలి!

- చెన్నారావుపేటలో కాంట్రాక్టర్ల బరితెగింపు!
- రూ. 19 కోట్ల చెక్ డ్యామ్ శంకుస్థాపన ఫలకం ధ్వంసం
- మాజీ ఎంపీపీ జెక్కా అశోక్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు

చెన్నారావుపేట సెప్టెంబర్ 03 ప్రజావాణి చెన్నారావుపేట మున్నేరు వాగుపై చెక్ డ్యామ్ వంతెన నిర్మాణ రైతుల దశాబ్దాల కలను దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నెరవేర్చారని మాజీ ఎంపీపీ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ పేర్కొన్నారు.గురువారం మండల కేంద్రంలో మున్నేరు వాగు చెక్ డ్యామ్ వంతెన నిర్మాణ పనుల పరిశీలనకు వెళ్లిన ఆయనకు దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది శంకుస్థాపన చేసిన శిలాఫలకం తొలగించి ధ్వంసం చేసిన సంఘటనలు ఎదురయ్యాయి. పెద్ది సుదర్శన్ రెడ్డికి అవమానం కలిగిస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరిస్తూ, పెద్ది చిత్రపటానికి జక్కా అశోక్ పాలాభిషేకం చేశారు. అనంతరం జక్కా అశోక్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని కాంట్రాక్టర్ల ఆగడాలు శృతిమించాయి. గత ప్రభుత్వ హయాంలో నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని అర్ధరాత్రికి అర్ధరాత్రి మాయం చేసి ధ్వంసం చేయడం వెనుక దాగి ఉన్న నాయకుడు ఎవరు అని నిలదీశారు.ఈ దారుణానికి ఒడిగట్టిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్కా అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు స్థానిక పోలిస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారుగా రూ.19 కోట్ల భారీ అంచనా వ్యయంతో చెన్నారావుపేట మండల కేంద్రంలో చెక్ డ్యామ్, వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2023 అక్టోబర్ 4న నాటి ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.?అయితే కాంట్రాక్టర్లు వాసుదేవరెడ్డి, సుధీర్ రెడ్డిలు ఈ నెల 2వ తేదీన సదరు శిలాఫలకాన్ని కసిగా ధ్వంసం చేశారని అశోక్ తన ఫిర్యాదులో ఆరోపించారు.ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించడమే కాకుండా, నాటి ప్రజాప్రతినిధులు, అధికారుల పేర్లు, హోదాలను కించపరిచేలా కాంట్రాక్టర్లు ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి రాజ్యాంగబద్ధంగా ఉన్న నాయకుల పేర్లను చెరిపేసేందుకు యత్నించిన కాంట్రాక్టర్లతో పాటు, వారి వెనుక ఉండి నడిపించిన బాధ్యులందరిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తాళ్లపల్లి గ్రామంలో గ్రామ సభ.....

- ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేస్తే గ్రామం అభివృద్ధి చెందుతుంది.
- తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ వెల్లడి.

రంగారెడ్డి జిల్లా బ్యూరో. సెప్టెంబర్ 3. ప్రజావాణి. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ అధ్యక్షతన గురువారం గ్రామంలోని రచ్చబండపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల.టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం వర్షపు నీటిని పొదుపు చేయడం కరువు పరిస్థితుల ను అధిగమించడానికి గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ ను ఒక ప్రజా ఉద్యమంగా మలచడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఉపాధి హామీ చట్టం స్థానంలో వివిజి ఆర్ ఏ ఎం జి స్థానంలోనే నూతన హామీ చట్టాన్ని తెచ్చింది అన్నారు. ఇదివరకు ఉన్న 100 రోజుల ఉపాధి హామీ పని దినాలను ఈ పథకం ద్వారా 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు ఈ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు సమకూర్చుందన్నారు. ఎక్కువ రోజులు పని లభించడం వల్ల గ్రామీణ పేద నిరుపేద కుటుంబాలకు వర్షపు నీటి సంరక్షణ భూగర్భ జలాల పెంపు పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించారు అనంతరం గ్రామ సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ మాట్లాడుతూ వి బి జి రామ్ జి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రారంభించిన ఈ పథకం ద్వారా రైతు ప్రజలు అనేక ప్రయోజనాలను పొందవచ్చు అన్నారు ముఖ్యంగా ఉపాధి హామీ పథకం నీటి సంరక్షణ కార్యక్రమం ఎంతగానో మేలు చేస్తుంది అని అన్నారు అదేవిధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత అనగా మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం నీటి వనరులను కాపాడటం వంటి కార్యక్రమాలు తాళ్లపల్లి గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు తోపాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పసుల గోపాల్ గ్రామ యువకులు నాయకులు ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన... వైఫల్యాలే వెయ్యి?

- హామీలు ఘనం.. అమలు శూన్యం!
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన.. మాటలు మైకుల్లో, సమస్యలు ప్రజల్లో!

టేక్మాల్ సెప్టెంబర్ 3 :(మన ప్రజావాణి) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను నిరసిస్తూ టేక్మాల్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సదస్సు ఏర్పాటు చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

రైతులకు యూరియా అందించడంలో ఇబ్బందులు

రైతు సదస్సులో ప్రధానంగా యూరియా సమస్యపై చర్చించారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యాప్ ద్వారా నమోదు చేసుకోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో సులభంగా యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

యూరియాను కేవలం యాప్ ద్వారా మాత్రమే పంపిణీ చేయకుండా, రైతులకు నేరుగా ఎరువుల దుకాణాల వద్ద అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి లేకుండా, గ్రామీణ ప్రాంతాల్లోనే సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

హామీల అమలుపై నిలదీత

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన ఇతర హామీలను కూడా అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు.

రైతులు, మహిళలు, యువత, పేదలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున మరింత బలంగా పోరాటాలు నిర్వహిస్తుందని నాయకులు హెచ్చరించారు.

రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది

రైతుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందించడంతో పాటు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

టేక్మాల్ మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై ప్రజల్లో చర్చ జరగాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో గ్రామగ్రామాన ప్రజలను కలుస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

రైతు సదస్సులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని రైతుల సమస్యలు, ప్రభుత్వ హామీల అమలు, యూరియా పంపిణీ తదితర అంశాలపై చర్చించారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలమైన ప్రజా ప్రభుత్వం

మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 03(ప్రజా వాణి) ప్రజా ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చకుండా పూర్తిగా విఫలమైందని మహబూబాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ కుమారి ఆంగోత్ బిందు అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలనపై గురువారం భారస ఆధ్వర్యంలో గార్ల మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.ఈసందర్భంగా బిందు మాట్లాడుతూ,ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,420 హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిందని ఆరోపించారు.రైతుబంధు, రుణమాఫీ సక్రమంగా అందక రైతాంగం అల్లాడుతుంది అన్నారు.అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందని రైతులకు వెంటనే పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గార్ల మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్,పానుగంటి రాధాకృష్ణ,మహమ్మద్ ఖదీర్ బాబా,బూడిగ మురళి,పులిచింతల వీరారెడ్డి,నరసింహ,గాజుల గణేష్,తాళ్లూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన దాసరి మహేష్ యాదవ్

- కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

మేడిపల్లి సెప్టెంబర్ 3 (మన ప్రజావాణి) మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ లేబర్ సెల్ కన్వీనర్‌గా దాసరి మహేష్ యాదవ్ నియమితులైన సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. అదేవిధంగా జిల్లా బిజెప అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్,జిల్లా ఇంచార్జి సమా రంగారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి,బిక్కు నాయక్, మేడ్చల్ కాంటెస్టెడ్ ఎమ్ ఎల్ ఏ ఎనుగు సుదర్శన్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోగరం వెంకట్ రెడ్డి,జిల్లెల తిరుమల రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొనె శ్రీనివాస్,ఏనుగుల లక్ష్మయ్య తదితరులను దాసరి మహేష్ యాదవ్ సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆశీర్వాదాలు పొందారు.అనంతరం కార్మికుల సమస్యలు,కార్మిక హక్కుల పరిరక్షణ,కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ రూరల్ జిల్లాలో కార్మికుల సమస్యలను గుర్తించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా కృషి చేస్తానని మహేష్ యాదవ్ తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం

- రైతు వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ - బీఆర్ఎస్ నేత తిరుపతిరెడ్డి ఆగ్రహం
- యాప్లలో కాకుండా షాప్ లలో రైతులకు యూరియా రైతులకు ఇవ్వాలి
- 6 గ్యారంటీలతోపాటు 420 హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టం
- విద్యార్థులకు స్కూటీలు ఇవ్వ డంలో కూడా కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది
- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి డిమాండ్

చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 03, మన ప్రజావాణి:కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి మండిపడ్డారు.గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రైతులను రాజులా చూసుకున్నారని, రైతుబంధు, రైతుబీమాతో రైతాంగానికి అండగా నిలిచారని తెలిపారు.కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు క్యూలైన్లో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఎరువుల కొరత ఏర్పడిందని ఆరోపించారు. యాప్లలో కాకుండా రైతులకు నేరుగా యూరియా అందియాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగుల విషయంలో కూడా కాంగ్రెస్ పార్టీ అనేకమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, నేడు హామీలను మర్చిపోయి రాష్ట్రానికి తుంగలో తొక్కిందని దాచుకోవడం దోచుకోవడం తప్ప కాంగ్రెస్ నాయకులకు వేరే ధ్యాస లేదని రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రజాక్షేత్రంలో తెలుసుకోవాలని తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మళ్లీ బంగారు పాలన రావాలంటే మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని బీఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిందేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ కు బుద్ధి చెబుతారని అన్నారు. కల్యాణ లక్ష్మి రైతు బీమా లాంటి పథకాలలో కూడా రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అన్నారు.ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, సర్పంచ్ బత్రాజ్ భూమయ్య,పలు గ్రామాల తాజా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు విద్యార్థి, యువజన విభాగం నాయకులు, మండల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాతృమూర్తి యాదిలో విద్యార్థులకు విందు..

ప్రజావాణి,ఇనుగుర్తి:మాతృమూర్తిని స్మరించుకుంటూ ఆమెయాదిలో ఓ ఉపాధ్యాయుడు తాను విధులు నిర్వర్తిస్తున్న పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా మాంసాహార విందు ఇచ్చారు. మహబూబ్ బాబా జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం లోని ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్ జి టి ఉపాధ్యాయుడు బొంగోని బాలరాజు తన తల్లి కౌసల్య సంవత్సర క్రితం కన్ను మూసింది.ఆమె జ్ఞాపకార్థంగా సంబంధిత పాఠశాల బాలబాలికలకు ఈ మేరకు విందు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బాలరాజు మాట్లాడుతూ తాను ఏ పాఠశాలలో విధులు నిర్వర్తించినప్పటికీ ఇకనుంచి ప్రతి సంవత్సరం తన మాతృమూర్తి స్మరణలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులను కష్టపెట్టకుండా క్రమశిక్షణతో చదువుకొని వారు మీ పై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరన్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర చారి,రేవతి,వైధూర్యం,సారంగపాణి,యాకయ్య, ట్యూషన్ టీచర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల పాలన.. కాంగ్రెస్ విజయోత్సవ జోష్!

- కేసముద్రం మార్కెట్ ఆవరణలో మార్మోగిన ప్రజా పాలన నినాదం.. కేక్ కట్, టపాసులతో సంబరాలు.

కేసముద్రం సెప్టెంబర్ 03, ప్రజావాణి.కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణ.. కాంగ్రెస్ శ్రేణుల సందడి.. విజయోత్సవ నినాదాలతో మార్మోగిన ప్రాంగణం.. కేక్ కట్ చేసి, టపాసులు కాల్చుతూ నాయకులు, కార్యకర్తల ఉత్సాహం! కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మార్కెట్ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రజల సంక్షేమమే.. పాలనకు అసలైన కొలమానం.

కార్యక్రమానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు హాజరై కేక్ కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు.

'ప్రతి అడుగు.. ప్రజల కోసమే'.!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని నాయకులు తెలిపారు. అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు చేరువవుతోందన్నారు.

వెయ్యి రోజుల ప్రజా పాలనను కేవలం వేడుకగా కాకుండా.. ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేసుకునే సందర్భంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రతిపక్ష విమర్శలకు కాంగ్రెస్ కౌంటర్!

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాజకీయ విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల పక్షాన మాట్లాడుతున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలే కాంగ్రెస్‌కు ప్రజల్లో మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని అన్నారు.

కేసముద్రంలో కాంగ్రెస్ శ్రేణుల ఐక్యత.

కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండారు వెంకన్న, బండారు దయాకర్, 3వ వార్డు కౌన్సిలర్ ధారావత్ కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చిదురాల వసంతరావు, ఓలం రమేష్, ఎండి అయూబ్‌ఖాన్, చింతకుంట్ల యాదగిరి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కనుకుల రాంబాబు, వల్లందాస్ రవి, బాధ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.సర్పంచులు బండి పృథ్వీరాజ్, భద్ర నాయక్, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల, జిల్లా నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.వెయ్యి రోజుల ప్రజా పాలనకు గుర్తుగా నిర్వహించిన ఈ వేడుకలు.. కేసముద్రంలో కాంగ్రెస్ శ్రేణుల ఐక్యత, ఉత్సాహాన్ని చాటుతూ విజయోత్సవ వాతావరణాన్ని నెలకొల్పాయి.

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మేడిపల్లి సెప్టెంబర్03,(మన ప్రజావాణి)గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు బోడుప్పల్‌లోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గణేష్ ఉత్సవ నిర్వాహకులతో పోలీసు అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఉప్పల్ అడిషనల్ డీసీపీ శ్రీ వెంకటరమణ,మేడిపల్లి ఏసీపీ శ్రీ బిట్టు మోహన్ కుమార్‌తో పాటు ట్రాఫిక్, రెవెన్యూ,మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు,సిబ్బంది హాజరయ్యారు.సుమారు 200 మంది గణేష్ ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్న ఈ సమావేశంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని,అన్ని భద్రతా,ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు.ఉత్సవాల సందర్భంగా ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. అగ్నిప్రమాదాలను ఎలా నివారించాలి,ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినప్పుడు వాటిని ఎలా ఆర్పాలి అనే అంశాలపై అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు.

అక్రమ కబ్జాకు యత్నించిన సర్పంచ్ భర్త, కొడుకుపై కేసు నమోదు

- జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్

మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 03 (జోగిపేట) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి తనకు చెందిన 3.5 గుంటల భూమిలో అక్రమంగా చొరబడి షెడ్డు నిర్మించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ భర్త, ఆయన కుమారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కస్సన్‌పల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డికి చెందిన 3.5 గుంటల భూమిలో అదే గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త మహిపాల్, ఆయన కుమారుడు ప్రవీణ్ (మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు) అక్రమంగా చొరబడి షెడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు వారిని ప్రశ్నించగా, "ఆ స్థలం మాదే" అంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై తెలిపారు.బాధితుడు ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిపాల్, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గిరి శ్రీకాంత్ వెల్లడించారు. ఘటనకు సంబంధించిన భూమి హక్కులు, నిర్మాణ పరిస్థితులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

మ్యార్పీఎస్ గూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాతరాజి మల్లేష్

దండేపల్లి, సెప్టెంబర్ 3 (సక్రమ ప్రజా పాలన):ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా దండేపల్లి మండలం గూడెం గ్రామపంచాయతీలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాతరాజి మల్లేష్, అధికార ప్రతినిధిగా మాదుగుల బాపు, ఉపాధ్యక్షుడిగా అందరుపుల వెంకటేష్, కోశాధికారిగా సాతరాజి శంకరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 9న వరంగల్‌లో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులుగా ఎన్నికైన ఆవుల శ్రీనివాస్, వినయ్‌రాజ్, మండల బాధ్యులు తగరపు సత్యం, మల్యాల శ్రీనివాస్, నతరి రమేష్, గ్రామ నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కౌన్సెలింగ్

మన ప్రజావాణి మందమర్రి:- ఆగస్టు 3 ఏరియాలోని ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపు కొరకు సింగరేణి ఎన్సీడబ్యుఏ ఉద్యోగులకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సింగరేణి ఏరియా సీనియర్ పర్సనల్ అధికారి కార్తీక్ తెలిపారు. గురువారం పట్టణంలోని సిఈఆర్ క్లబ్లో క్వార్టర్ల కొరకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏరియా సీనియర్ పర్సనల్ అధికారి కార్తీక్ మాట్లాడుతూ, ఏరియాలో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపు కొరకు 105 క్వార్టర్ లను ప్రకటించగా, వీటికి 88 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించి, నిబంధన మేరకు సీనియార్టీ ప్రకారం 24 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సివిల్ మేనేజ్మెంట్ ట్రైనీ ఆర్ వీణ, ఏరియా పర్సనల్ విభాగం కార్యాలయ సూపరింటెండెంట్ ఎం రాయలింగు, ఏరియా పర్సనల్ విభాగం సిబ్బంది, ఎస్ అండ్ పిసి సిబ్బంది పాల్గొన్నారు.

రోహిత్ పై పనికిమాలిన పుకార్లు ఆపండి

• బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఫుల్‌స్టాప్ పెట్టారు. బీసీసీఐ అత్యున్నత స్థాయి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ పుకార్లపై స్పందించారు. రోహిత్ శర్మ బాగా ఆడుతున్నాడని, ఇకనైనా ఈ పనికిమాలిన పుకార్లను ఆపేయాలని సూచించారు. ముంబైలోని బీసీసీఐ హెడ్ ఆఫీస్‌లో బుధవారం అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. దేవజిత్ సైకియా అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ హాజరయ్యారు. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికలతో పాటు ఆటగాళ్ల గాయాల బెడద, రోహిత్ శర్మ భవితవ్యంపై చర్చించారు. ఈ సమావేశానికి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ దూరంగా ఉన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగా యశస్వి జైస్వాల్‌కు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు రోహిత్ శర్మను జట్టు నుంచి తప్పిస్తారనే పుకార్లను దేవజిత్ సైకియా ఖండించాడు. 'రోహిత్ శర్మ అన్ని మ్యాచ్‌ల్లోనూ చాలా బాగా ఆడుతున్నాడు. లార్డ్స్ వన్డేలోనూ సెంచరీ చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో.. నేను ఈ పనికిమాలిన పుకార్లకు ప్రాధాన్యత ఇవ్వదలుచుకోలేదు.'అని సైకియా స్పష్టం చేశాడు. టీమిండియా ఆటగాళ్ల గాయాల బెడదపై స్పందిస్తూ.. 'రెండు నెలల పాటు ఐపీఎల్‌లో ఆడిన తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లిన 15 మంది సభ్యుల జట్టులో ముగ్గురు- నలుగురు ఆటగాళ్లు గాయపడ్డారు. సేనా(సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల పర్యటనలకు ముందు ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి ఇచ్చేలా, ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడేలా వీలుగా క్రికెట్ షెడ్యూల్‌లో తగిన ఏర్పాట్లు చేస్తాం. నేషనల్ సెంటర్ ఫర్ స్పెషలైజ్డ్ ట్రైనింగ్‌లో హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ పదవి ఖాళీగా ఉన్నప్పటికీ, అక్కడి ఫిట్‌నెస్, పునరావస సౌకర్యాలను పర్యవేక్షించడానికి ఇప్పటికే 16 మంది అర్హత గల వ్యక్తుల విధుల్లో ఉన్నారు.'అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్!?

ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బృందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. మొత్తం 768 మంది సభ్యులతో కూడిన భారత బృందంలో 503 మంది క్రీడాకారులు, 246 మంది అధికారులు, సహాయక సిబ్బంది, 19 మంది కంటింజెంట్ సిబ్బంది ఉన్నారు. ఆసియా గేమ్స్ నుంచి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విశ్రాంతి ఇచ్చారు. అప్‌కమింగ్ సిరీస్‌ల కోసం గంభీర్‌కు రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. గంభీర్ గైర్హాజరీలో వీవీఎస్ లక్ష్మణ్ జట్టును పర్యవేక్షించనున్నాడు. గంభీర్ సపోర్ట్ టీమ్ కూడా ఈ ఆసియా గేమ్స్‌కు దూరంగా ఉండనుంది. వీవీఎస్ లక్ష్మణ్‌కు సునీల్ జోషి, హృషీకేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్ సపోర్ట్ స్టాఫ్‌గా వ్యవహరిస్తారు. మహిళల జట్టుకు అమోల్ ముజుందార్ హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్ అనంతరం గంభీర్‌కు విశ్రాంతి ఇవ్వగా.. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. చైనా వేదికగా 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో రెండు జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. అప్పుడు పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించగా.. మహిళల జట్టును హర్మన్‌ప్రీత్ కౌర్ నడిపించింది. మరోవైపు ఆసియా గేమ్స్‌లో క్రికెట్ జట్లకు వసతి ఏర్పాట్లపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ కీలక వివరణ ఇచ్చారు. గదుల కొరత ఉన్నప్పటికీ పాల్గొనే జట్లకు హోటల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3 వరకు టీ20 క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జట్లు కోరుకుంటే తమకు నచ్చిన వసతిని స్వయంగా ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉందని మియాజీ చెప్పారు. సరైన డ్రెస్సింగ్ రూమ్స్ లేకపోవడంతో పాటు వాష్ రూల్స్ అధ్వాన్నంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వసతులపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి.

చరిత్ర సృష్టించిన టామ్ కర్రన్.. టోర్నీలో తొలి హ్యాట్రిక్ నమోదు

స్పోర్ట్స్ డెస్క్: యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్(ఈటీపీఎల్)లో మొట్టమొదటి హ్యాట్రిక్ నమోదైంది. ఎడిన్‌బర్గ్ క్యాజికల్ రాకర్స్ పేసర్, ఇంగ్లండ్ స్టార్ టామ్ కర్రాన్ హ్యాట్రిక్ వికెట్లు సాధించాడు. వూర్‌బర్గ్ వేదికగా బెల్‌ఫాస్ట్ వోల్ట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 59 పరుగులతేడాతో ఎడిన్‌బర్గ్ విజయం సాధించింది. మ్యాచ్ విషయానికి వస్తే...తొలుత బ్యాటింగ్ చేసిన ఎడిన్‌బర్గ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 189 పరుగులు సాధించింది. ఓపెనర్ జేజే స్మట్స్ 98 పరుగులతో ఆ జట్టు భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అతడితో పాటు బ్రెండన్ మెక్‌ముల్లన్ 30 పరుగులతో రాణించాడు. అనంతరం 190 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెల్‌ఫాస్ట్ జట్టు 130 పరుగులకే ఆలౌటైంది. బెల్ ఫాస్ట్ జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది.ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ట్రెంట్ బౌల్ట్ వరుసగా రెండు వికెట్లు పడగొట్టి ఆ జట్టుకు బిగ్ షాకిచ్చాడు. తర్వాత ఐదో ఓవర్లో పాల్ స్టిర్లింగ్(25)ను కూడా బౌల్ట్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక మ్యాచ్ చివర్లో కర్రాన్ మ్యాజిక్ చేశాడు. 16వ ఓవర్ వేసిన కర్రాన్.. ఐదో బంతికి ఫ్రెడ్ క్లాసెన్, చివరి బంతికి మాథ్యూ హంఫ్రీస్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత 18వ ఓవర్ వేసేందుకు వచ్చిన టామ్ కర్రాన్ తొలి బంతికి అదైర్‌ను ఔట్ చేసి హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు.కర్రాన్ బౌలింగ్ ధాటికి బెల్‌ఫాస్ట్ 130 పరుగులకే కుప్పకూలింది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు కర్రన్ ఐదు వికెట్లు మాత్రమే తీసినప్పటికీ బ్యాటర్లను కట్టడి చేయడంలో సఫలమయ్యాడు. 2019లో జరిగిన టీ20 బ్లాస్ట్‌లో కర్రాన్ గ్లామోర్గాన్‌పై తన తొలి హ్యాట్రిక్‌ను నమోదు చేశాడు. అతడు ప్రస్తుతం ఇంగ్లండ్ క్రికెటర్లలో టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన

తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం..

ఐసీసీ మహిళల క్రికెట్‌లో మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి తెరలేచింది. తొలిసారిగా 2027లో ప్రతిపాదించిన ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. వాస్తవానికి ఈ మెగా టోర్నీని శ్రీలంకలో నిర్వహించాలని ముందుగా నిర్ణయించారు. అయితే శ్రీలంక క్రికెట్ బోర్డులో నెలకొన్న పరిస్థితులు, ఐసీసీ సూచించిన సంస్కరణల అమలులో జాప్యం కారణంగా ఈ టోర్నీని అక్కడి నుంచి భారత్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రత్యామ్నాయ వేదిక కోసం భారత్‌తో పాటు బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాలను పరిశీలించిన ఐసీసీ బోర్డు.. సెప్టెంబర్ 1న జరిగిన సమావేశంలో ఇండియాకే ఓటు వేసింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, వడోదర ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నిర్ణయంతో భారత అభిమానులకు స్వదేశంలో మరో మెగా ఈవెంట్ చూసే అవకాశం దక్కింది. రౌండ్ రాబిన్ ఫార్మాట్ ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ పూర్తిగా టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఆతిథ్య భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు ఇందులో తలపడతాయి. లీగ్ దశలో ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. శ్రీలంక ఆతిథ్య హక్కులు కోల్పోయినా, టోర్నీలో ఆడే అవకాశాన్ని మాత్రం దక్కించుకుంది. మహిళల క్రికెట్‌కు ఎంతో ప్రోత్సాహం ఈ టోర్నీ మహిళల క్రికెట్‌లో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని ఐసీసీ చైర్మన్ జై షా హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు పోటీ పడే ఈ ఈవెంట్, గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో వైకి ఎదిగేం దుకు జట్లకు అద్భుతమైన స్ఫూర్తి నిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఏడాదీ ఒక మెగా ఐసీసీ టోర్నీ నిర్వహి ంచడం వల్ల మహిళల ఆటకు ఆదరణ మరింత పెరుగ ుతుందని జై షా ఆశాభావం వ్యక్తం చేశారు.టైటిల్ ఫేవరెట్‌గా టీమిండియా ప్రస్తుతం భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ ఛాంపియన్‌గా సత్తా చాటు తోంది. గత ఏడాది నవీ ముంబైలో జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి టీమిండియా ఈ టైటిల్ గెలుచుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా ప్రస్తుత టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్‌గా ఉంది. ఈ ఏడాది లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఆసీస్ ఏడోసారి కప్పు సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ దిగ్గజ జట్ల మధ్య ట్రోఫీ కోసం తీవ్ర పోటీ నెలకొననుంది.

దీపికను వెనక్కి నెట్టి.. దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచిన రష్మిక మందన్న

భారత చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కన్నడ చిత్రసీమ నుంచి ప్రయాణం మొదలుపెట్టి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రష్మిక మందన్న, తాజాగా దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచారు. ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి పాప్యులారిటీ ర్యాంకింగ్‌లో, బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొణెను వెనక్కి నెట్టి రష్మిక ఈ ఘనత సాధించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది.

'పుష్ప: ది రైజ్' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్ర దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'యానిమల్' సినిమాతో హిందీ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ఆమె మాస్ ఇమేజ్‌ను, క్రేజ్‌ను శిఖర స్థాయికి చేర్చింది. దీంతో పాటు 'ఛావా', 'కుబేర' వంటి విభిన్న భాషల చిత్రాలతో తన నటనను, ఉనికిని అన్ని పరిశ్రమలలోనూ బలంగా చాటుకున్నారు. రష్మిక విజయం కేవలం గత చిత్రాలకే పరిమితం కాలేదు. భవిష్యత్తులోనూ ఆమె డైరీ అగ్రశ్రేణి ప్రాజెక్టులతో నిండిపోయింది. రాబోయే అక్టోబర్ 16న విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబాలి' విడుదల కానుండగా, నవంబర్ 27న 'మైసా' ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు 'రాకా', 'పుష్ప 3', 'యానిమల్ పార్క్' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ ఆమెను దేశంలోనే అత్యంత బిజీగా ఉన్న నటీమణులలో ఒకరిగా నిలబెట్టాయి.

రష్మిక అగ్రస్థానానికి చేరడం అనేది భారతీయ సినిమాలో మారుతున్న సమీకరణాలకు నిదర్శనం. ప్రాంతీయ భాషా చిత్రాల సరిహద్దులు చెరిగిపోయి, ప్రతిభ ఉన్న నటీనటులకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందనడానికి ఆమె విజయమే ఒక ఉదాహరణ. దీపిక పదుకొణె ఇప్పటికీ ఒక ఐకాన్‌గా కొనసాగుతున్నప్పటికీ, పలు భాషల్లో వరుస విజయాలు సాధించి, పాన్ ఇండియా స్టార్‌డమ్‌కు కొత్త నమూనాను సృష్టించారు రష్మిక. ఆమె ప్రయాణం ఆధునిక స్టార్‌డమ్ భాషకు అతీతమని స్పష్టం చేస్తోంది.

విడుదలకు ముందే సక్సెస్‌మీట్..

'రంభ ఊర్వశి మేనక'పై అల్లరి నరేశ్ ఫుల్ కాన్ఫిడెన్స్

కథానాయకుడు అల్లరి నరేశ్ చాలా కాలం తర్వాత తనదైన శైలిలో ఫాంటసీ కామెడీ జోనర్‌లో నటించిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ సినిమా విజయంపై ఆయన పూర్తి ధీమా వ్యక్తం చేశారు. చిత్రం విడుదలకు ముందే సక్సెస్ మీట్ తేదీని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సెప్టెంబర్ 4న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నరేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో నరేశ్ మాట్లాడుతూ.. "ఈసారి కచ్చితంగా పెద్ద హిట్ కొడుతున్నాం. సినిమా సెప్టెంబర్ 4న విడుదలవుతుంది, సెప్టెంబర్ 9న సక్సెస్ మీట్ నిర్వహిస్తాం" అని ఎంతో ఆత్మవిశ్వాసంతో పేర్కొన్నారు. 'నాంది' చిత్రం తర్వాత తనకు సోలోగా ఆశించిన విజయం లభించలేదని అంగీకరించిన ఆయన, ఈ సినిమాతో ఆ లోటు తీరుతుందని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో నరేశ్ వీకే కూడా కీలక పాత్ర పోషించడంతో ప్రేక్షకులకు వినోదం రెట్టింపు అవుతుందని హామీ ఇచ్చారు. అక్కినేని నాగార్జున నిర్మాణంలో కథానాయకుడిగా నటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, నిర్మాతలు నిమ్మకాయల ప్రసాద్, రాజేశ్ దండా, దర్శకుడు చంద్ర మోహన్ చింతాడలకు కృతజ్ఞతలు తెలిపారు. కథానాయికలు రాశీ సింగ్, విష్ణు ప్రియా, ప్రషా సింగ్‌లు తమ పాత్రల్లో ఎంతో ఉత్సాహంగా నటించారని ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా వైవిధ్యమైన సీరియస్ పాత్రలు చేస్తున్న తాను, తిరిగి పూర్తిస్థాయి కామెడీతో ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉందని నరేశ్ పేర్కొన్నారు.



చేతిలో కొడవలి..

కమల్ కొత్త గేమ్ మొదలైంది!

'థగ్ లైఫ్' తర్వాత కమల్ హాసన్ హీరోగా ఏ సినిమా ముందుగా సెట్స్‌పైకి వెళ్తుందనే విషయంలో కొంత గ్యాప్ వచ్చింది. అన్బరివ్ దర్శకత్వంలో ఒక సినిమా ప్రకటించినా అది వెంటనే మొదలుకాలేదు. రజనీకాంత్‌తో చేయాల్సిన మరో ప్రాజెక్ట్ కూడా లైన్లో ఉంది. ఈ మధ్యలో ఎస్ యూ అరుణ్ కుమార్‌తో కొత్త సినిమాను కమల్ ప్రకటించారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ కూడా ఒకేసారి బయటకు వచ్చింది. శ్రీంశీ =ఝుస - కరీనా కపూర్ చదువుకుంది ఇంటరేనా? ఆ ఫోటోలో కమల్ చేతిలో పెద్ద కొడవలి పట్టుకుని కనిపించారు. బ్లాక్ షర్ట్, ఆలివ్ గ్రీన్ ప్యాంట్, గ్రే హెయిర్‌తో సింపుల్‌గానే ఉన్నా క్యారెక్టర్ మాత్రం రఫ్‌గా ఉండబోతోందనే ఫీలింగ్ ఇచ్చారు. సినిమా టైటిల్, కథ, పాత్ర గురించి ఇంకా ఏమీ చెప్పలేదు. కానీ రెగ్యులర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ కాకుండా డైరెక్ట్ గా కమల్ క్యారెక్టర్ లుక్‌తో ప్రాజెక్ట్‌ను పరిచయం చేయడం వల్ల మొదటి అప్డేట్‌కే కొంత క్యూరియాసిటీ వచ్చింది. అరుణ్ కుమార్ ఈసారి ఎలాంటి కథతో వస్తాడనే క్యూరియాసిటి కూడా పెరిగింది. పన్నయ్యారుమ్ పద్మినియుమ్, సేతుపతి, చిత్తా, వీర ధీర సూరన్ లాంటి సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా స్టార్ హీరో ఉన్నా కథలో పాత్రకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే దర్శకుడిగా ఆయనకు పేరు వచ్చింది. విక్రమ్‌తో చేసిన 'వీర ధీర సూరన్' తర్వాత ఇప్పుడు కమల్ హాసన్‌ను డైరెక్ట్ చేసే అవకాశం దక్కింది.

దీపావళికి ప్రభుదేవా 'మూన్‌వాక్'...

నటుడిగా ఏఆర్ రెహమాన్ అరంగేట్రం!

తమిళంతో పాటు తెలుగు, హిందీలో ఒకేసారి విడుదల ప్రముఖ నటుడు, నృత్య దర్శకుడు ప్రభుదేవా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మూన్‌వాక్' ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించడమే కాకుండా, తొలిసారి వెండితెరపై నటుడిగానూ మెరవనున్నాడు. ఇందులో ఆయన ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

మనోజ్ ఎన్.ఎస్. దర్శకత్వంలో బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వినోదం, సంగీతం, నృత్యం ప్రధానాంశాలుగా సాగే ఈ సినిమాను ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించినట్లు చిత్రబృందం పేర్కొంది. ఇందులో ప్రముఖ హాస్యనటుడు యోగిబాబు ఏకంగా 16 విభిన్న పాత్రలు పోషిస్తుండటం విశేషం. అజు వర్గీస్, అర్జున్ అశోకన్, నిష్మా, సుస్మిత, రెడ్డిన్ కింగ్స్‌లీ, మొట్టై రాజేంద్రన్ వంటి భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తున్నారు.

పండుగ వాతావరణంలో కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దామని దర్శకుడు మనోజ్ వెల్లడించాడు. "దీపావళి పండుగ కుటుంబాల మధ్య అనుబంధాన్ని పెంచుతుంది. మా 'మూన్‌వాక్' సినిమా కూడా అదే తరహాలో నవ్వులు, నాట్యం, సంగీతంతో కూడిన ఒక వేడుకలా ఉండాలని ఆశిస్తున్నాం" అని ఆయన వివరించాడు. ఇప్పటికే విడుదలైన 'యేతు', 'టింగా', 'మకరీనా' పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభించగా, త్వరలో ప్రభుదేవా, ఏఆర్ రెహమాన్ కలిసి కనిపించనున్న 'మయిలే' అనే నాలుగో గీతాన్ని విడుదల చేయనున్నారు.

తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కానుంది. అనూప్ వి. శైలజ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, రోమియో పిక్చర్స్ ప్రపంచవ్యాప్తంగా పంపిణీ హక్కులను, లహరి మ్యూజిక్ ఆడియో హక్కులను సొంతం చేసుకున్నాయి.

చిన్నగా మొదలైన హిందీ హనుమాన్.. ఇప్పుడు హోంబలేతో..

'హనుమాన్ అంష్' పేరు తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం ఉండకపోవచ్చు. ఇది ఆగస్టు 7న హిందీలో విడుదలైన చిన్న బడ్జెట్ భక్తి చిత్రం. నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించారు. పెద్ద స్టార్ కాస్ట్ లేదు, భారీ ప్రమోషన్ కూడా జరగలేదు. మొదటి రోజు ఇండియాలో రూ.10 లక్షల దగ్గరే ఓపెన్ అయింది. కానీ అక్కడి నుంచి మౌత్ టాక్‌తో సినిమా ఊహించని రేంజ్‌లో పెరిగింది. ఇప్పుడు అదే సినిమా ఓవర్సీస్ రిలీజ్‌కు సిద్ధమైంది. దాదాపు రూ.2 కోట్ల బడ్జెట్‌తో తీసిన 'హనుమాన్ అంష్' నాలుగో వారం వరకు థియేటర్లలో నిలబడింది. 27 రోజులకు ఇండియా నెట్ రూ.61 కోట్లకు పైగా చేరినట్టు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. మొదటి వారం నెమ్మదిగా వెళ్లిన సినిమా, తర్వాతి రోజుల్లో కలెక్షన్స్ పెంచుకుంది. పెట్టిన బడ్జెట్‌తో పోలిస్తే చాలా పెద్ద రిటర్న్ రావడంతో ఒక్కసారిగా బాలీవుడ్‌లో ఈ సినిమా గురించి మాట్లాడటం మొదలైంది. సినిమా నీమ్ కరోలి బాబా భక్తి, సేవ, హనుమంతుడిపై ఉన్న నమ్మకం చుట్టూ సాగుతుంది. 'డివైన్ డీటూర్' అనే పుస్తకం ఆధారంగా కథను తీసుకున్నారు. శోభినవ్ సత్యా ప్రధాన పాత్రలో నటించారు. ఇప్పటివరకు హిందీ మార్కెట్‌లోనే నడిచిన ఈ చిన్న సినిమాకు ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ ఎంట్రీ ఇచ్చింది. 'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' లాంటి పెద్ద సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న సంస్థ, 'హనుమాన్ అంష్' ఓవర్సీస్ రిలీజ్ బాధ్యత తీసుకుంది. హోంబలే ఓవర్సీస్ ద్వారా సెప్టెంబర్ 11 నుంచి అంతర్జాతీయ మార్కెట్లలో సినిమాను విడుదల చేయబోతున్నారు. ఫార్స్ ఫిల్మ్ కూడా ఈ రిలీజ్‌లో భాగమవుతోంది. రూ.2 కోట్ల చిన్న సినిమా, రూ.10 లక్షల ఓపెనింగ్ నుంచి మొదలై నెల రోజుల్లోనే ఇలాంటి పెద్ద డిస్ట్రిబ్యూషన్ సంస్థ దగ్గరకు వెళ్లడం హైలైట్. పైగా నీమ్ కరోలి బాబాకు విదేశాల్లో కూడా ఫాలోయింగ్ ఉంది. అందుకే ఇండియాలో వచ్చిన రెస్పాన్స్ ను చూసిన తర్వాత ఓవర్సీస్‌లో కూడా సినిమాకు మంచి అవకాశం ఉందని హోంబలే భావించినట్టు కనిపిస్తోంది. సెప్టెంబర్ 11 నుంచి 'హనుమాన్ అంష్'కు కొత్త లెక్క మొదలవుతుంది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com